అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 16-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 208

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50

జీఎస్టీ ఎగవేత విలువ రూ.2 లక్షల కోట్లు



న్యూఢిల్లీ : జీఎస్టీ ఎగవేతల విలువ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.01 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందుకు సంబంధించి 6,084 కేసులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) గుర్తించింది. ఆన్‌లైన్ గేమింగ్, బీఎఫ్ఎస్ఐ, ఇనుము, రాగి, స్క్రాప్ విభాగాల్లో అత్యధిక ఎగవేతలు నమోదయ్యాయని ...10లో



ప్రజా హక్కుల ఛాంపియన్

సోషలిస్టు శక్తులను ముందుండి నడిపారు

వామపక్ష కృషీవలుడు ఏచూరికి ప్రపంచ కమ్యూనిస్టు నేతల ఘన నివాళి

న్యూఢిల్లీ : కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం తీరని లోటని ప్రపంచ దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. సోషలిస్టు దేశాలతో పాటు పాలస్తీనా, రష్యా, సిరియా రాయబారులు న్యూఢిల్లీలోని సీపీఐ (ఎం) కేంద్ర కార్యాలయాన్ని సందర్శించి ఏచూరి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన విషయం తెలిసిందే. వారంతా ఏచూరితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఏచూరి నిర్వహించిన పాత్రను కొనియాడారు. నికరాగ్వువా అధ్యక్షుడు డేనియల్ ఆర్టెగా పార్టీకి సంతాప సందేశం పంపారు. 'ఈ రోజు మనం చాలా విచారకరమైన వార్త విన్నాము. ఆయన అంకితభావం అసమానమైనది. అనేక ప్రజా ఉద్యమాలకు ఆయన సంఘీభావం తెలిపే వారు. ప్రజల హక్కులకు ఛాంపియన్‌గా నిలిచారు. చిత్తశుద్ధితో పనిచేసే వారు. న్యాయం కోసం, సత్యం కోసం, మానవ సమాజం కోసం ఎన్నో పోరాటాలు చేశారు' అని నివాళి అర్పించారు. పొలిసారియో ఫ్రంట్, సహ్‌రావీ రిపబ్లిక్ ప్రజల తరఫున విదేశాంగ మంత్రి మహమ్మద్ సిదాతీ సంతాప సందేశం పంపారు. 'సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఏచూరి అంకితభావం, సేవలు ప్రశంసనీయం. అంతర్జాతీయంగా ప్రజా హక్కుల పరిరక్షణకు ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన వదిలి వెళ్లిన వారసత్వాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఏచూరి అత్యుత్తమమైన నాయకుడని, మార్క్సిస్టు సిద్ధాంతకర్త అని చైనా కమ్యూనిస్టు పార్టీ తన సంతాప సందేశంలో కొనియాడింది. వామపక్ష ఉద్యమాన్ని, సోషలిస్టు శక్తులను ముందుకు నడిపించడంలో ఆయన ముఖ్య భూమిక నిర్వహించారని తెలిపింది. దేశాభివృద్ధి ...12లో



ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

2023 సెమీ ఫైనల్స్‌లో గెలిచాం | ఫైనల్స్ గెలవాలి

రాహుల్‌ను ప్రధాని చేయడమే మన లక్ష్యం

రాష్ట్రం నుంచి 15 ఎంపీ స్థానాలు గెలవాలి : సీఎం రేవంత్

టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

వివరాలు 3లో

కౌన్ బనేగా ఢిల్లీ సీఎం

మనీశ్ సిసోడియా కాకపోతే క్యూలో ఎవరన్న దానిపై చర్చ

న్యూఢిల్లీ: బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేజ్రీవాల్ సీఎం కుర్చీ దిగితే.. చీపురు పార్టీలో నెక్స్ట్ కాబోయే ముఖ్యమంత్రి ఎవరు..? ఆప్ అధినేత ఎవరిని ఆ కుర్చీలో కూర్చోబెడతారనే చర్చ కూడా మొదలైంది.

'రెండు రోజుల తర్వాత సీఎం పదవికి రాజీనామా చేస్తాను' అని కేజ్రీవాల్ ప్రకటించారు. నేను నిజాయితీపరుడని ప్రజలు తీర్పు ఇచ్చేంత వరకు సీఎం కుర్చీలో కూర్చోను అని చెప్పడంతో పాటు, ప్రజలు తీర్పు ఇచ్చేంత వరకు తామెవరమూ ఏ పదవిని తీసుకోబోమని మనీశ్ సిసోడియా తరఫున ఆయన అన్నారు.

సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా ప్రకటన చేశాక.. ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభా పక్షం సమావేశం కాగానే సీఎం పదవికి ఎవరిని ఎంపిక చేస్తారన్న చర్చ సాగుతోంది. ఈ ప్రశ్నకు సమాధానంగా, ప్రస్తుతం నాలుగు పేర్లు వెలువడుతున్నాయి, దానిపై చాలా ఊహాగానా



లున్నాయి. ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అతిశిపై కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకం ఉన్నది. ఆయన జైల్లో ఉన్నప్పుడు ప్రభుత్వపరమైన కార్యక్రమాల నిర్వహణా బాధ్యతలను ఆమెకు అప్పగించారు. అతిశితో పాటు రెండో స్థానంలో సీఎం కేజ్రీవాల్ భార్య సునీత పేరు కూడా వినిపిస్తున్నది. ఇటీవల పార్టీ పరమైన కార్యక్రమాలను భుజాలపై వేసుకుంటున్న ...3లో

కేజ్రీవాల్ రాజీనామా?

- రెండు రోజుల్లో సీఎం పదవి వదిలేస్తా: ఢిల్లీ ముఖ్యమంత్రి
- పబ్లిసిటీ స్టంట్ : బీజేపీ, కాంగ్రెస్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు, నిజాయితీ పరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంతో ఆరు నెలల తర్వాత శుక్రవారం ఆయన తీహార్ జైలు నుంచి విడుద లయ్యారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాల యంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కష్టాల్లో ఉన్నప్పుడు సాక్షాత్తు భగవంతుడే తమతో ఉండి ముందుకు నడిపించాడని ...11లో



చిల్లర రాజకీయం

సీఎం రేవంత్ సమస్యలను పక్కదారి పట్టించేందుకే బూతు పురాణం

రైతు రుణమాఫీపై సర్కార్ లెక్కలన్నీ అబద్దాలే :

మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం తనపై చేసిన వ్యాఖ్యలకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎంపై నిప్పులు చెరిగారు. "రెండు రకాల వరదలతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఒకటి వర్షాలతో వచ్చిన వరద అయితే, రెండు చిల్లర ముఖ్యమంత్రి అబద్ధాల వరద. వరదలతో వచ్చిన బురదను కడుక్కోగలుగుతున్నం. కానీ ముఖ్యమంత్రి నోటి నుంచి వస్తున్న మురుగు బురదను మాత్రం కడగలేకపోతున్నాం.మోరీల కంపును మించి పోయింది ముఖ్యమంత్రి నోటి కంపు. రాజీనామా చేస్తానన్న సన్నాసి ఎక్కడ దాక్కున్నాడని మాట్లాడుతుండు. నేను నీ గుండెల్లో దాక్కున్నా. అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తు చేస్తా. సర్కార్ మెడలు వంచి సగం రుణమాఫీ చేయించాను. మిగతా సగం రుణమాఫీ చేసేంత వరకు వెంట పడుతూనే ఉంటా. రాష్ట్రంలో 42 లక్షల మందికి రుణమాఫీ జరిగేదాకా నిద్ర పోను" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నా ఎత్తు గురించి మాట్లాడుతున్న సీఎం, ...10లో



వివాదాల సుడిగుండంలో సెబీ చీఫ్

ఆది నుంచీ అన్నీ ఆరోపణలే

స్వతంత్ర సమీక్ష అవసరమంటున్న అధికారులు

వివరాలు 3లో..

సాయుధ పోరాట వారసులు

కమ్యూనిస్టులే

ప్రభుత్వాలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

భూ పోరాటాలు ఉధృతం చేయాలి

వార్షికోత్సవ సభలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సామాజిక వివక్ష అణిచివేత మీద సమైక్య పోరాటమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని, ఆ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా భూ పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలోని పెరుమాండ్ల జగన్నాథ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. నిజాం పాలనలో దోపిడీకి వ్యతిరేకంగా 1946



సెప్టెంబర్ 11 నుంచి 1951 అక్టోబర్ 21 వరకు ఐదేండ్లపాటు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందని అన్నారు. ప్రపంచ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటమని తెలిపారు. గ్రామాల్లో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా భూస్వాములు, జమీందారులు, దేశ్‌ముఖ్‌ల దోపిడీకి వ్యతిరేకంగా మొదలైన ఈ పోరాటం.. నిజం రాచరిక నిరంకుశ పాలన మీద తిరుగుబాటుగా మారిందని అన్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా ఊరంతా ఏకమై తిరగబడటం పోరాటం ప్రత్యేకత అని తెలిపారు. 1951లో భారత దేశంలో తెలంగాణ విలీనం తర్వాత కూడా పటేల్ సైన్యాలకు ఈ రజాకార్లు సహకరించారని, సైన్యంతో పాటు రైతాంగం మీద దాడులు చేశారని గుర్తుచేశారు. 1945లో ...11లో



వీడని కులవివక్ష

దప్పు కొట్టనందుకు.. దళిత కుటుంబం బహిష్కరణ

పంచాయితీ పెట్టి నిలదీసిన పెద్దమనుషులు

దప్పు కొట్టకపోతే ఇనాం భూమి ఇచ్చేయాలని డిమాండ్

ఆ కుటుంబంతో మాట్లాడినోళ్లకు 25 చెప్పుదెబ్బలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్మానం

చదువుకుంటే దప్పు కొట్టరా అని నిలదీత, తిట్ల పురాణం

బాధితుల పిర్యాదుతో మొక్కుబడి కౌన్సెలింగ్

ఆలస్యంగా 18 మందిపై కేసు.. పరారీలో నిందితులు

దోషుల్ని కఠినంగా శిక్షించాలి: కేవీపీఎస్ 2లో..

అంతరిక్షంలోకి అడుగుపెట్టే స్థాయికి ఎదిగినా.. తోటి మనిషిని మనిషిగా చూడలేని దుస్థితిలోనే ఉండిపోతున్నారు. కులాధిపత్య భావజాలంతో ఇంకా కుల వివక్ష చూపుతూనే ఉన్నారు. ఎక్కడో మారుమూల పల్లెల్లోనే కాదు హైదరాబాద్‌కు కూతవేటు దూరంలోని మనోహరాబాద్ ప్రాంతంలో దప్పు కొట్టడం వీలు కాదని చెప్పినందుకు ఒక దళిత కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేశారు. "ఉన్నత చదువులు చదివినంత మాత్రానా దప్పు కొట్టడం మానేస్తారా..? దప్పు కొట్టకపోతే సర్కారిచ్చిన ఇనాం భూమిని తిరిగిచ్చేయండీ.. ఊర్లో చావు, పెండ్లిండ్లు, పండుగలాంటి శుభ, అశుభ కార్యమేదైనా సరే మీరు వచ్చి దప్పులు కొట్టాల్సిందే.. కాదంటే ఊరి నుంచి బహిష్కరిస్తం.. మీతో ఎవ్వరూ మాట్లడరు. ఎలాంటి సహాయం చేయరు. ఎవరైనా మాట్లాడితే వారికి 25 చెప్పు దెబ్బలతో పాటు రూ.5 వేల జరిమానా తప్పదు' అంటూ ఊరంతా కలిసి తీర్మానించారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగం చేసుకుంటున్న దళిత యువకులు ఆత్మాభిమానాన్ని చంపుకుని దప్పుకొట్టే వెట్టి వృత్తిని చేయబోమని తేల్చి చెప్పడం పెద్ద నేరంగా భావించిన కొందరు పెద్ద మనుషులు, మాజీ ప్రజాప్రతినిధులు కుల ఆధిపత్య భావజాలాన్ని ప్రదర్శించారు.



ఎన్ఈపీపై కేంద్రం

మాటల గారడీ

పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాల్సిందే

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

- పెండింగ్ డీఏలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగం, ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ విధానం పట్ల మభ్యపెట్టే గారడీ మాటలు ఇక చెల్లబోవని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పాఠశాల విద్యకు నిధులు పెంచాల్సిన అవసరముందన్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అది తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదనీ, అందుకోసం అవసరమైన బలమైన ...11లో

వంతెన లేదు.. వాగు దాటలేరు

దశాబ్దాలుగా గిరిజనుల ఇబ్బందులు | వర్షాకాలంలో తరుచూ రాకపోకలకు అంతరాయం

నవతెలంగాణ-జన్నారం

వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదల వుతుంది. వరదలు రావడం.. వాగులు పొంగిపొర్లడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసం "మైనా వెళ్లలేని పరిస్థితి. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గిరి పల్లెల బాధలు ఇవి. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే గిరిజనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోతొర్రె గోండుగూడ, రోటిగూడ వాగులపై వంతెనలు లేక అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటితే తప్ప వెళ్లలేని పరిస్థితి. గతంలో ఓ రైతు ఎడ్లబండితో వాగును దాటుతుండగా ఉధృతి పెరిగి ఎండ్లబండితో పాటు రెండు ఎద్దులూ కొట్టుకుపోయాయి. ప్రాణాపాయ స్థితిలో రైతు బయటపడ్డాడు. ఇలా

నిధులు మంజూరైనా పనులకు నోచుకోని వైనం



వాగులు ఉప్పొంగితే.. దిగ్బంధనమే..

జన్నారం మండలంలోని లోతొర్రె గ్రామం, గోండుగూడ, రోటిగూడ గ్రామాలతో పాటు పలు ఇతర గ్రామాలకు సైతం వాగులపై వంతెనలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతొర్రె, దేవుని గూడ గ్రామాలకి మధ్యలో ఉన్న వాగుతో సహా, వర్షాకాలం వచ్చిందంటే కవ్వాల్‌టైగర్ జోన్‌లోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తాయి. దాంతో రోజుల తరబడి లోతొర్రె, చిన్న లోతొర్రే గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. రోజుల తరబడి బిక్కుబిక్కుమంటూ జీవనం వెళ్లదీసే పరిస్థితి నెలకొంటుంది. ఆరోగ్యం, అత్యవసర సమయంలో ...11లో

ప్రతిసారి అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం జరుగుతోంది. ఫలితంగా ఈ ఏడాది కూడా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వమైనా ప్రత్యేక చొరవ చూపి మూడు వాగులపై వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ...11లో

ఆర్టిజన్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

- వెనక్కి తగ్గం..పోరాటాలు తథ్యం..విజయమే లక్ష్యం :
తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆవిర్భావం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను శాశ్వత ఉద్యోగులుగా (కన్వర్షన్) గుర్తించాలని పలువురు నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం వెనక్కి తగ్గేది లేదనీ, పోరాటాలు తథ్యమని స్పష్టం చేశారు. ఆదివారంనాడిక్కడి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ సమావేశం జరిగింది. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23,667 మంది కార్మికులను ఏకతాటిపైకి తెస్తూ యూనియన్లు అన్నీ కలిసి జేఏసీగా ఏర్పడ్డాయని చైర్మెన్ కే ఈశ్వరరావు (టీజీయూఈఈయూ-సీఐటీయూ) తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఎమ్ఏ వజీర్ (టీఎస్‌పీఈయూ-1535), కో చైర్మెన్లు బీ భాస్కర్ (ఏఐటీయూసీ-హెచ్64), వీ నరేందర్, సీహెచ్ ఎల్లయ్య (బీవీఏయూ-541), కో కన్వీనర్లు గంబో నాగరాజు (టీవీడబ్ల్యూయూ-2871), జీ అర్వింద్‌కుమార్ (టీవీడీఈఏ-హెచ్579), వీ తిరుపతి (టీఆర్ఎస్‌కేఎస్-హెచ్58) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్ల కన్వర్షన్ సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. కార్మికులను గ్రేడ్స్ రూపంలో విడదీసి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. శాశ్వత ఉద్యోగులు చేసే పనుల్నే ఆర్టిజన్ కార్మికులు కూడా చేస్తున్నారనీ, అలాంటప్పుడు ఒకే సంస్థలో రెండు రకాల విధివిధానాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందనీ, అనేక పోరాటాల తర్వాత ఆర్టిజన్ పేరుతో ప్రత్యేకమైన స్టాండింగ్ ఆర్డర్స్ తెచ్చి మోసం చేశారని అన్నారు.

ఏపీఎస్‌ఈబీకి రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకమైన రూల్స్ రూపొందించి, ఆర్టిజన్ అనే పేరు తగిలించి, శ్రమదోపిడీ చేయడం అన్యాయమని చెప్పారు. ఇకపై ప్రభుత్వాల జిమ్మిక్కులకు మోసపోయేది లేదనీ, ఆర్టిజన్లంతా ఏకమై, ఐక్య పోరాటాలతో కన్వర్షన్ పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ వ్యవస్థను కొనసాగిస్తూనే, జేఎల్ఎమ్, జూనియర్ అసిస్టెంట్స్, సబ్ ఇంజినీర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్ని రిక్రూట్ చేసుకొనే ప్రయత్నం చేస్తున్నదనీ, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఖాళీ పోస్టుల్ని ఆర్టిజన్స్‌తో భర్తీ చేయాలనీ, దీనివల్ల విద్యుత్ సంస్థలపై అదనంగా ఎలాంటి ఆర్థికభారం పడబోదని స్పష్టం చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం జేఏసీగా త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జాయింట్ సెక్రటరీలు ఎస్ చంద్రారెడ్డి, కే లింగం, కే కృష్ణ, పీ మురళి, కే రఘునాథ్‌రెడ్డి, జీ స్వామి, వీ ప్రభుదాస్, మీడియా ఇంచార్జి జే ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో ఆర్టిజన్లు హాజరయ్యారు.

మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి బీఆర్ఎస్‌వీ యత్నం

- జీఓ నెం. 33ను రద్దు చేయాలని ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు, గెల్లు శ్రీనివాస్‌తో పాటు పలువురు నేతల అరెస్ట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీఓ నెం. 33ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌నుంచి బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌కు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని రోడ్డు పైకి రాకుండా నిలువరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌వీ కార్యకర్తలకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్ల కార్డులు, జెండాలు పట్టుకొని నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ సహా విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పలువురు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు పోలీసుల కండ్లుగప్పి మినిస్టర్ క్వార్టర్స్ ముందు బైఠాయించారు. జీవో33ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. స్థానిక విద్యార్థులకే మెడికల్ సీట్లు కేటాయించాలనీ, ఈ జీవోతో స్థానిక విద్యార్థులకు నష్టం జరుగుతోందని నినాదాలు చేశారు. గణేశ్ నిమజ్జనాలు జరుగుతున్న వేళ ఆందోళనలు చేయవద్దనీ, ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మని పోలీసులు చేసిన విజ్ఞప్తి లెక్కచేయకుండా నిరసన చేపట్టారు. దాంతో బలవంతంగా వారిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

జీవో 33తో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం: గెల్లు

జీవో నెంబర్ 33 వల్ల తెలంగాణ స్థానిక విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్ర విద్యార్థులకు కన్వీనర్ కోటలో సీట్లు అమ్ముకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. తెలంగాణలో పుట్టిన ప్రతి విద్యార్థి స్థానికుడేననీ, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 33పై సుప్రీంకోర్టులో వేసిన అప్పీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా..
పోరాడటమే సాయుధ పోరాట అమరులకు నిజమైన నివాళి



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మతోన్మాదం, కార్పొరేట్ సంస్థలు కలిసి ప్రజలపై చేస్తున్న దాడులను ఎదుర్కోవాలని, వారికి వ్యతిరేకంగా పోరాడటమే సాయుధ పోరాట అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వజ్రోత్సవాల సందర్భంగా సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చార్మినార్ వద్ద బహదూర్‌పురా జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో అబ్బాస్ మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని తెలిపారు. ఆనాడు దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని.. బీజేపీ ముస్లింలకు, హిందువులకు మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించి చరిత్రకు వక్రభాష్యాలు చెప్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన ఈ మహోన్నతమైన పోరాటంలో దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, రాన్ నాయక్, షోయబుల్లాఖాన్, మగ్దూం మొహియుద్దీన్, జవ్వాద్ రజ్వీ, ఆలం ఖుందుమీరి, షౌకత్ ఉస్మాని లాంటి ఎందరో వీరులు అసువులు బాసారని గుర్తుచేశారు. వీళ్లంతా కులమతాలతో సంబంధం లేకుండా భూస్వాముల అణిచివేతకు, దోపిడీకి, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, సుందరయ్యతో పాటు మగ్దూం మొహియుద్దీన్ ఉన్న విషయాన్ని మర్చిపోకూడదని అన్నారు. అలాంటప్పుడు హిందూ, ముస్లింల మధ్య పోరాటం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజలను పట్టిపీడించి వెట్టిచాకిరి చేయించుకున్న వారిలో విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారం ప్రతాపరెడ్డి లాంటి హిందువులైన జమీందారులు, జాగిర్దారులు, దొరలు, దేశ్ ముఖ్‌లు, భూస్వాములు, పటేల్, పట్వారీలే మెజారిటీగా ఉన్నారని తెలిపారు. వీరి ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఐక్యంగా సాగించిన పోరాటాన్ని మతం పేరుతో ఎలా వక్రీకరిస్తున్నారని ప్రశ్నించారు. ఇది ప్రజల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా బలిదానం చేసిన రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాలను కించపరచడమేనని అన్నారు. ప్రజలు వాస్తవ చరిత్రను తెలుసుకోవాలన్నారు. అమరులను గుర్తు చేసుకోవడం అంటే.. మతోన్మాదుల ఆగడాలకు, కార్పొరేట్ సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటమే నేడు మన ముందున్న కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.విఠల్, ఎం. మీనా, పి.నాగేశ్వర్, ఎల్. కోటయ్య, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మమ్మ, ఎం. బాలునాయక్, ఎం. శ్రావణ్ కుమార్, జంగయ్య, శశికళ, కిషన్ నాయక్, బాబర్ ఖాన్, కృష్ణ నాయక్, రామ్ కుమార్, జోన్ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి జేవీవీ కృషి

8 తీర్మానాలకు రాష్ట్ర కమిటీ ఆమోదం

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

జన విజ్ఞాన వేదిక విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తూ, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చాలా యాక్టీవ్‌గా పని చేస్తున్నదని జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకట్‌రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక 5వ రాష్ట్ర మహాసభల సందర్భంగా అనుపురం కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాల్లో టీచర్స్‌కు ట్రెనింగ్ కూడా ఇస్తున్నామని, విద్యా రంగంతోపాటు వివిధ రంగాల్లో కూడా పని చేస్తున్నామని తెలిపారు. జేవీవీ మాజీ అధ్యక్షులు అందె సత్యం మాట్లాడుతూ.. జేవీవీ అక్షరాశ్యతను పెంపొందించడానికి కృషి చేస్తున్నదని చెప్పారు. నేడు చేతబడులు చాలా వరకు తగ్గాయనీ, హత్యలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పని చేస్తూ పోలీస్ శాఖ సహకారంతో కలిసి ముందుకెళ్తున్నామని అన్నారు. విద్యా శాస్త్రీయత పెరిగితే ప్రపంచంతో పోటీ పడవచ్చని అన్నారు. పబ్లిక్ హెల్త్‌ను ఇంకా మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. హైడ్రాను జేవీవీ అభినందిస్తుందనీ, పేదలు ఉంటే ప్రత్యామ్నాయం చూపించాలని తెలిపారు. ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. జేవీవీ అగ్రికల్చర్, సైన్స్, ఎన్విరాన్మెంట్ లాంటి సమస్యలపై పని చేస్తుందని తెలిపారు. ప్రతి ఏడాదీ దాదాపు 6.5 లక్షల మంది విద్యార్థులకు చెకుముఖి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జేవీవీ ఉపాధ్యక్షులు రమాదేవి మాట్లాడుతూ.. ప్రజారోగ్యంపై జేవీవీ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తుందన్నారు. చేప మందు తీసుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని జేవీవీ నిరూపించినట్టు తెలిపారు. వైద్యం పేద ప్రజలకు అందుబాటులో లేదనీ, పటిష్ట పర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్‌ను నియంత్రిస్తూ, ప్రజలకు పబ్లిక్ హెల్త్ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌ను అభివృద్ధి చేయాలి కోరారు. ప్రజారోగ్యంపై భవిష్యత్‌లోనూ పని చేస్తామని తెలిపారు. చెకుముఖి ఎడిటర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల్లో సైంటిఫిక్ టెంపర్‌ను కలిగించడం తమ ప్రాథమిక కర్తవ్యం అన్నారు. చెకుముఖి పుస్తకంలో అన్ని రకాల వివరాలు ఉన్నాయనీ, ఇది లార్జెస్ట్ సర్క్యులర్ సైన్స్ మంత్లీగా ఉందని తెలిపారు. విద్యార్థుల్లోకి సైన్స్‌ను తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కొన్ని తీర్మానాలను ఆమోదించారు.

ఆమోదించిన తీర్మానాలు

మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలన్నారు. విద్యా కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తూ, శాస్త్రీయమైన విద్యా విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, పాఠశాల, ఉన్నత విద్యలో మతపరమైన అంశాలు బోధనాంశాలుగా ఉండకూడదని తీర్మానించారు. విద్య వైద్యం ప్రభుత్వం ఆధీనంలో ఉండాలని, వైద్య కళాశాలలు, వైద్య సేవలపై వ్యాపార ధోరణుల్లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శాస్త్ర సాంకేతిక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర కేంద్రంలో తెలంగాణ సైన్స్ మ్యూజియంను, జిల్లాల్లో సైన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. హైడ్రాను సమర్థవంతంగా నిర్వహించాలని, చట్టబద్ధంగా అనుమతి ఉన్న మధ్యతరగతి నిర్మాణాలను కులగొట్టకూడదని, పేదలకు ప్రత్యేక ప్రత్యామ్నాయ గృహవసతి కల్పించాలని, చెరువులు, కుంటలతోపాటు అడవుల సంరక్షణ కూడా హైడ్రా పరిధిలోకి తీసుకోవాలని తీర్మానం చేశారు. మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్‌లను నిషేధించాలని, పాఠశాల, కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ తరగతిని ఖచ్చితంగా ప్రతిరోజూ నిర్వహించాలని తీర్మానించారు.

జేవీవీ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




జన విజ్ఞాన వేదిక నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులుగా చెలిమెల రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ బీఎస్.రెడ్డి, ఎస్.జితేందర్, అలవాల నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, రావుల వరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజా, కార్యదర్శులుగా రవీందర్‌రెడ్డి, గంగరాజు, వెంకట రమణారెడ్డి, మహేంద్రం, శ్రీనివాసరావు, వెంకట రమణను ఎన్నుకున్నారు. కోశాధికారిగా నాగరాజుతోపాటు మొత్తం 25 మందిని రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సోమవారం సాయంత్రం 3.45 గంటలకు హైదరాబాద్ సచివాలయం ముందు ఆవిష్కరించున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, మేయర్లు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

వీడని కులవివక్ష

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని గౌతోజిగూడ గ్రామంలో దళిత కుటుంబమైన పంచమి శంకరయ్య, నరసమ్మ దంపతులకు చంద్రం, అర్జున్ ఇద్దరు కుమారులున్నారు. వీరు జేఎన్‌టీయూలో ఉన్నత చదువులు చదువుకుని హైదరాబాద్‌లో ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. ఊర్లో నివాసముంటున్నా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా, ఆ ఇద్దరు యువకులు ఊర్లో చావులు, పెండ్లిండ్లు, పండుగలకు దప్పు కొట్టడం తమకు వీలు కాదన్నారు. వాళ్ల తండ్రి శంకరయ్య బతికున్నంత కాలం ఊర్లో దప్పు కొట్టేవారు. ఆయన చనిపోయాక పెద్ద కొడుకు చంద్రం కూడా కొంత కాలం దప్పు కొట్టాడు. అయితే ఉద్యోగం చేస్తూ ఊర్లోకి వచ్చి దప్పు కొట్టాల్సి రావడంతో ఇబ్బందిగా ఉండేది. అయినా ఊరి వాళ్ల ఒత్తిడితో ఇబ్బంది పడుతూ దప్పు కొట్టేందుకు మూడు రోజుల పాటు ఊర్లో ఉండటంతో ఇటీవల అతని ఉద్యోగం పోయింది. దాంతో ఊర్లో పాతకాలం నాటి వెట్టి వృత్తి అయిన దప్పు కొట్టడాన్ని మానేవేయాలని భావించారు. ఒక పక్క ఉద్యోగం వదిలొచ్చి ఊర్లో దప్పు కొట్టడం వీలుకాకపోవడం, మరో పక్క ఉన్నత చదువులు చదివి చావు, పండుగలు, పెండ్లిండ్లకు దప్పు కొట్టి చిన్నచూపునకు గురికావడం ఇష్టంలేని చంద్రం, అర్జున్ కొంత కాలంగా దప్పు కొట్టేందుకు వెళ్లడంలేదు. ఈ నెల మొదటి వారంలో ఊర్లో ఓ వ్యక్తి చనిపోయాడు. అంత్యక్రియలకు డప్పుకొట్టేందుకు శంకరయ్య కొడుకులు వెళ్లలేదు. దాంతో ఊర్లో ఉన్న బీసీ, ఎస్సీ ఇతర కులస్తులంతా నిలదీశారు. ఈ నెల 10 న పంచాయితీ పెట్టి చంద్రం, అర్జున్‌ను పిలిచారు. ఊర్లో ఎలాంటి కార్యమైనా తప్పని సరిగా దప్పు కొట్టేందుకు మీరు రావాలని పెద్ద మనుషులు హుకుం జారీ చేశారు. ఎంత చదివితే మాత్రం కుల వృత్తి మానేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కొట్టకపోతే ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమిని తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. చెప్పడానికి వీల్లేని బూతులు తిడుతూ అందరి ముందు అవమానపరిచారు. ఇష్టం లేని పనిని బలవంతంగా చేయాలని డిమాండ్ చేయడం సరైంది కాదని చంద్రం, అర్జున్ అన్నారు. దాంతో ఊర్లోని పెద్దమనుషులంతా కక్షకట్టి మాజీ సర్పంచ్ బొడ్డు వెంకటేశం, ఉప సర్పంచ్, ఇతర పెద్దమనుషులు ఆ ఇద్దరు దళిత యువకుల్ని బూతులు తిడుతూ మేం చెప్పినట్టు చేయకపోతే ఊర్లోంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. మీ కుటుంబంతో ఊర్లో వాళ్లెవ్వరూ మాట్లాడటం, సహాయం చేయడం చేయబోరంటూ బెదిరించారు. అన్నట్టుగానే పెద్ద మనుషులంతా కలిసి తీర్మానం చేశారు. శంకరయ్య, నర్సమ్మ కుటుంబాన్ని సాంఘీకంగా బహిష్కరిస్తున్నట్టుగా తీర్మానంలో పేర్కొన్నారు. ఎవరైనా ఆ కుటుంబంతో మాట్లాడితే 25 చెప్పు దెబ్బలు, రూ.5 వేల జరిమానా విధిస్తున్నట్టు రాశారు. ఊరంతా ఒక్కటిగా ఉండి శంకరయ్య కుటుంబాన్ని ఊర్లోకి రాకుండా చేయాలని నిర్ణయించారు.

బాధితుల ఫిర్యాదు.. మొక్కుబడి కౌన్సెలింగ్

బాధితులైన అర్జున్, చంద్రం తమకు ఊర్లో జరిగిన అవమానం, అన్యాయం గురించి ఎక్స్‌లో మెదక్ ఎస్పీ ఉదయకుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దాంతో స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ ఊర్లోకి వచ్చి పరిశీలించారు. ఫిర్యాదు దారుల్ని ఊర్లోకి రమ్మని చెప్పారు. ఊర్లోకి రావొద్దని బహిష్కరించాక తామెందుకు వస్తామని అర్జున్, చంద్రం చెప్పడంతో అధికారుల బృందం ఊర్లోని తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ ఇతర పెద్దమనుషులకు తూతూ మంత్రంగా కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లిపోయారు. సాంఘీక బహిష్కరణ చేస్తూ సమాజం అంగీకరించిన ఆంక్షలు పెట్టి తీర్మానం రాసి సంతకాలు చేసిన సంఘటనను చాలా సింపుల్‌గా తీసుకున్నారు.

18 మందిపై అట్రాసిటీ కేసు.. పరారీలో నిందితులు

డప్పుకొట్టబోమని చెప్పినందుకు దళిత కుటుంబాన్ని సాంఘీక బహిష్కరణకు గురి చేసిన వ్యక్తులపై కఠినంగా కేసు పెట్టి శిక్షించాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు మీన మేషాలు లెక్కబెట్టారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయితే బాధిత యువకులు ఉన్నత చదువులు చదువుకున్న వాళ్లుకావడంతో వాళ్లకు ఉన్న పరిచయాల వల్ల జేఎన్‌టీయూ ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్ల ఫోరం, హైకోర్టు ఎస్సీ లాయర్ల ఫోరం, కేవీపీఎస్ వంటి ప్రజా సంఘాలు ఒత్తిడి చేయడం వల్ల కేసును పోలీసులు పట్టించుకున్నారు. చంద్రం, అర్జున్, నరసమ్మలను సాంఘీక బహిష్కరణ చేసిన ఉదంతంలో కీలకంగా వ్యవహరించిన 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో నలుగురు ఎస్సీలు కూడా ఉన్నారు. ఆధిపత్య కులాల పెద్ద మనుషులకు ఊర్లోని కొందరు దళితులు కూడా వత్తాసు పలికారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇంత వరకు నిందితుల్ని అరెస్ట్ చేయలేదు. కేసు నమోదు చేసిన విషయం లీక్ చేయడంతో నిందితులంతా ఊర్లోంచి పరారై తలదాచుకున్నారు.

అంతరిక్షంలోకి అడుగుపెట్టే స్థాయికి ఎదిగినా.. తోటి మనిషిని మనిషిగా చూడలేని దుస్థితిలోనే ఉండిపోతున్నారు. కులాధిపత్య భావజాలంతో ఇంకా కుల వివక్ష చూపుతూనే ఉన్నారు. ఎక్కడో మారుమూల పల్లెల్లోనే కాదు హైదరాబాద్‌కు కూతవెట్టు దూరంలోని మనోహరాబాద్ ప్రాంతంలో దప్పు కొట్టడం వీలు కాదని చెప్పినందుకు ఒక దళిత కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేశారు. "ఉన్నత చదువులు చదివినంత మాత్రానా దప్పు కొట్టడం మానేస్తారా..? దప్పు కొట్టకపోతే సర్కారిచ్చిన ఇనాం భూమిని తిరిగిచ్చేయండి.. ఊర్లో చావు, పెండ్లిండ్లు, పండుగలాంటి శుభ, అశుభ కార్యమేదైనా సరే మీరు వచ్చి దప్పులు కొట్టాల్సిందే.. కాదంటే ఊరి నుంచి బహిష్కరిస్తం.. మీతో ఎవ్వరూ మాట్లడరు. ఎలాంటి సహాయం చేయరు. ఎవరైనా మాట్లాడితే వారికి 25 చెప్పు దెబ్బలతో పాటు రూ.5 వేల జరిమానా తప్పదు' అంటూ ఊరంతా కలిసి తీర్మానించారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగం చేసుకుంటున్న దళిత యువకులు ఆత్మాభిమానాన్ని చంపుకుని దప్పుకొట్టే వెట్టి వృత్తిని చేయబోమని తేల్చి చెప్పడం పెద్ద నేరంగా భావించిన కొందరు పెద్ద మనుషులు, మాజీ ప్రజాప్రతినిధులు కుల ఆధిపత్య భావజాలాన్ని ప్రదర్శించారు.

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి



గౌతోజిగూడలో చదువుకున్న దళితుల పట్ల కుల వివక్ష చూపుతూ సాంఘీక బహిష్కరణ చేసిన నిందితుల్ని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. హైదరాబాద్ శివార్లోనూ ఇంకా కుల వివక్ష, ఆధిపత్య పెత్తందారీ ధోరణులు కొనసాగుతున్నాయి. దళితులు చదువుకొని ఉన్నతంగా జీవించినా ఓర్వలేని తనంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. కులంపేరిట అరాచకం చేసే వ్యక్తుల్ని కఠినంగా శిక్షించకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి.

-అతిమేల మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

విమోచనా దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించట్లేదు?

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించట్లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పలువురు నేతలతో కలిసి తిలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ విముక్తి కోసం చేసిన పోరాటాలు, సమర యోధుల త్యాగాలను కండ్లకు కట్టినట్టు ఎగ్జిబిషన్‌లో చూపెట్టారన్నారు. కొమరంభీమ్, ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటాలను స్మరించుకున్నారు. భారత్‌లో విలీనమయ్యేందుకు నిజాం లొంగకుంటే ఆపరేషన్ పోలోతో శస్త్ర చికిత్స చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన మహనీయుడు సర్దార్ వల్లభాయి పటేల్ అని కొనియాడారు. ప్రజలను 50 ఏండ్లుగా వంచిస్తున్న కాంగ్రెసు పార్టీ తెలంగాణ ప్రజా వంచన దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడించిన, పరకాల, బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లిలో వందల మందిని బలి తీసుకున్న రజాకార్ల వారసుడైన ఓవైసీని సీఎం పొగడటం వెనుక ఉన్న ఉద్దేశమేంటని ప్రశ్నించారు. జై పాలస్తీనా, జై పాకిస్తాన్ అనేటోళ్లకు వత్తాసు పలకటం కాంగ్రెస్ పరాకాష్టకు నిదర్శనమన్నారు. బీజేపీ పార్లమెంట్ బోర్డు మెంబర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన పోరాటాలను పాఠ్యాంశాలుగా పొందుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

లక్నోలో ఏఐఎఫ్‌టీవో సమావేశానికి పీఆర్టీయూ తెలంగాణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తరప్రదేశ్ లక్నోలో ఆది, సోమవారాల్లో జరుగుతున్న అఖిల భారత ఫెడరేషన్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌టీవో) జాతీయ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం బయలుదేరి వెళ్లింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య సారథ్యంలో, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా, సహాధ్యక్షులు గోలి పద్మ ఉపాధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్, ఉమారాణి ఆదివారం లక్నోకు వెళ్లారు. తెలంగాణలో జరుగుతున్న విద్యా వ్యవస్థ, ఇతర రాష్ట్రాల విద్యావ్యవస్థపై చర్చించనున్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చిస్తారు. విద్యారంగంలో, బోధనలో వస్తున్న మార్పుల గురించి సమాలోచన చేస్తారు. వాటిపై పలు నిర్ణయాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తారు.

క్యాబినెట్‌లో పాతపెన్షన్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకోవాలి

- సీపీఎస్‌టీఈఏ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 20న నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్దరణపై నిర్ణయం తీసుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. మంత్రివర్గంలో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్దరిస్తారంటూ రాష్ట్రంలోని మూడు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి ఉన్న రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, కర్నాటకతోపాటు ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లోనూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని గుర్తు చేశారు. తెలంగాణలోనూ ఆ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

రూ. 4.21 లక్షలు పలికిన విల్లా వినాయకుడి లడ్డూ



నవతెలంగాణ - హైదరాబాద్

వినాయక నిమజ్జనాలు దగ్గర పడుతుండటంతో ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల దగ్గర లడ్డూలను వేలం వేస్తున్నారు. అందులో భాగంగా కొంపల్లి పేట్ బషీరాబాద్ లోని సన్మాన్ ట్రినిటీ విల్లా వినాయకుడి లడ్డు శనివారం రాత్రి జరిగిన వేలంలో రూ. 4.21 లక్షలు పలికింది. ప్రముఖ న్యాయవాది అనుముల నవీన్- రూపాదేవి కుటుంబం (విల్లా 15) రూ.4,21,116 లకు వేలం పాడి లడ్డూను సొంతం చేసుకుంది. అదే గణేశుని మెడలో వేసిన కరెన్సీ నోట్ల దండను సైతం వేలం వేయగా మంచి స్పందన వచ్చింది. పారిశ్రామిక వేత్త రామిరెడ్డి- శ్రీలక్ష్మి కుటుంబం (విల్లా 30) రూ.40,116 లకు ఈ దండను సొంతం చేసుకుంది. కండువాను వేలం వేయగా వ్యాపారవేత్త పద్మారెడ్డి-సిద్దేశ్వరి కుటుంబం రూ. 18,116 లకు సొంతం చేసుకుంది. వీరికి విల్లా కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పట్నాయక్, కోశాధికారి జీతేంద్రనాథ్, సభ్యుడు సత్య కిశోర్ సహా విల్లా నివాసులందరూ అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అడ్డగోలుగా ధరల పెంపు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అడ్డగోలుగా ధరలు పెంచుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. "కర్నాటకలో లీటర్ పాలపై రూ.5 పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఏడాదిన్నరలో మూడు సార్లు పాల ధర పెంచారు. హిమాచల్ ప్రదేశ్ ఏకంగా గంజాయి అమ్మడానికి పర్మిషన్ కావాలని అర్జీ పెట్టుకుంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు, ఆరు గ్యారెంటీలు అనే డ్రామాలతో రోజులు గడుపుతోంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గొడవ పడితే కాంగ్రెస్‌కు ఏం సంబంధమన్న మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. మీ చిట్టినాయుడు కూడా ఇంకా టీడీపీలోనే ఉన్నాడా అని నిలదీశారు. అతి తెలివి మంత్రి గారంటూ ఎద్దేవా చేశారు. అసలు చేర్చుకోవడం ఎందుకు, ఆ తర్వాత పదవులు పోతాయన్న భయంతో ఈ నాటకాలు ఎందుకని ప్రశ్నించారు.

వివాదాల సుడిగుండంలో సెబీ చీఫ్

- అది నుంచీ అన్నీ ఆరోపణలే
- స్వతంత్ర సమీక్ష అవసరమంటున్న అధికారులు



న్యూఢిల్లీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)... అది స్టాక్ మార్కెట్‌ను నియంత్రించే అత్యున్నత సంస్థ. సెక్యూరిటీల్లో పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు, స్టాక్ మార్కెట్‌ను నియంత్రించేందుకు, దానిని అభివృద్ధి చేసేందుకు కట్టుబడిన దర్యాప్తు సంస్థ. 2022 ఫిబ్రవరి వరకూ సెబీ బోర్డులో హోల్ టైమ్ సభ్యురాలిగా ఉన్న మాధబి పురి బచ్‌ను కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థకు అధిపతిని చేసింది. సెక్యూరిటీల మార్కెట్లను నియంత్రించే సంస్థకు సారథ్యం వహించిన తొలి మహిళ ఆమే. మాధబి న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి గణిత శాస్త్రంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. ఆ తర్వాత అహ్మదాబాద్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యాభ్యాసం చేశారు. 56 సంవత్సరాల వయసులో సెబీ పగ్గాలు చేపట్టారు. తద్వారా ఆ బాధ్యతలు చేపట్టిన అతి పిన్న వయస్కుల్లో ఒకరుగా నిలిచారు.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో, ఆర్థిక సేవల రంగంలో మాధబి బచ్‌కు విశేష అనుభవం ఉంది. ఆమె ఐసీఐసీఐ సెక్యూరిటీలకు ఎండీగా, సీఈఓగా పనిచేశారు. ఈ అనుభవంతో మాధబి బచ్ సెబీలో తన హోదాకు వన్నె తెస్తారని, పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తారని అందరూ ఆశించారు. ఐసీఐసీఐలో ఉన్నప్పుడు ఎస్.వాఘల్, కేవీ కామత్‌ల పర్యవేక్షణలో విధులు నిర్వర్తించారు. షాంఘైకి చెందిన బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు కన్సల్టెంటుగానూ వ్యవహరించారు. దానికి కొంతకాలం కామత్ నేతృత్వం వహించారు.

ఏడాది గడవక ముందే...

సెబీ అధిపతిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కూడా గడవక ముందే మాధబి బచ్‌పై ఆరోపణలు మొదలయ్యాయి. అదానీ గ్రూప్ కంపెనీలు తమ వాటాల విలువను పెంచి చూపేందుకు అవకతవకలకు పాల్పడ్డాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ ఆరోపించడంతో ఆమెకు కష్టకాలం ప్రారంభమైంది. హిండెన్‌బర్గ్ ఆరోపణలతో అదానీ గ్రూప్ కంపెనీల వాటాల విలువ భారీగా పతనమైంది. కొన్ని ట్రేడింగ్ సెషన్స్‌లోనే వందల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరై పోయింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిందిగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి.

పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు

అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేయడంలో సెబీ వైఫల్యంపై కమిటీని ఏర్పాటు చేయాలని గతేడాది మార్చిలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు విషయంలో సెబీ వైఫల్యం ఏమీ లేదని సుప్రీం నియమించిన కమిటీ తేల్చింది. మేలో తన నివేదికను అందజేసింది.

హిండెన్‌బర్గ్ నివేదికలో చూపిన 13 సంస్థల యాజమాన్యంపై సెబీ 2020 అక్టోబర్ నుంచే దర్యాప్తులు జరుపుతోందని తెలిపింది. దీంతో వివాదం చల్లారినట్టు కన్పించినప్పటికీ గత నెల 10న హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి మాధబి బచ్‌పై ఆరోపణలు చేసింది. అదానీలతో సంబంధమున్న మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్‌లో బచ్ పెట్టుబడులు పెట్టారని తెలిపింది. అయితే హిండెన్‌బర్గ్ ఆరోపణలను మాధబి బచ్, ఆమె భర్త ధావల్ బచ్ తోసిపుచ్చారు. ఆ ఆరోపణలలో ఎంతమాత్రం వాస్తవం లేదని, తమ జీవితం, ఆర్థిక వ్యవహారాలు తెరిచిన పుస్తకాలేనని వివరించారు. కొన్నేండ్లుగా అవసరమైన అన్ని వివరాలనూ సెబీకి అందజేస్తూనే ఉన్నామని చెప్పారు. ప్రయివేటు పౌరులుగా ఉన్నప్పటి డాక్యుమెంట్లు సహా అన్ని ఆర్థిక పత్రాలనూ ఏ సంస్థకైనా బయటపెట్టేందుకు వెనకడుగు వేయబోమని తెలిపారు.

స్వతంత్ర సమీక్ష అత్యవసరం

సెబీ ప్రయోజనాల కోసం, పెట్టుబడిదారులలో విశ్వాసం నింపడం కోసం మాధబి బచ్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలపై సాధ్యమైనంత త్వరగా స్వతంత్ర సమీక్ష జరిపించి, అపోహలు తొలగించాల్సిన అవసరం ఉన్నదని మాజీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. అది ఆమె ప్రయోజనాలకు కూడా మంచిదని అంటూ తన జీవితం తెరచిన పుస్తకం అన్న మాధబి మాటలను ఆయన గుర్తు చేశారు.

తిరగబడుతున్న అధికారులు

అటు సెబీ కూడా ఆగస్టు 11న ఓ ప్రకటన విడుదల చేసింది. సెక్యూరిటీలు, వాటి బదిలీలకు సంబంధించి ఛైర్‌పర్సన్ ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూనే ఉన్నారని, పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాల దర్యాప్తు నుంచి ఆమె తనంతట తానుగా వైదొలిగారని చెప్పుకొచ్చింది. సెబీ జరిపిన ఏ దర్యాప్తునూ ప్రభావితం చేసేందుకు బచ్ ప్రయత్నించలేదని దాని పనితీరుతో సంబంధమున్న వ్యక్తులు కూడా తెలియజేశారు. అయితే పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాలపై సెబీ దర్యాప్తు జరిపినప్పుడు మాధబి బచ్ తన బాధ్యతల నుంచి వైదొలగలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని బోర్డు సభ్యుడొకరు స్పష్టం చేశారు.

ఇదిలా వుండగా సెబీలో పనిచేస్తున్న పలువురు అధికారులు మాధబి ప్రవర్తనపై మండిపడుతున్నారు.

అత్యున్నత స్థాయిలో ఉన్న వారు ఉద్యోగులను నమ్మడం లేదని, వారిని గౌరవించరని, పని ప్రదేశంలో విష సంస్కృతి నెలకొన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెబీ ప్రధాన కార్యాలయం వద్ద ప్రదర్శన కూడా నిర్వహించారు.



భారత్‌లో అనామక బతుకులు

- 50 ఏండ్లకు పైగా పౌరసత్వం లేకుండానే హిందూ శరణార్థులు
- బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు తరలి వచ్చి అడవుల్లో ఆశ్రయం
- మావోయిస్టు రెడ్ కార్నర్ జోన్లలో తలదాచుకుంటున్న తీరు
- 300 శిబిరాల్లో 2.8 లక్షల మంది 'తూర్పు బెంగాలీ' శరణార్థులు
- సీఏఏ కింద ఆరు దరఖాస్తులకే ఆమోదం
- ఎన్‌బీబీఎస్ఎస్ ఆందోళన

న్యూఢిల్లీ : 50 ఏండ్ల క్రితం బంగ్లాదేశ్(ఆ సమయంలో తూర్పు బెంగాల్) నుంచి భారత్‌లోకి ప్రాణభయంతో తరలి వచ్చిన హిందూ శరణార్థులు ఒక గుర్తింపు లేకుండానే జీవనాన్ని గడుపుతున్నారు. వీరంతా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి మధ్య భారత్‌లోని అటవీ ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ అటవీ ప్రాంతాల్లోని మావోయిస్టు రెడ్ కార్నర్ జోన్లలో ఉన్న మొత్తం 300 శిబిరాల్లో 2.8 లక్షల మంది హిందూ శరణార్థులు తలదాచుకుంటున్నట్టు సమాచారం. ఆ సమయంలో తూర్పు బెంగాల్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కాలి నడకనే తాము భారత్‌కు వచ్చామని వారు చెప్తున్నారు. అయితే, తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కూడా దక్కలేదని అంటున్నారు.

పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లోని మైనారిటీలు (ముస్లిమేతరులు) మత పీడనకు గురై, భారత్‌కు శరణు కోరి వస్తే వారికి పౌరసత్వం కల్పించే చట్టం సీఏఏను మోడీ సర్కారు తీసుకొచ్చిన విషయం విదితమే. ప్రత్యేకించి హిందుత్వ వాదానికి తామే ఐకాన్ అంటూ చెప్పుకునే బీజేపీ.. సీఏఏ కింద వారికి పౌరసత్వాన్ని ఎందుకు కల్పించలేకపోయిందని కొందరు రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కేంద్రం తప్పక సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నదని అంటున్నారు. గత కొన్ని నెలలుగా బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత నెలకొని, ప్రధాని పదవిని వీడి షేక్ హసీనా భారత్‌కు వచ్చిన విషయం విదితమే. ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగి అక్కడ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది.

ఇక్కడి అటవీ ప్రాంతాల్లో వచ్చి స్థిరపడిన శరణార్థులకు అక్కడి ఆదివాసీల నుంచి తొలుత మద్దతు లభించినా.. కొన్ని విద్రోహ శక్తుల ప్రయత్నాలతో సెటిలర్లు అనే భావన వారిలో నెలకొన్నదని బాధితులు వాపోతున్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "మేము ఇక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్నాం. మేము ఇప్పటికీ గుర్తింపు కోసం ఎదురు చూస్తున్నాం" అని నిఖిల్ భారత్ బెంగాలీ సమన్‌భే సమితి (ఎన్‌బీబీఎస్ఎస్) సభ్యుడు బిపిన్ బేపారి తెలిపారు. సీఏఏ కింద 221 దరఖాస్తులు అందగా.. ఆరు మాత్రమే ఆమోదింపబడ్డాయని చెప్పారు. అడవుల్లో తలదాచుకుంటున్న తమ వేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని, తమకు పౌరసత్వం కల్పించే ప్రయత్నాన్ని చేయాలని ఆయన కోరుతున్నారు.

ఏచూరికి జేఎన్‌యూ పూర్వ విద్యార్థుల నివాళులు



నవతెలంగాణ - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని గురుమూర్తి సెంటర్‌లో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించారు. శాసన మండలి సభ్యులు కోదండరాం, ప్రముఖ సంఘ సేవకురాలు, బాలల హక్కుల ఉద్యమ నాయకులు శాంతా సిన్హా, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మదన్, కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ శ్యామల కుమారి, సీనియర్ జర్నలిస్టు నెల్లూరి నరసింహారావు, వెంకట శ్రీనివాస రెడ్డి, ఆకిన వెంకటేశ్వర్లు, హిందూ గ్రూప్ పూర్వపు విలేఖరి సోమశేఖర ఇంకా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో చదువుతున్న రోజుల్లో ఏచూరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భిన్న ప్రవంతులకి చేయందించిన వారిని ఒకే లక్ష్యం కోసం ఒకే గూటికి తీసుకురావడంలో జేఎన్‌యూ నే ఆయనకి తొలి ప్రయోగశాల అని వక్తలు వెల్లడించారు. అటువంటి ప్రయోగంతోనే ఏచూరి విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్నికయ్యారని గుర్తు చేసుకున్నారు. నేడున్న భారత పరిస్థితుల్లో సంకీర్ణ ప్రభుత్వాల నిర్మాణంలో దిట్ట అయిన ఏచూరి సేవలు అందుబాటులో లేకపోవడం విచారకరం అని వక్తలు అభిప్రాయ పడ్డారు. మాజీ ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, హుడా, అజయ్ మిశ్రా, రాజన్ హర్షే, గీత ఆర్షే తదితరులు పాల్గొన్నారు.

నాలుగేండ్లుగా జైలులోనే



- 'ఉపా' కేసులో విచారణ కోసం ఎదురు చూస్తున్న ఉమర్ ఖాలీద్
- 2020 సెప్టెంబర్‌లో అరెస్టయిన జేఎన్‌యూ మాజీ విద్యార్థి నాయకుడు

న్యూఢిల్లీ : జేఎన్‌యూ మాజీ విద్యార్థి నాయకుడు, ఉద్యమకారుడు నాలుగేండ్లుగా జైలులోనే మగ్గుతున్నాడు. చట్ట విరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కేసులో విచారణ కోసం ఎదురు చూస్తున్నాడు. 2020లో ఈశాన్య ఢిల్లీలో చోటు చేసుకున్న మతపరమైన అలర్లకు సంబంధించి ఉమర్ ఖాలీద్ ఆ ఏడాది సెప్టెంబర్‌లో అరెస్ట్ అయిన విషయం విదితమే. అయితే, ఆయన అప్పటి నుంచి జైలులోనే శిక్షను అనుభవిస్తున్నాడు. విచారణ కోసం ఇలా ఆయన నాలుగేండ్ల విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని విద్యార్థి నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2020 ఫిబ్రవరిలో హింసాత్మక అల్లర్ల ఆరోపణలపై డిసెంబర్, 2022లో న్యాయస్థానం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. అయినప్పటికీ, ఉపా కింద దాఖలైన ఇంకో కేసులో ఆయన జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు సందర్భాల్లో బెయిల్ కోసం ఆయన చేసిన ప్రయత్నాలనూ కోర్టులు తిరస్కరించాయి కూడా. ఉపా చట్టంలోని పలు నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును కూడా సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో ప్రత్యేక పిటిషన్‌ను దాఖలు చేశారు. అది కూడా పెండింగ్‌లో ఉన్నది.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను అమలు చేస్తున్నదనీ, వాటిని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ నూతన అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2023లో రాష్ట్రంలో సాధించిన గెలుపు సెమీ ఫైనల్స్‌లో గెలుపు మాత్రమేననీ, 2028లో జరగబోయే ఫైనల్స్‌లో గెలిచేందుకు నిబద్ధతతో ముందుకెళ్లాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కదలాలని పిలుపునిచ్చారు. అప్పటి వరకు విశ్రమించొద్దనీ, సెలవు తీసుకోవద్దని కోరారు.

పేదల కష్టాలు తీర్చాలని కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీ రూ.10 లక్షల పెంచడం, రైతు రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్టు తెలిపారు. రాబోయే పంటల్లో సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాల నియామకాలు పూర్తి చేశామనీ, మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్టు చెప్పారు. ఈ ఏడాది చివరల్లో మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. త్వరలోనే ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టుకు అనుమతి వస్తుందని సీఎం వెల్లడించారు.

సన్నాసి ఎక్కడ దాక్కున్నాడు?

రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని ఒక సన్నాసి సవాల్ విసిరారనీ, ఆ సన్నాసి ఎక్కడ దాక్కున్నాడని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ సన్నాసి రాజీనామా చేస్తే సిద్దిపేట పీడ విరగడవుతుందనీ, దూలంలాగా పెరిగినా దూడకున్న తెలివి లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు చాలా మంచోళ్లు. ఎవరైనా వారి జోలికొస్తే ఊరుకోరు అని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం రాష్ట్ర నాయకత్వం కదులుతుందని భరోసానిచ్చారు.

మహేష్ వెనుక నేనున్నా...



మహేష్ కుమార్ గౌడ్ సౌమ్యుడు. టీపీసీసీ అధ్యక్షునిగా వచ్చారు. తాము రాష్ట్రంలో రెచ్చిపోవచ్చని ఎవరూ భ్రమలు పెట్టుకోవద్దని సీఎం హెచ్చరించారు. మహేష్ కుమార్ గౌడ్ వెనుక తానున్న సంగతి గుర్తుపెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రిగా, టీపీసీసీ అధ్యక్షునిగా రెండు బాధ్యతలకు సమయం సరిపోవడం లేదన్నారు. అందుకే తానే పార్టీ అధ్యక్షునిగా పూర్తి సమయం ఇచ్చే నాయకున్ని నియమించాలని తానే కోరినట్టు తెలిపారు.

బలహీనవర్గాలకు సముచిత స్థానం

బలహీనవర్గాలకు సముచిత స్థానం లభించాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బీసీ జనాభా లెక్కలు తీసి, వారికి రావాల్సిన వాటా వారికి ఇవ్వాల్సి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని గెలిపించుకుంటామన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కార్యకర్తల శ్రమను గౌరవిస్తూ వారి అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందనేందుకు మహేష్ కుమార్ గౌడ్ నియామకమే నిదర్శనమని తెలిపారు. టీపీసీసీ మాజీ అధ్యక్షులు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఇతర పార్టీల్లో ఒక కుటుంబం, ఒకే సామాజికవర్గానికి చెందిన వారికే నాయకత్వం ఉంటుందని విమర్శించారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నట్టు ఏఐసీసీ నిరూపించిందని తెలిపారు. పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ బీజేపీ మత విద్వేష రాజకీయాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

నా జీవితం ధన్యం : మహేష్ కుమార్ గౌడ్

టీపీసీసీ నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తన జీవితం ధన్యమైందని తెలిపారు. ఏనాడు టీపీసీసీ అధ్యక్షున్ని కావాలని తాను అనుకోలేదని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉన్న ప్రజాస్వామిక స్వేచ్ఛ తన ఎదుగుదలకు దోహదపడిందని తెలిపారు. మాజీ టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్, రేవంత్ రెడ్డిలు తనను ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. గాంధీభవన్‌తో తనకు 40 ఏండ్లపాటు అనుబంధం ఉందని తెలిపారు. రాజకీయాల్లో ఎదిగేందుకు అవకాశమిచ్చే వారుండాలన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కలిసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

హైడ్రా చారిత్రక నిర్ణయమనీ, దానిని కొనసాగిస్తూ అన్ని జిల్లాలకు విస్తరించాలని మహేష్ కుమార్ ప్రభుత్వానికి సూచించారు. అయితే పేదలకు పునరావాసాన్ని కల్పించాలని కోరారు. భువనగిరిలో రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాలు నిర్మించుకునేందుకు మార్కెట్ రేటుకు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి వారం రొటేషన్ పద్ధతిలో ఇద్దరు మంత్రులు, నెలకు ఒకసారి ముఖ్యమంత్రి గాంధీభవన్ రావాలని ఆకాంక్షించారు. మంత్రులు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు కొంత సమయాన్ని కాంగ్రెస్ కార్యాలయంలో గడిపితే బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మెన్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్ నార్సింగిలోని తన నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. గాంధీభవన్‌కు ప్రదర్శనగా వచ్చిన ఆయనకు సీఎం, మంత్రులు, నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

రేవంత్ ప్రస్థానమిదే..

తెలంగాణ ఏర్పాటు తర్వాత వ్యూహాత్మక వైఫల్యాలతో మనుగడ కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌టీపీసీసీ అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టాక అధికారంలోకి వచ్చింది. 2018 నాటికి 19 సీట్లకే పరిమితమైన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక సవాళ్లు ఎదురైనా వెనుదిరగకపోవడమే ఆయనకు కలిసొచ్చింది. టీపీసీసీ అధ్యక్షునిగా రేవంత్ బాధ్యతలు చేపట్టాక హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఆ పార్టీ మూడో స్థానానికి పరిమితం కాగా, దుబ్బాక, హుజూరాబాద్‌లో బీజేపీ మాత్రమే బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయమనే భావన ప్రజల్లో బలపడింది. ఈ పరిస్థితిలో పార్టీ నిర్మాణం కోసం డిజిటల్ మెంబర్‌షిప్ కార్యక్రమం చేపట్టారు. రైతులు, దళిత, గిరిజన, బీసీ, యువత, విద్యార్థులు, మైనార్టీ ఇలా వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలను డిక్లరేషన్ ల రూపంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్యల సమక్షంలో విడుదల చేశారు. పెట్రోల్ ధరల పెంపుపై నిరసనలతో పాటు దళిత, గిరిజన దండోరా, ఆత్మగౌరవ దీక్ష, డ్రగ్స్ వ్యతిరేకంగా వైట్ చాలెంజ్, నిరుద్యోగ జంగ్ సైరన్, రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాలు, ధాన్యం కొనుగోళ్లపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు ప్రజలను తిరిగి కాంగ్రెస్ వైపు చూసేలా చేశాయి. స్థానిక సమస్యలపై మన ఊరు - మన పోరుతో పాటు, ఉద్యోగ నియామకాల కోసం నిరుద్యోగుల పక్షాన పోరాటాలు కాంగ్రెస్ బలాన్ని పెంచాయి. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల కోసం పోలీసులను తప్పించుకుని అక్కడికి రేవంత్ చేరుకుని విద్యార్థులను ఆకర్షించారు. రేవంత్ రెడ్డి పాదయాత్ర, ప్రశ్నాపత్రాల లీకేజీపై పోరాటాలతో పాటు ఆరు గ్యారంటీలు, ఎన్నికలకు ముందు ప్రజల అభిప్రాయాలను తీసుకుని మ్యానిఫెస్టో రూపకల్పన తదితర కార్యక్రమాలు కాంగ్రెస్ ను ప్రజలకు చేరువ చేశాయి.

కౌన్ బనేగా ఢిల్లీ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

తీరుతో సునీత పేరు సైతం పరిశీలనలో ఉన్నది. సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్ కూడా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.

అతిశి, ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రి

కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేస్తే, ఈ పదవిలో అతిశి అయితే పాలన సమర్థవంతంగా ఉంటుందని బలమైన వాదన ఉంది. ఆమె అరవింద్ కేజ్రీవాల్‌కు విశ్వసనీయురాలు. కీలకమైన మంత్రిత్వ శాఖలకూ బాధ్యత వహిస్తున్నారు. మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా రాజీనామా తర్వాత విద్యాశాఖ బాధ్యతలు ఆమెకు దక్కాయి. నీటి శాఖను సైతం ఆమె నిర్వహిస్తున్నారు. పీడబ్ల్యూడీ, రెవెన్యూ, ప్లానింగ్, ఫైనాన్స్ విభాగాలనూ చూసుకుంటున్నారు.

అతిశి పేరు ఎందుకు చర్చనీయాంశమైంది?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఛత్రసాల్ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగురవేయడానికి ఇటీవలే, కేజ్రీవాల్ జైలు నుంచి ఆమె పేరును సిఫారసు చేసి, ఎల్జీకి లేఖ రాశారు. అతిశిపై ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నాయకత్వానికి ఎంత నమ్మకం ఉందంటే మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా నివసించే ఇల్లు అతిషి పేరు మీద ఉంది. అతిశి సీఎం అయితే ఢిల్లీకి మూడో మహిళా సీఎం అవుతుంది. ఇంతకు ముందు షీలా దీక్షిత్, సుష్మా స్వరాజ్ ఢిల్లీ సీఎంలుగా ఉన్నారు.

సీఎం చేస్తారన్న ఊహాగానాలపై అతిశి ఏమన్నారు?

సీఎం చేస్తారన్న ఊహాగానాలపై అతిశి మాట్లాడుతూ, 'సీఎం కావాల్సిన అవసరం లేదు, ఢిల్లీ అభివృద్ధి అవసరం' అన్నారు. కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనపై మాట్లాడుతూ.. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయలేదన్నారు. సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఇప్పుడు తమ నాయకుడు నిజాయితీపరుడో కాదో ప్రజలే నిర్ణయించుకోవాలి.

సునీతా కేజ్రీవాల్, సీఎం కేజ్రీవాల్ భార్య

అతిశి తర్వాత వినిపిస్తున్న రెండో పేరు అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్. అయితే ఆమెకు ఎమ్మెల్యే పదవి కానీ, మంత్రిపదవి కానీ లేవు కాబట్టి ఆమెను సీఎం చేయడం కాస్త కష్టమే. అయినా సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైల్లో ఉన్నప్పుడు సునీతా కేజ్రీవాల్ ఇంటి నుంచి బయటకు వచ్చి ఢిల్లీ ప్రజల మధ్యకు వెళ్లారు. పలు ర్యాలీల్లో కూడా ప్రసంగించారు. అయితే, సునీతా కేజ్రీవాల్‌ను సీఎం చేస్తే, కేజ్రీవాల్ బంధుప్రీతి ఆరోపణలు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అది ఎన్నికల వాతావరణంపై ప్రభావం చూపుతుందనే వాదన వినిపిస్తోంది.

సౌరభ్ భరద్వాజ్, ఢిల్లీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

సీఎం రేసులో తర్వాతి పేరు సౌరభ్ భరద్వాజ్. పార్టీ నాయకులు ఒక్కొక్కరుగా జైలుకు వెళ్లినప్పటి నుంచి, అతిశితో పాటు, ఢిల్లీ ప్రభుత్వ మంత్రి సౌరభ్ భరద్వాజ్ కూడా పార్టీని ప్రముఖంగా నిర్వహించడంలో ముందు స్థానంలో ఉన్నారు. సౌరభ్ భరద్వాజ్ యువకుడే కాకుండా ఢిల్లీ ప్రభుత్వంలో విజిలెన్స్, హెల్త్, అర్బన్ డెవలప్‌మెంట్ సహా అనేక ముఖ్యమైన విభాగాలను నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన పేరు సీఎం పదవి అందుకోగలిగిన వారి పేర్లలో బలంగానే కనిపిస్తోంది.



అతిశి | సునీతా కేజ్రీవాల్ | సౌరభ్ భరద్వాజ్ | గోపాల్ రాయ్

కేజ్రీవాల్ రాజీనామాపై సౌరభ్ భరద్వాజ్ ఏమన్నారు?

సౌరభ్ భరద్వాజ్ స్పందిస్తూ..

బెయిల్ తెచ్చుకుని కుర్చీని తన్నిన సీఎం భారతదేశంలోనే ఉండబోరని తెలిపారు. అందుకే అందరి చూపు సీఎం కుర్చీపైనే ఉందని,వీలైనంత త్వరగా ఢిల్లీలో ఎన్నికలు జరగనున్నందున, ఈ సమయంలో ఆప్ అధినేత ప్రజల వద్దకు వెళ్తారని, అప్పుడు జనం తమకు అండగా నిలుస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఢిల్లీలో ఆప్ సీనియర్ నేత గోపాల్ రాయ్

సీఎం పదవి రేసులో చివరి పేరు గోపాల్ రాయ్. సీనియారిటీ ఆధారంగా గోపాల్ రాయ్‌కు ఛాన్స్ ఉన్నా.. ఆయన ఆరోగ్యం అంతగా సహకరించదన్న చర్చ నడుస్తోంది. అయితే చాలా సందర్భాల్లో పార్టీకి ట్రబుల్ షూటర్‌గా నిలిచారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీ పర్యావరణ మంత్రిగా ఉన్నారు.కేజ్రీవాల్ చేసిన సంచలన వ్యాఖ్యలు అటు ప్రతిపక్షాల్లోనూ.. ఇటు ఆమ్ ఆద్మీ పార్టీలోనూ కలకలం రేపుతున్నాయి. హర్యానా ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎం పదవికి రాజీనామా అంటూ కేజ్రీవాల్ చేసిన పబ్లిక్ స్టంట్ అంటూ బీజేపీ, కాంగ్రెస్ ప్రకటనలు చేశాయి. మరోవైపు ఆప్‌లో సీఎం కుర్చీ ఎవరికి దక్కుతుందన్న ఉత్కంఠ పార్టీ వర్గాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది.

హర్యానా బరిలో 1221 మంది అభ్యర్థులు

నవతెలంగాణ - న్యూఢిల్లీ

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు 90 స్థానాల్లో మొత్తం 1221 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే నామినేషన్ల ఉపసంహరణకు గడువు 16 వరకు ఉన్నది.

22 జిల్లాల్లోని ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో విచారణ చేపట్టారు. 1,559 మంది అభ్యర్థులు 1,746 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, కేవలం 1,221 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వం చెల్లుబాటవుతుంది. 338 మంది నామినేషన్ పత్రాల్లో లోపాల కారణంగా వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు.

చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డేటా ప్రకారం..

మొత్తం 22 జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ గురించి సవివరమైన సమాచారం ఇస్తూ, పంచకుల జిల్లాలో 22 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వం చెల్లుబాటు అయిందని ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ తెలిపారు. అంబాలా జిల్లాలో 43 మంది, యమునానగర్ జిల్లాలో 45 మంది, కురుక్షేత్ర జిల్లాలో 58 మంది, కైతాల్ జిల్లాలో 68 మంది, కర్నాల్ జిల్లాలో 65 మంది అభ్యర్థుల నామినేషన్లు ఖరారయ్యాయి. అదేవిధంగా, పానిపట్ జిల్లాలో 42 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వం ఖరారైంది. సోనిపట్ జిల్లాలో 72 మంది, జింద్ జిల్లాలో 85 మంది, ఫతేహాబాద్ జిల్లాలో 46 మంది, సిర్సా జిల్లాలో 66 మంది, హిసార్ జిల్లాలో 112 మంది, భివానీ జిల్లాలో 69 మంది అభ్యర్థులు, చర్ఖీ దాద్రీ జిల్లాలో 36 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. రోహ్‌తక్ జిల్లాలో 60 మంది, ఝజ్జర్ జిల్లాలో 51 మంది, మహేంద్రగఢ్ జిల్లాలో 46 మంది, రేవారీ జిల్లాలో 42 మంది, గురుగ్రామ్ జిల్లాలో 62 మంది, నుహ్ జిల్లాలో 23 మంది, పల్వాల్ జిల్లాలో 52 మంది, ఫరీదాబాద్ జిల్లాలో 56 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. .

నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు

అభ్యర్థులు తమ నామినేషన్లకు గడువు నేటితో ముగియనున్నదని అగర్వాల్ తెలిపారు. ఆ తర్వాత మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించి, వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల గుర్తులను కేటాయిస్తారని వెల్లడించారు. ఓటింగ్ అక్టోబర్ 5, 2024న ఉదయం 7:00 నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు షెడ్యూల్ అయినట్టు ఆయన తెలిపారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

సాయుధ పోరుదృశ్యాల 'చిత్ర' ప్రసాద్

కళ అంతిమ లక్ష్యం మానవీయత. అందుకే 'కళాకారుడు మానవ హృదయ నిర్మాత కావాలి' అన్నారు. ఆ నిర్మాణంలో తమ శ్రమను, నైపుణ్యాన్ని ధారపోసిన ప్రజాకళాకారులలో చిత్రకారుడిగా ప్రసిద్ధి చెందిన చిత్తప్రసాద్ భట్టాచార్య ఒకరు. మార్క్సిస్టు భావజాలంతో కుంచె నాడించిన ప్రజాకళాకారుడీయన. అందులోనూ మన తెలంగాణకు, తన చిత్రాలతో చిరస్మరణీయ బంధాన్ని కలిగి వున్నవాడు. ఆ బంధం 1946 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ఏర్పడింది. అందుకనే ఈ వారోత్సవాల సందర్భంగా పోరాట ఘట్టాల్ని తన చిత్రాల ద్వారా ప్రపంచానికి ఎరుక పరచిన ఆయన కృషిని గురించి తెలుసుకోవడం స్మరించుకోవడం అవసరంగా భావిస్తున్నాను.





సాయుధ పోరాటాన్ని, దాని చరిత్రను, వారి రాజకీయ అవసరాల కోసం వక్రీకరించి వాడుకోజూస్తున్న వారికి చిత్త ప్రసాద్ గీసిన చిత్రాలు సత్యాలను, ఎర్రజెండా త్యాగాలను కళ్ళముందుంచుతాయి. వారి అసత్య ప్రచారాన్ని తిప్పికొడతాయి. ఎక్కడ బెంగాలు! ఎక్కడ తెలంగాణ! బెంగాలు 24 ఉత్తర పరిగణాలలో వున్న నైహతిలో జన్మించిన చిత్తప్రసాద్, తెలంగాణ సాయుధ పోరాటం, నాటి ప్రజల తిరుగుబాటును, నిర్బంధాలను, దోపిడీని కళ్లకు కట్టించే దృశ్యాలను చిత్రాలుగా అందించారు. అవి నేటికీ చైతన్యయుతంగా మనతో మాట్లాడుతూనే వుంటాయి. ఆయన చివరి వరకూ కాన్వాసుపై రంగులు వుపయోగించలేదు. బొమ్మలు నలుపూ తెలుపులోనే గీయడానికి బహుశా పేదల, శ్రామికుల బతుకు ఇంకా రంగుల కళగా మారలేదనే సంకేతంగా చూపాడని భావిస్తాను. మట్టి మనుషుల రంగును ప్రతిఫలించడమూ చూస్తాం.

చిత్తప్రసాద్ గీసిన రైతుకూలీల, శ్రామికుల బొమ్మలన్నీ కూడా శ్రమైక జీవన సౌందర్యాన్ని చిత్రించిన వాస్తవిక మనుషుల ఉనికిని ప్రతిబింబించేవే. రైతు కూలీ చిత్రాన్ని పరిశీలించండి. వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే స్త్రీ పురుషులిద్దర్నీ వేశారు. వారి ముఖంలో కేవలం శ్రమ చేసే రెండు చేతులు తప్ప మరేమీ లేవని తెలిపే అమాయకమైన స్వచ్ఛత వారి కళ్లల్లో కనిపిస్తుంది. ఇంకో ప్రసిద్ధ చిత్రం - అశేష ప్రజానీకానికి ప్రతీకగా ఓ బలమైన నాయకుడు నిర్బంధించబడి బోర్లా పడుకుని వుంటే అతని వెన్నుపై యుద్ధ విమానాల భారాలు మోపి, ఆధునిక సాంకేతిక, హార్మ్యాలు, ఫిరంగులు, తలపై ఆధిపత్యం వహిస్తున్న అధికారం, కాపలా చిత్రాన్ని చూస్తే 'బలవంతులు దుర్బలజాతిని బానిసలను గావించారు. నరహంతకులు ధరాధిపతులై చరిత్రమున



- కె.ఆనందాచారి,
9948787660



ప్రసిద్ధికెక్కిరి... ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?' అన్న శ్రీశ్రీ గేయం మననంలోకి రాకమానదు. అంటే దోపిడీదారుల దుర్మార్గాలను, వాటి వెనుక కుట్రలను, శ్రామిక జనుల శ్రమను వంద పుటల్లో చెప్పే చరిత్రను ఒక చిత్రంలో పరిష్కరించాడు చిత్తప్రసాద్.

నైజాం ఎన్ని నిర్బంధాలు పెట్టినా, సంకెళ్లు బిగించినా అధిక సంఖ్యాకులైన ప్రజ సాయుధులవుతున్న తీరును అద్భుతంగా ధిక్కార రేఖలతో దృశ్య కావ్యం చేశారు. 'సమ్మెకట్టిన కూలీల, బిడ్డల ఆకలి కేకలు... సంఘటితమయ్యే ప్రజల సన్నాహాలను దృశ్యమానం చేస్తాయి ఈ చిత్రాలు.

భూస్వాముల, జమీందార్ల దురాగతాలు, దౌర్జన్యం, హింస, బీభత్సం, అరాచకాలకూ చిత్రిక పట్టాడు. దోపిడీ, పీడన భరించలేక సామాన్యులు తిరగబడిన దృశ్యాన్ని చైతన్యపూరితమైన రేఖలతో మనముందుంచాడు ఈ ప్రజాకళాకారుడు. ఉద్యమ ప్రేరణ కళారూపాల్లో, పాటల్లో, కథల్లో పొందుతాం సాధారణంగా. కానీ గీసిన చిత్రాల్లో ఉద్యమ చైతన్యం నింపడం చిత్తప్రసాద్‌కే సాధ్యమైంది. అందులో ముఖ్యంగా తెలంగాణ ప్రజల సాంస్కృతిక సారాన్ని పట్టుకున్న కళాకారుడుగా, మన ప్రాంతం వాడే అన్నంత మమేకం చెందాడు. అందుకు మార్క్సిస్టుగా జీవితాంతం నిబద్ధంగా కొనసాటమే కారణమని చెప్పవచ్చు.





ఒక్క తెలంగాణ సాయుధ పోరాటమే కాదు, ప్రపంచంలో ప్రజాకంటకంగా మారిన ఫాసిస్టు యుద్ధంపైన కూడా తన కలాన్ని ఝుళిపించాడు. ముప్పయి లక్షల మంది సామాన్య ప్రజలను బలిగొన్న బెంగాల్ కరువు ప్రాంతాలలో పర్యటించి, అక్కడి ఆకలి చావుల దృశ్యాలను చిత్రబద్ధం చేశాడు. యుద్ధాలను వ్యతిరేకిస్తూ, శాంతికోరుతూ బొమ్మలు గీశాడు. స్త్రీ పురుషుల మధ్య ప్రేమను, అనురాగాన్ని, అనుబంధాలను తెలియజేస్తూ కూడా చిత్రాలు వేశాడు. ఆయన రేఖలలో అంగాంగ ప్రదర్శనలు, అశ్లీలతలు కనిపించవు. అనుబంధ సౌందర్యం కనబడుతుంది. నాజూకైన ఒంపుల గీతలు కావవి. నవ ప్రపంచ స్వప్న సమూహ కదలికలు. మాట్లాడే ఫొటోగ్రాఫులవి. నలుపు తెలుపులయినా మనల్నిట్టే ఆకట్టుకునే చిత్రజ్వాలికలు. అందుకనే ఆయన ప్రపంచ ప్రసిద్ధ ప్రజా చిత్రకారుడు.

విప్లవ కార్యకలాపాలకు, ఆలోచనలకు కేంద్రమైన చిట్టాగాంగ్, బంకురాలలో విద్యను అభ్యసించిన చిత్తప్రసాద్ 1915 జూన్ 21న జన్మించారు. అతనికి ఇష్టమైన చిత్రకళావిద్యను అభ్యసించాలనుకుని కలకత్తా గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో చేరాలనుకుంటే, దాని ప్రిన్సిపాల్ రాజకీయాలలో పాల్గొననని రాసిస్తే సీట్ ఇస్తానని షరతు పెట్టాడు. చిత్తప్రసాద్ ఆ షరతును తోచిపుచ్చి ప్రజల మధ్యనే తన కళకు సానపట్టాడు. 'నీకు మేం నేర్పేది ఏమీలేదు. నీ పద్ధతిలోనే అలా కొనసాగించు. ఒకనాటికి మమ్మల్ని మించి పోతావు' అని శాంతినికేతన్ ఆనాటి నిర్వాహకుడు రవీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్‌ల ప్రశంసలు అందుకున్నాడు. బెంగాలీ జానపద గాథలను తన స్వంత బాణీలో తిరగరాసి, తన బొమ్మలతో ప్రచురించాడు. భారతీయ, విదేశీయ, ఆధునిక కళారీతులను అధ్యయనం చేశాడు. తన శైలికి అన్వయించుకున్నాడు. ఆయన కేవలం చిత్రకారుడే కాదు. కవి, రచయిత, గాయకుడు కూడా. ఆనాటి అభ్యుదయ రచయితల సంఘం, ప్రజా కళాకారుల సమూహంతోని అనుబంధం కలిగి వుండి జన కళకు జీవం పోశారు. తన కళను అమ్మి జీవించడానికి ఎప్పుడూ నిరాకరించేవాడు. నమ్మిన సిద్ధాంతానికి నిబద్ధుడై వున్నాడు. అతని ప్రతిభను మనకంటే విదేశీయులే ముందు గుర్తించారు. చెకొస్లేవేకియాలో ఇతనిపై డాక్యుమెంటరీ చిత్రం నిర్మించారు. రష్యా, దుబాయ్, అమెరికా, ఢిల్లీ, ముంబయిలలో ఈయన చిత్రాలు భద్రపరచబడ్డాయి. 1978 నవంబరు 13న 63 ఏండ్లకే మరణించినా ప్రజా కళాకారులు నిత్యం స్మరణీయంగానే వుండే అమరులు. చిత్తప్రసాద్‌కు విప్లవ జోహార్లు.





ఎర్రన్ని సూరీడు ఏచూరి... ఎర్రజండ బిడ్డ ఏచూరి..



నేతవైన నువ్వే నేస్తమైనా నువ్వే
రాతవైనానువ్వే కూతవైనా నువ్వే
పోరాటమైనా నువ్వే పార్లమెంటైనా నువ్వే
ఉద్యమాల బాట నువ్వే ఆశయాల వెలుగు నువ్వే
సీతారాం ఏచూరి... కమ్యూనిస్టు ఖడ్గధారి
ఎర్రన్ని సూరీడు ఏచూరి ఎర్రజండ బిడ్డ ఏచూరి ॥ఎర్రన్ని॥
ఎట్టబోతివయ్య ఏచూరి ఎంతపని జరిగింది ఏచూరి
॥ఎర్రజండ॥
నీవు లేకుంటేను ఏచూరి నిన్న నేడు దిగులు ఏచూరి
॥ఎర్రజండ॥
ఎంత చక్కనోడ ఏచూరి ఏడ తగ్గనోడ ఏచూరి
॥ఎర్రజండ॥
ఎన్నిచదివినవులే ఏచూరి ఏడైన నెగ్గేవు ఏచూరి
॥ఎర్రజండ॥
నవ్వుల్ల నెలరాజు ఏచూరి పువ్వంటి పరిమళం ఏచూరి
॥ఎర్రజండ॥
సమరాన మొనగాడు ఏచూరి సభలోన చెలరేగు ఏచూరి
॥ఎర్రజండ॥
గొప్ప పదవులు వదలి ఏచూరి పేదోళ్లకై నిలిచె ఏచూరి
యోధుల్ల అడుగుల్లో ఏచూరి పదునెక్క తానెంతో ఏచూరి
॥ఎర్రజండ॥
విద్యార్థిగా మొదలు ఏచూరి విప్లవారుణ తార ఏచూరి
॥ఎర్రజండ॥
విజ్ఞాన ఖని తాను ఏచూరి విశాలమగు చూపు ఏచూరి
॥ఎర్రజండ॥
శ్రమజీవుల కొరకు ఏచూరి సామ్యవాదం బాట ఏచూరి
ఎదురుదెబ్బేదైన ఏచూరి మునుముందుకే సాగె ఏచూరి
॥ఎర్రజండ॥
మత రాజకీయాల ఏచూరి మర్మాన్ని చూపాడు ఏచూరి
॥ఎర్రజండ॥
రాజ్యాంగ రక్షణకు ఏచూరి రణభేరి మోగించే ఏచూరి
॥ఎర్రజండ॥
లౌకిక భావులను ఏచూరి ఏకమే చేసెలే ఏచూరి
॥ఎర్రజండ॥
జగమంత తిరిగాడు ఏచూరి ప్రగతి శక్తుల కలిపే ఏచూరి
॥ఎర్రజండ॥
ఏమి కోరినాడు ఏచూరి ఏదైన దేశమనే ఏచూరి
॥ఎర్రజండ॥
కనుమూసినా తాను ఏచూరి కనుపాపగా నిలుచు ఏచూరి.
॥ఎర్రజండ॥
నీ తోవలో నడిచి ఏచూరి నీ కలలు పండిస్తాము ఏచూరి
॥ఎర్రజండ॥
తెలుగువాళ్ళ ఘనత ఏచూరి చెరిగిపోని చరిత ఏచూరి

-తెలకపల్లి రవి

కవిత్వపు పల్లకీపై ఊరేగిన దేశీయ పలుకుబడి

తెలంగాణ అనగానే సంస్కృతికి పర్యాయపదం. కాలమెంత ఆధునికమైనా,సాంకేతికమైనా,నాగరీకమైనా తెలంగాణ జనులు వాళ్ల సంస్కృతిని కొలుస్తారు. గులాబీల కన్నా తంగేడుపూలకే మొక్కుతారు.మేడమిద్దెల స్వర్గం కన్నా మట్టినే తలుస్తారు. డిజేలు పక్కన మోగుతోన్నా బోనమెత్తుకుని పూనకమాడతారు. దేశీయమైన సోయి తెలంగాణ గాలినిండా పరివ్యాప్తమై ఎపుడూ ఉంటూనే వుంది. అక్కడి కవులు మట్టిమీద కాళ్లని కాదు, కలమూనుతారు. మట్టిలో మట్టిగంధంగా చెమటోడ్చే మనుషులకు కావ్యంతో చుట్టరికాలు కలుపుతారు. అలా కవనపల్లకీపై దేశీయతను నుడికారపుసొంపుగా ఊరేగిస్తోన్న నవీనకలం నాగిళ్లరమేష్ .అతడి నుదులకూర్పుకి పెట్టుకున్న శీర్షిక నల్లకొడిసె వన్నెకాడు.ఇదివరలో అతడి కవిత్వపుటొరలో నింపుకొన్న ఆయుధాలు వడిసెలరాళ్లు. ఆ రాళ్లతో గుండెలను తట్టే నానీలను పలికించాడు. మరొకటి ఉద్ధరాశిపూలచెట్టు. కైకిలికిపోయే అమ్మ శ్రామికతను కవిత్వ రసాలోకంగా బొమ్మకొట్టించాడు. పదాలను బతుకు వీచికలుగా ప్రసరించిన గతమే కాదు వర్తమానమూ వుంది. అదే నల్లకొడిసెవన్నెకాడు.

పాలకొడిశె,నల్లకొడిశె చెట్లుంటాయి. ఈ కవి జీవితానికి ప్రతీకగా నిలిచిందీ,నీడపట్టిందీ నల్లకొడిశె.దాని వన్నెలో వున్నవాడు ఈ కవి నాగిళ్ల రమేషే.శ్రమజీవితాన్ని పుష్కలంగా బతికొచ్చిన నోస్టాల్జియా అతడు. ఆ శ్రమజీవితపు నెమరేతలో ఈ కవిత్వపుసారమంతా వ్యక్తమయింది. మనసుపదను గల్ల ఈ కవి తనను తాను దేవులాడుతున్నాడు.ఈ సంపుటి సాక్షిగా తనలాంటి పల్లెమట్టివాసనల బాలకులను వెతుకులాడుతున్నాడు.

"పెండతో మెత్తువేసిన గాదెలోకి దిగి/ గిన్నెతోటి అడుగువడ్లను ఎత్తేటందుకు/ ముక్కులనిండా నెత్తినిండా/ దుమ్ము పోసుకున్న ఆ పోరడేడీ!?/ నెత్తికి తువ్వాలపేగు కట్టుకుని/ జప్పజప్ప మునుం ఎల్లి/ ముసలి అవ్వకు ఎదురుమునుం గోసే/ నల్లకొడిసె వన్నె ఆ పోరగాడు నాగ్గావాలె"

కవి భద్రతగల ఉద్యోగజీవితంలో వున్నా మూలాలను మరువలేదు. పల్లెను గుండెలోంచి తీసేయలేదు. పల్లె ఆనవాళ్లను నాలుకపైనుంచి తోసేయలేదు. పల్లెలో మట్టిలో వెన్నొంచి పాడుబడే జనాల పనిదృశ్యాలను సూక్ష్మదృష్టితో రాసాడు. రాయలవారు ఆముక్తమాల్యదలో రాసిన గ్రామీణ జీవిత దృశ్యాలను గుర్తుకుతెచ్చాడు. రాయలవారి కలానికి వున్న పల్లెదృశ్యాల నిశితత్వం ఈ కవిలోనూ వుంది. అయితే రాయలోరిది చూసిన అనుభూతి. నాగిళ్లరమేష్ ది పల్లెలో కోటి అడుగుల మట్టిజాతరగా తిరుగాడిన అనుభవం. స్వానుభవైక పల్లెటూరి శ్రమజీవన వైభవాన్ని పుటలీకరించాడు ఈ కవి. పెండతో మెత్తువేసిన గాదె, కిందగ్గోసిన కల్లంమడి పదనవాసన పీల్చడం, ఇరికికొమ్మను నరుకుతూ గొడ్డలిచిప్ప కాలుకి తాకడం, పారలేకున్న సర్రసర్ర కాలువను తెంపడం, గొడ్లను కాసుకుంటూ దూపకి గట్టుదోనెల్లోని వాననీళ్ల మాధుర్యాన్ని చవిచూడటం వంటి దృశ్యాలు ఈనాటి కుర్రతరం ఎరుగదు. గనకే నాగిళ్ల ఆగామీ తరాలముందు పల్లెదృశ్యాలకుప్పవోశాడు. పల్లె అణువణువునీ తన అణువణువు పులకింతగా నింపుకున్న క్రియాశీలకవి నాగిళ్లరమేష్ .

నలుపువన్నెను తనివితీరా చూసేటోళ్లుండరు. తాత్వికత మనసునిండిన మనుషులే నలుపువన్నె మనుషులను అక్కునజేర్చుకుంటారు. నల్లనివాడు పద్మనయనంబుల వాడని పాడతారు. ఈ కవి శ్రమచేతలచేత నలుపుబారిన దళితబహుజనులకు ప్రతీకగా తీసుకున్నాడు. ప్రేమార ఆ మనుషుల పాటుబడే గుణాన్నీ,నీతిని,స్వచ్ఛతను కావ్యవేదికల మీద నిలిపాడు.ఆ మనుషుల్లో ఒకప్పుడు ఒకడైన ఈ కవి వాళ్ల బురదపాదాలకు కవితాభివందనాలు చేసాడు. దేశీయ పలుకుబడితో వాళ్ల జీవన వైభవాలను మూర్తీభవింపజేసాడు. ఆ తీరునిపుడు గమనిద్దాం.

"గుండె అర్రల నిండా/ పజ్జొన్నకర్రలలాంటి/ ఆకలిజెండాలు వుంటాయి/ నువ్వు దళారీచేతిలో మోసపోతున్నా/ రాజ్యపు చేతిలో మోసపోతున్నా/ మట్టిమీదున్న మట్టంత నమ్మకమే/ నిన్ను బతికిస్తుందని కదా/ మట్టిబెడ్డలకిందా నీ ఆత్మగింజను/మళ్లీ మళ్లీ దాసుకుంటావు/నీవే గింజై/ నీ తనువే మట్టై". రైతు సాగుని ఆత్మగింజగా ఎలా అంకితభావంతో పండిస్తాడో అలతిఅలతి జనులభాషలో రాయగల నిపుణత నిండుగున్నోడీ కవి.

పొలంగెట్టుకాడ, మూలవాగు కాడ, తండాతల్లి పొయ్యి వూదేకాడ, సెమటచుక్కలు బతుకుపువ్వులయ్యేచోట మన్నులో తలకాయబెడతడీ కవీ.మన్నును కుంకుమ జేసే చేతులకు పబ్బతివడుతడు. తన వాక్యాలు పచ్చని బీరపూలపాదై గుడిసెను కావ్యనాయకను చేస్తుంది. మరొకవాక్యం వలసపాఠమవుతుంది. ఇంకోవాక్యం లోకపుచెట్టు మండమండకు మమతలను మొగ్గ తొడిగించాలని ముందుకురుకుతుంది.

నాగిళ్లలో మట్టిమీద మహాప్రేమ కనవడుతుంది. మట్టిలో మట్టిగంధమై గుబాళించే మనుషుల మీద ఇష్టం తెలుస్తున్నది. మట్టి మనుషుల పదాలనే సిరాకి సోపతి కుదిర్చాడు.మట్టిపదాలను కవిత్వపెదాలగా రమణింపజేసి సంపుటికి అనుబంధంగా అతికించాడు. ప్రాకృతిక సోయిని మతిగనిచ్చాడు. కొన్ని మట్టిపదాలను బుక్కుదాం.

1."వసంత వాసనల నలుగువెట్టుకున్న పెండ్లిపిల్ల/అడివి"

2."దూదిపూల మబ్బులహారం/నేలతల్లి మెడకు చుట్టుకునే /ఆవుసు"


3."ఒక్కొక్కసారి కల్లుమండువ/బోధివృక్షం"

4."తడిని దాచుకున్న ఇసుకపార/సోపతి"

5."రెండు సేతుల ఇత్తునం ఏసే మా అవ్వ/ద్విపదకావ్యం"

ఇలా గంపకెత్తితే నిండి పొర్లుపోయేన్ని కమ్మకమ్మని మట్టిపదాలున్నాయి. బ్రివిటీనీ,నవ్యతను, ఊహాశక్తినీ, భావాలను చిత్రాలుగా గీసే నిపుణత సంపుటిసుతన పలికించడం చేశాడు. ఆఖరిముద్దలో నెయ్యి కలిపి తిన్నంత రుచులూరించారు.

దేశీయపదాలను ఒడుపుగా దిగుబడి చేసుకున్నాడు. జీవితాన్ని పులుముకున్న నలుపువన్నెల దుమ్ముదమ్ము పదాలను,వాక్యాలను సంబురంగా వాడుకున్నాడు. గుజులుగుజులుగా వున్న వరినారు,పునాసకు పుదిచ్చిన ఇత్తునం గంప,గెరువిచ్చిన వానకు పురివిప్పె నెమలి,లొట్టపీసు పూలను సుక్కలపర్వతం జేసే కొంగలు వంటి పల్లె పదచిత్రాలతో ఇబ్బడిముబ్బడి సహజసౌందర్యాన్ని కవిత్వంగా సమకూర్చాడు. సాగుతది,విసిరేస్తది,దండం బెడతది, ఎరుకజేస్తది,నవ్వుతది వంటి క్రియలను, ఇంకింత,గియింత, ఇంతాంత,అసొంటి వంటి పదాలను



అభిరుచితో వాడకం చేసాడు. వలె,లాగా ఉపమాలంకారంలో వున్నట్టు దేశీయనుడిలో సిమిలీవాచకంలా అసొంటిని తెచ్చాడు.

కవికి తాత్వికతలో ప్రవేశం వున్నప్పుడు,అతడి కవిత్వంలో ఆవేశం లేని నది కనవడుతుంది. తేటబడిన ప్రవాహం కనబడపడుతుంది. నాగిళ్ల దేశీయపదాలతో సరళతాత్వికతను సాధించాడు.

"కల్లంబండ మీద ఉసుకె కలువని దినుసువోలె/బతుకుని తూర్పార వట్టుకొనుడు ఇష్టం"

"మూలవాగు మూలవాగు/నా మైలను తెల్లగా కడిగేందుకు/ నాలోనే పారు,నాతోనే పారు"

నాగిళ్లరమేష్ నల్లకొడిసె వన్నెకాడు దేశీయనుడితో పాటు, దళిత బహుజన ఆదివాసీ జనుల వెతలతోపాటు, మానవ సంబంధాలను, అంతర్లీన ప్రసక్తాలుగా సమకాలీనత, తాత్వికత విరివిగా వచించాడు. పల్లెలో శ్రమజనుల బతుకు దృశ్యాలను పరిపూర్ణంగా దర్శింపజేసాడు. శీర్షికలను పెట్టడంలో శ్రద్ధ కనబరిచాడు. కొన్ని కవిత్వనిర్మాణ శిల్పాలు, ఎత్తుగడలు ఒకేలా అనిపించాయి. కనబడితే బాగుణ్ణు, అలా జరిగితే బాగుణ్ణు, అవ్వాలనివుంది లాంటి నిర్మాణాలు మరింత వైవిధ్యాన్ని రాస్తే సంపుటి శిల్ప ప్రజ్ఞను చేరేది. మట్టితోని అభివ్యక్తులు పెక్కుసార్లు పునరుక్తం కాకుండా చూడాల్సింది. చిన్ని చిన్ని విషయాలే ఇవి. అయితే నాగిళ్లరమేష్ కవిత్వమంతా ఎన్నదగినదీ,నాణ్యమైనదీ. చర్చించదగిందీ, దేశీయనుడుల అన్వయింపులో అతడి కలం మంచిచేర్పు. పల్లె ఉపమానాలను బహుగా కావ్యస్థం చేసాడు. అతడు విస్మృతిగల వస్తువులని ఆవిష్కరించాడు. నల్లకొడిసె వన్నెకాడు నాగిళ్ల రమేష్

- మెట్టానాగేశ్వరరావు,
9951085760



నేల - వాన!!

వానకు నేల నాని నాని నాణ్యమౌతుంది
నాణ్యమైన నేలలో విత్తనాలు పండి
కిసాను దోసిట్లో భవిష్యత్తు పంటలకు
నాణాలు అవుతాయి
వట్టి వాన పంట కాదు వట్టి నేలా పంట కాదు
వాన నేల కలిస్తేనే పంట పండగ
దేశం ఆకలి దోషం పోతుంది
అసలు వానను నేలను నమ్ముకున్న రైతే
ప్రపంచాన అధినాయకుడు!
అందరూ ప్రేక్షకమాత్రులు
ఉన్నవాడు లేని వాడు రోజూ మూడు పూటలూ
మరిచి పోకుండా కృతజ్ఞతలు చెప్పాల్సిందే
లేకుంటే తిన్నది అరగదు సుమా!!

-కందాళై రాఘవాచార్య, 8790593638

డా.రాయారావు సూర్యప్రకాశ్ రావుకు కాళోజీ పురస్కారం

తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ కాళోజీ పురస్కారానికి రచయిత డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు ఎంపికయ్యారు. మహబూబ్ నగర్ లోని భారత్ స్కౌట్స్ భవనంలో ఈ నెల 22వ తేదీన జరిగే సభలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి పురస్కారానికి ప్రముఖ కవయిత్రి వీణారెడ్డి ఎంపికయ్యారు. ఈ సభకు ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, డా.పొద్దుటూరి ఎల్లారెడ్డి, మద్ది అనంత్ రెడ్డి, డా.నలవోలు నరసింహా రెడ్డి, డా.వంగీపురం శ్రీనాథాచారి, లక్ష్మణ్ గౌడ్, పాకాల లక్ష్మి రెడ్డి అతిథులుగా పాల్గొంటారు.

– శ్రీమతి రావూరి వనజ, శ్రీమతి జి.శాంతారెడ్డి

సురవరం ప్రతాపరెడ్డి గారిపై కవితలకు ఆహ్వానం

ఆధునిక వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి గారి మూర్తిమత్వం పై కవితలను ఆహ్వానిస్తున్నాం. ఇట్టి కవితలు అక్టోబర్ 30.2024 వ తేదివరకు పంపగలరు. కవితలు పంపవల్సిన వాట్సాప్ నెంబర్ 9492765358 vanapatlasubbaiah1972 @gmail.com కు పంపగలరు. మెరుగైన కవితలను నవంబర్ 2024 లో సంకలనంగా ముద్రిస్తామని తెలిపారు.

– వనపట్ల సుబ్బయ్య, 9492765358

తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాలు

తాటికొండాల నరసింహారావు సతీమణి శ్రీమతి తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాల సభ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటలకు దొడ్డి కొమరయ్య హాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగం పల్లి హైదరాబాద్ నందు జరుగుతుంది. 2023 వ సంవత్సరానికి గాను డాక్టర్ యెస్. గోపి, 2024 వ సంవత్సరానికి ప్రసేన్ పురస్కారాలను స్వీకరిస్తారు. ప్రముఖ కవులు నందిని సిధా రెడ్డి, ఏనుగు నరసింహా రెడ్డి, గౌరీశంకర్, సీతారాం, యాకూబ్, ఆనందా చారి, యెస్. రఘు సభలో ప్రసంగిస్తారు.

– వంశీకృష్ణ, 95734 27422



వినాయక నిమజ్జన సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

వినాయక నిమజ్జనం సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాథులను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి గొల్లగూడెం రోడ్‌లోని శ్రీ సత్యసాయి నగర్, శ్రీనివాస్ నగర్, ముస్తఫానగర్, విద్యానగర్, టిడిపి కార్యాలయం రోడ్, విడిఓస్ కాలనీ, ఎఫ్‌సిఐ గోడౌన్, ఖమ్మం రూరల్‌లోని పెద్దతండ, శ్రీరామ్ నగర్ కాలనీ-2లోని గణేష్ మండపాల్లో ప్రతిష్టించిన గణనాథులను దర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, రాపర్తి శరత్, దొడ్డా నగేష్, నాయకులు తుళ్ళూరు బ్రహ్మయ్య, కొప్పుల చంద్రశేఖర్, షేక్ మియా భాయ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సత్తుపల్లి మహిళాశాఖ కార్యదర్శిగా ఝాన్సీ

నవతెలంగాణ-సత్తుపల్లి



సీపీఐ(ఎం) శాఖా మహాసభల షెడ్యూల్ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో ఆదివారం మహిళాశాఖ మహాసభను నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు పాల్గొని ప్రసంగించారు. పార్టీలో మహిళల సభ్యత్వాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పార్టీలో మహిళల సంఖ్యను పెంచుకోవడం ద్వారా పార్టీని నిర్మాణ పరంగా మరింతగా బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మహిళాశాఖ కార్యదర్శిగా పాకలపాటి ఝాన్సీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సభ్యురాలు చావ కవిత అధ్యక్షతన జరిగిన మహిళాశాఖ మహాసభలో నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, మహిళా నాయకురాళ్లు చెరుకు కుమారి, ప్రభావతి, పుష్పావతి, సత్యవతి, బసవమ్మ, రజిని, కృష్ణవేణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



111 నెలలుగా వైద్య శిబిరం నిర్వహణ

- వైరా బోడేపూడి కళానిలయం వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపుడి వేంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే వైద్య శిబిరాన్ని 111వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపుడి కళానిలయం వైద్య శిబిరం ద్వారా గత 111 నెలలుగా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. 111 నెలల క్రితం ప్రారంభమైన బోడేపూడి వైద్య శిబిరానికి డాక్టర్ల బృందం క్రమం తప్పకుండా హాజరు కావడం, వాలంటీర్లు నిబద్ధతతో పనిచేయడం వలన విజయవంతంగా ముందుకు సాగుతోందని సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె, కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని, వర్షాకాలంలో గుండె, శ్వాసకోశ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య శిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, మందడపు నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, తాటి కృష్ణకుమారి, పూనాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



వరదల్లో కొట్టుకుపోయిన రహదారులను పూర్తి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో కొట్టుకుపోయిన రహదారులు, సైడ్ డ్రెయిన్‌లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కేవీ.రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చెరువుమాదారం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు. అనంతరం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ, తెలంగాణ అమరవీరుల సభను కొండ తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను టీరెడ్డి యాకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల తాకిడికి గ్రామీణ ప్రాంతాలలో అనేక రహదారులకు గండ్లు పడ్డాయన్నారు. రైతుల పొలాలు వరదల్లో కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరదలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పంట పొలాలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించడంలో కూడా జాప్యం జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలలో కౌలు రైతులకు ఏడాదికి 15 వేల రూపాయలు, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు, ప్రతి కుటుంబంలోని మహిళకు 2500 రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించి నేటికీ అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, వై.నరసింహారావు, ఎస్కె మైమద్, బ్రహ్మం తిరపయ్య, బ్రహ్మారెడ్డి, నవాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్యాతండ వరద బాధితులకు సాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా వారి ఆధ్వర్యంలో ఖమ్మంరూరల్ మండలం వాల్యాతండా వరద బాధితులకు సుమారు వంద కుటుంబాల వారికి కుటుంబానికి రెండు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో యన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.హిమబిందు, గౌరవ అధ్యక్షురాలు బత్తినేని నీరజ, ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, కోశాధికారి యస్.నాగేశ్వరరావు, కార్యదర్శి రాయల రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దినేని రాధాకృష్ణ, కమిటీ సభ్యులు బెల్లం రాధాకృష్ణ, వాసిరెడ్డి వీరభద్రం, స్థానిక రాజకీయ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఎర్రబారుతున్న పత్తి

ఆందోళన చెందుతున్న అన్నదాతలు
రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిన తుఫాన్
80 శాతం దెబ్బతిన్న పత్తి

నవతెలంగాణ - బోనకల్



ఇటీవల తుఫాను ప్రభావంతో పది రోజుల పాటు వరుసగా కురిసిన వర్షాల వలన మండలంలో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగిందని అన్నదాతలు అంటున్నారు. సుమారు 80 శాతం వరకు పత్తి పంట దెబ్బతిన్నదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి ఎర్రబారుతుందని, దీని వలన పత్తి దిగుబడి గణనీయంగా పడిపోతుందన్నారు. ముదురుపత్తి చేలు మాత్రమే కొంతవరకు మంచిగా ఉన్నాయని, లేత పత్తి చేలు దాదాపు 80 శాతానికి పైగానే నష్టపోయాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ మండల వ్యాప్తంగా వానకాలం పంటగా 17,518 ఎకరాలలో పత్తి పంటను అన్నదాతలు సాగు చేశారు. ఇప్పటికే పూర్తిగా పెట్టుబడి పెట్టి ఉన్నారు. ఒక్కొక్క ఎకరానికి సుమారు 30 వేల రూపాయల వరకు అన్నదాతలు పెట్టుబడి పెట్టారు. మరి కొద్ది రోజులలో పత్తి పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.

మండల వ్యాప్తంగా 17,518 ఎకరాలకు గాను అన్నదాతలు ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున రూ 52.55 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఈ పెట్టుబడులో సుమారు 80 శాతం వరకు నష్టం జరుగుతుందని అంటే సుమారు రూ.42 కోట్ల వరకు నష్టం జరుగుతుందని అన్నదాతలు అంటున్నారు. సహజంగా ఎకరానికి పత్తి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అన్నదాతలు తెలిపారు. క్వింటా రు. 5,000 రూపాయలు ఉన్న సుమారు 50 వేల నుంచి 60 వేల వరకు ఆదాయం వచ్చేది అన్నారు. కానీ ప్రస్తుతం తుఫాను ప్రభావంతో పత్తి పంట దెబ్బతినడంతో ఎకరానికి రెండు నుంచి నాలుగు క్వింటాల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు అంటున్నారు.

8 ఎకరాలలో పత్తి సాగు చేశా
దొప్ప కొరివి వీరభద్రం, రైతు, ముష్టికుంట్ల



8 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాను. ఎకరాకు 30 వేల చొప్పున సుమారు రూ. 2.40 లక్షల రూపాయలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. పంట మొత్తం పూత, పిందెతో కళకళలాడుతుంది. కానీ తుఫాన్ తనను కోలుకోలేని దెబ్బతీసింది. ఎకరానికి రెండు నుంచి నాలుగు క్వింటాల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా లేదు. ఈ సంవత్సరం కూడా పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయా.

రూ 3.30 లక్షల పెట్టుబడి పెట్టా
కొమ్మినేని నాగేశ్వరరావు, రైతు, రామాపురం



11 ఎకరాలలో పత్తి పంటను సాగు చేసి సుమారు రూ.3.30 లక్షలు పెట్టుబడి పెట్టాను. తుఫాను దెబ్బతో 80 శాతానికి పైగానే పంట దెబ్బ తిన్నది. పంట మొత్తం పూతా ఎక్కువ భాగం రాలిపోయి ఎర్రబారిపోతుంది. దీంతో దిగుబడి భారీగా తగ్గిపోతుంది. ప్రభుత్వం పంట నష్టం సర్వే సక్రమంగా చేయటం లేదు. వేళ్ళతో సహా బయటికి వస్తేనే పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. పూత, పిందె రాలిపోయిన పత్తి చేలు కూడా నష్టపోయినట్టు నమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలి.



మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలం : ఐద్వా

నవతెలంగాణ-ముదిగొండ

మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ విమర్శించారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో ఆదివారం జరిగిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల మూడవ మహాసభను ఆమె లాంఛనీయంగా ప్రారంభించి మాట్లాడారు. మహిళ పక్షపాతిని, చెప్పుకునే పాలకులు వారికి భద్రత చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రతి మహిళ ఎక్కడో ఒకచోట వివక్షతకు గురవు తుందన్నారు. మహిళా ముఖ్యమంత్రి పాలనలో ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఒక జూనియర్ డాక్టర్ను ఘోరంగా అత్యాచారం చేసి, హత్య చేసిన తీరు భారత జాతి దిగ్భ్రాంతికి గురైందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలు, దళితులు, గిరిజనులపై అత్యంత దారుణ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలు భారతదేశంలో ప్రతిరోజు జరుగుతూనే ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్రం, సమానత్వం కొరకు పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శి బండి పద్మ, మాచర్ల భారతి మాట్లాడుతూ మహిళలు వంటగదికే పరిమితం కాదని, శాస్త్ర సాంకేతిక రంగాలలో తమ నైపుణ్యతతో ముందుకెళు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మహిళలందరికీ నెలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. తొలిత మహాసభ ప్రాంగణంలో ఐద్వా పతాకాన్ని జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి ఎగరవేశారు. వీర నారీమణుల చిత్రపటాలకు మహాసభ ప్రతినిధులు పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఐద్వా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా మండల అధ్యక్షురాలుగా ముదిగొండకు చెందిన మందరపు పద్మ, కార్యదర్శిగా చిరుమర్రి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోలేటి అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు, మరో 19 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు పయ్యావుల ప్రభావతి, మండల అధ్యక్ష కార్యదర్శి మందరపు పద్మ, కోలేటి అరుణ, నాయకురాళ్లు కటారి రోజా, వినుకొండ రాణి, బాజా కవిత, మాదారపు సంధ్య, ఇరుకు సైదమ్మ, కొండమీద సువార్త, రాయబారపు సులోచన, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-కారేపల్లి

విధులకు ఖమ్మం వెళ్తున్న హోంగార్డు రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం కారేపల్లి మండలం చీమలవారిగూడెం వద్ద చోటుచేసుకుంది. ఇల్లందు మండలం ముకుందాపురం (కొమ్ముగూడెం)కు చెందిన చందర్ తన అత్తగారి ఊరైన కారేపల్లి మండలం మాధారంలో ఉంటూ ఖమ్మంలో హోంగార్డు విధులు నిర్వరిస్తున్నాడు. శనివారం విధులకు వెళ్లటానికి మోటర్ సైకిల్‌పై బయలు దేరిన చందర్ చీమలవారిగూడెం మూలమలుపు వద్ద రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీనిని చూచిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు కబురు చేసి ఖమ్మం అసుపత్రికి తరలించారు. మూలమలుపు వద్ద మోటర్ సైకిల్ అదుపుతప్పి పడి ఉంటుందని బావిస్తున్నారు.



రుణమాఫీ కాని సహకార సంఘం

- 191 మంది రైతులకు అందని రుణమాఫీ
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు,
- సాంకేతిక లోపాన్ని సరిచేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల తరుణంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాంకులలో అప్పు పొందిన ప్రతి రైతు ఎకౌంట్‌లో రెండు లక్షల రూపాయలలోపు రుణాన్ని జమ చేస్తామని, రుణమాఫీ చెల్లిస్తామని చెప్పి ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర స్థాయిలో సుమారు 30% మించి రుణమాఫీ చేయలేదని 70 శాతం రైతులకు రుణమాఫీ అందలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో సుమారు 12 గ్రామాలకు విస్తరించి ఉండగా సంఘంలో 1056 మంది రైతులు అప్పు పొంది సంఘ సభ్యులుగా కొనసాగుతున్నారు.1056 మంది సభ్యులుకుగాను ఐదు కోట్ల 75 లక్షలా 95 వేల 362 రూపాయలు వరకు రుణం పొంది ఉన్నారు.ప్రభుత్వం మొదటి విడతలో ఒక లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశారు. అయ్యవారిగూడెం సొసైటీకి సంబంధించి 191 మంది రైతులు లక్ష రూపాయలలోపు రుణమాఫీకి అర్హత కలిగిన వారు ఉన్నారు.191 మంది రైతులు 99 లక్షలా 50 వేల 739 రూపాయలు రుణం పొందారు. దీనికి గాను ఐదు లక్షల మూడు వేల 790 రూపాయలు వడ్డీ కాగా 191 మంది రైతులు తీసుకున్న అప్పును రుణమాఫీ చేయకుండా కేవలం వడ్డీ మాత్రమే రుణమాఫీ చేసినట్లు రైతులు తెలిపారు. దీనిపైన రైతులు ఆందోళన చేయగా సొసైటీ సిబ్బంది ఉన్నతాధికారులకు జరిగిన లోపాన్ని తెలియప రిచారు. సాంకేతిక లోపం వలన పొరపాటు జరిగిందని దానిని సరిచేసి రుణమాఫీ చేస్తామని చెప్పి నెల రోజులు దాటినా నేటికీ 191 మంది రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేయలేదని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. జరిగిన పొరపాటుని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకుని వెళ్లామని రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, అయినా జరిగిన లోపాన్ని సరిచేసి రుణమాఫీ చేయలేదని వాపోతున్నారు. వీటి తోపాటు రెండు లక్షల రూపాయల పైబడి అప్పు ఉంటే బ్యాంకర్లు రెండు లక్షల పైన అప్పు కలిగి ఉన్న రైతులు డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి మీరు డబ్బులు కట్టవలసిన అవసరం లేదని చెబుతున్నారని రుణమాఫీ విషయంలో ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని రైతులు విమర్శిస్తున్నారు. రేషన్‌కార్డు లేని వారి విషయంలో రుణమాఫీ ఉండి రేషన్ కార్డు లేనివారు రుణమాఫీ కానీ రైతులు మండల వ్యవసాయ అధికారులతో పాటు కలిసి ఫోటో దిగి అప్ లోడ్ చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ పొంది రేషన్ కార్డు లేకుండా రుణమాఫీ పొందిన వ్యక్తి చనిపోయి ఉంటే అతను పరిస్థితి ఏమిటని వ్యవసాయ అధికారులను ప్రశ్నించామని, ఈ విషయంపై ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదేశాలూ రాలేదని ప్రభుత్వం నుండి వచ్చిన ఆదేశాల మేరకు మాత్రం పని చేస్తున్నామని చెప్పారని రైతులు తెలిపారు.

రుణమాఫీ వెంటనే చేయాలి
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య



అయ్యవారిగూడెం సొసైటీ నందు ప్రభుత్వం ప్రకటించిన మొదటి విడతలో 191 మంది రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కాలేదు. వడ్డీ మాత్రమే చేశారు. సాంకేతిక లోపం సరిచేసి రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలి.

సాంకేతిక లోపాన్ని సరిచేసి రైతులందరికీ రుణమాఫీ చేస్తాం
అయ్యవారిగూడెం సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివ రావు



సాంకేతిక లోపం వలన అయ్యవారిగూడెం సొసైటీ సభ్యులకు మొదటి విడతలో లక్ష రూపాయలలోపు రుణమాఫీ కానీ మాట వాస్తవమే. జరిగిన సాంకేతిక లోపాన్ని సరిచేసి రైతులందరికీ రుణమాఫీ అందేలాగా ప్రయత్నం చేస్తాను.

వైరా మున్సిపాల్టీలో అన్నీ సమస్యలే..!

- అధ్వానంగా పనితీరు...
- మైనర్ గ్రామ పంచాయతీ పని తీరుకు తీసికట్టు
- ట్యాక్స్, అనుమతులు, రుసుములకు మాత్రమే మున్సిపల్ నామ్స్

నవతెలంగాణ-వైరా



వైరా మునిసిపాలిటీ తొలి పాలక వర్గానికి ఐదేళ్లు నిండే సమయం దగ్గర పడింది. నాలుగున్నర ఏళ్ల పాటు అధికార పార్టీగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి 17 మంది కౌన్సిలర్స్ ఎన్నికై తిరుగులేని ఆధిక్యత లభించింది .కేవలం ముగ్గురు మాత్రమే ప్రతిపక్ష సభ్యులు. కాల క్రమంలో మరొక సభ్యురాలు కూడా బిఆర్ఎస్‌లో చేరారు. ఇద్దరు కాంగ్రెస్ సభ్యులున్నా ప్రతిపక్ష పాత్ర నామమాత్రమే అయింది. మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బిఆర్ఎస్ పాలక వర్గం కాస్తా కాంగ్రెస్ పాలకవర్గంగా పనిచేస్తుంది. బిఆర్ఎస్ పాలనలో వైరా మునిసిపాలిటీకి సిసి రోడ్ల నిర్మాణానికి, డ్రైన్ల నిర్మాణానికి నిధులు సంతృప్తికరంగానే మంజూరైనవి. 2023 చివరిలో కూడా మునిసిపాలిటీ అభివృద్ధికి 20 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఆ నిధులు వార్డుకు కోటి రూపాయల చొప్పున పంపిణీ చేసి, వార్డుల్లో చేపట్ట వలసిన పనులకు ప్రతిపాదనలు పంపారు. అవి శాంక్షన్ అయి టెండర్లు కూడా పూర్తి అయి 10 కోట్ల రూపాయల పనులను పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మునిసిపాలిటీలో అప్పటికి ప్రారంభించని పనులను వెంటనే ఆపివేయాలని 10 కోట్ల రూపాయలను నిలిపివేసింది. దాని ఫలితంగా చాల రోడ్లు డోజర్లతో సదనం చేసి మెటల్ పోసి వదిలేసిన కారణంగా ఆ వీధుల్లో ప్రజలు నడవలేని స్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటమే కాదు ఖమ్మం జిల్లాలో నుండే ముగ్గురు మంత్రులు చక్రం తిప్పుతున్నారు. మున్సిపల్ చైర్మన్ అసెంబ్లీ ఎన్నిక లకు ముందే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయినా కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీలో అధ్వాన్నమైన రోడ్లు, మాస్టర్ ప్లాన్ లేని డ్రైనేజీ వ్యవస్థకు పరిష్కారం చూపే స్థితిలో లేదు. మునిసిపాలిటీ ఏర్పడిన 6 ఏళ్లలో 7, 8 మంది కమీషనర్లు మారారు. ఏ ఒక్క ఉద్యోగి నిలకడగా ఇక్కడ ఉద్యోగం చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ అధికారి మణుగూరు నుండి వారానికి వచ్చి వెళతారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నెలకు 3 రోజులు మాత్రమే వస్తారు. మునిసిపాలిటీకి ఒక రెవెన్యూ ఇన్స్పెక్టర్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉండాలి. ఆ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నవి. మెయిన్ అకౌంటెంట్ పోస్ట్ ఖాళీ, అరకొరగా శానిటేషన్ పని చేస్తున్నారు. శానిటేషన్‌కు మరో 30 మంది అవసరమై ఉన్నా పాలక వర్గం దాని ఊసే ఎత్తదు. అందుకే మునిసిపాలిటీ మురికి కూపంగా మారుతుంది. రియల్ ఎస్టేట్ బిజినెస్ పెరిగిన నేపథ్యంలో వైరా పట్టణంలో అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలలో ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా వారి తల్లిదండ్రుల ద్వారా ఇండ్ల స్థలాలు కొని ఏళ్ల తరబడి వాటి ముఖం చూడటం లేదు. అట్టి స్థలాలలో చెట్లు, పొదలు పెరిగి అడవిని తలపిస్తున్నా వాటి విషయాన్ని మునిసిపాలిటీ పట్టించుకోదు. ఖాళీగా ఉండి చెట్లు ఉండటంతో ఆ ప్రాంతాలలో ఉన్న వారు, ఆ వీధుల్లో నడిచేవారు చచ్చిన పందికొక్కులు, చేపల రద్దు తదితారాలన్నీ తీసుకొచ్చి ఆ పొదల్లో వేస్తున్నారు. వాటి కోసం కుక్కలు, పందులు, పాములు, తేళ్ళు, దుర్గంధం చుట్టుపక్కల ఇండ్లలో ఉండలేని స్థితి ఉన్నా, మునిసిపాలిటీలో ఫిర్యాదు చేసినా లెక్క లేదు. సెప్టెంబర్ మొదటి వారం లో కురిసిన భారీ వర్షాలకు ఈ ఖాళీ స్థలాలలో నీరు నిలిచి ఈగలు, దోమలు విజృంభిస్తున్నవి. మధిర క్రాస్ రోడ్స్ నుండి చెరువుకు వెళ్ళే రోడ్డు అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు అయి ఒకటిన్నర సంవత్సరం అయింది. ఆ రోడ్డు ఆక్రమణల తొలగింపుకు అఖిల పక్షం ఆధ్వర్యంలో పోరాటాలు జరిగినవి. సిసి రోడ్డు నిర్మాణానికి ఉన్న రోడ్డును జెసీబీలతో లేపి సదనం చేశారు. ఈ పనులు జరిగి సంవత్సరం గడుస్తున్నా సిసి రోడ్డు పనులు మాత్రం ప్రారంభించటం లేదు. మొత్తం మునిసిపాలిటీకి చాలెంజ్‌గా మారిన డంపింగ్ యార్డుకు స్థలం దొరకటం లేదు. చెత్త మొత్తాన్ని వైరా ప్రాజెక్టు అలుగు వాగు ఏటి బ్రిడ్జి కింద పోస్తున్నారు. భారీ వర్షాలకు చెత్త మొత్తం కొట్టుకుపోయి రైతుల భూముల్లో మేటలు పెట్టటంతో మునిసిపాలిటీ కార్యాలయానికి వచ్చి రైతులు ఆందోళన కూడా చేశారు. సమీకృత మార్కెట్ మొండి గోడలు వెక్కిరిస్తున్నవి. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు వైరా మునిసిపాలిటీకి నిధులు మంజూరు చేసి పట్టణ స్థాయికి తగ్గట్టు అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | సెప్టెంబర్ 16, 2024 | www.navatelangana.com

ధన్యజీవి ఏచూరి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

సీపీఐ(ఎం) ఆల్ ఇండియా కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి ధన్యజీవి అని ఆ పార్టీ మండల నాయకులు పొన్నెకంటి సంగయ్య అన్నారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలో సీతారాం ఏచూరి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగయ్య మాట్లాడారు. సీతారాం ఏచూరి మరణం భారతదేశానికి, సీపీఐ(ఎం)కు, కార్మిక వర్గానికి, మేధావి వర్గానికి తీరని లోటన్నారు. ఏచూరి ఆశయ సాధన కొరకు నేటి యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పెంట్యాల నాగేశ్వరరావు, కర్లపూడి వెంకటేశ్వర్లు, ఏటుకూరి సతీష్, తుమాటి నాగయ్య, గొడ్డుగోర్ల బుచ్చిరాములు, మాదరబోయిన ఉదయ్, దోనోజు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పెద్ద వాగువంతెన కోసం మంత్రి పొంగులేటికి వినతి



నవతెలంగాణ-పెనుబల్లి

గంగాదేవిపాడు పెనుబల్లి పెద్ద వాగుపై వంతెన మంజూరు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మాలోత్ రాధాకృష్ణ, గిరిజన సంఘాల నాయకులు శనివారం హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందచేశారు. పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామం నుండి పెనుబల్లి మండల కేంద్రానికి రావడానికి వర్షాలు పడితే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, రెండు దశబ్దలకు పైగా ఈ రహదారిలో ఉన్న పెద్ద వాగుపై లో లెవెల్ వంతెన గట్టిగా వర్షం పడితేనే మండల కేంద్రానికి గంగాదేవిపాడు గ్రామంతో రాకపోకలు నిలిచిపోతాయన్నారు. ఈ రహదారి నుండి తాళ్లపెంట, బ్రాహ్మళ్ళ కుంట, కర్రలపాడు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారని వర్షాల వల్ల ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారని, పెద్ద వాగు వద్ద వంతెన మంజూరు చేయాలని కోరారు.

కాల్వ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి

- 24 గంటల పాటు పనులు జరగాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-కూసుమంచి

పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి పాలేరు నియోజకవర్గం మండలంలోని హట్యాతండా వద్ద పాలేరు ఎడమ కాల్వ గండి ప్రదేశంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల తీరును పరిశీలించారు. పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక వివరాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు, శాశ్వత పునరుద్ధరణ పనులు, మొదలగు పనుల వాటిపై అధికారులతో మాట్లాడి, ప్రస్తుతం రైతులకు సాగునీరు అందించడానికి చేపట్టిన పనులలో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సూచించారు. గండి పూడిక పనులు 24 గంటల పాటు జరగాలని, అవసరమైన మేర అదనపు యంత్రాలు, షిఫ్టులవారీగా కార్మికులు పనిచేసేందుకు ఏర్పాట్లు చేయాలని, కాల్వ తవ్వకం, లైనింగ్ పనులు సమాంతరంగా జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజం అజేయం.. ఒడుదడుకులు సహజం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు
- సీతారాం ఏచూరికి ఘన నివాళి



నవతెలంగాణ-బోనకల్

కొన్ని ఒడిదడుగులు వచ్చిన కమ్యూనిజమే అజేయమని, సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం జాతీయ అంతర్జాతీయ కమ్యూనిస్టులకు తీరని నష్టమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోనే సీపీఐ(ఎం) చొప్పకట్లపాలెం గ్రామ శాఖల మహాసభలు సీనియర్ నాయకులు బొప్పాల అజయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చలమల హరికిషన్‌రావు సీపీఐ(ఎం) పతాకాన్ని ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తన్నీరు జగ్గయ్య చిత్రపటాలకు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పల్లా కొండలరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, కిలారు సురేష్, బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఢిల్లీ జేఎన్‌యూ యూనివర్సిటీలో వరుసగా మూడుసార్లు గోల్డ్ మెడల్లు సాధించారన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న మత రాజకీయాలు దేశానికి ప్రమాదకరమన్నారు. ఇటువంటి సమయంలో సీతారాం లాంటి కమ్యూనిస్టు దిగ్గజం అకాల మరణం చెందటం లౌకికవాదులకు, దేశ ప్రజలకు తీవ్ర నష్టమన్నారు. శాస్త్రం అభివృద్ధితో ముందుకు సాగుతుంది తప్ప వెనకడుగు వేయదన్నారు. శాస్త్రం ఆధారంగానే అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. రాజ్యాంగానికి, మతానికి మనదేశంలో ఎటువంటి సంబంధం లేదని కానీ బిజెపి ప్రభుత్వం మతాన్ని రాజ్యాంగాన్ని కలిపి నాశనం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దేశంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి అన్నారు. ఇటువంటి సమయంలో సీతారాం ఏచూరి మరణం మనకు ఎంతో తీవ్ర నష్టం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పై రైతులను మభ్యపెడుతుందని విమర్శించారు. వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రుణమాఫీ మొత్తం చేశామని ప్రకటించారన్నారు. కానీ అనేక గ్రామాలలో తమకు రుణమాఫీ జరగలేదని రైతులు చెబుతున్నారన్నారు. రుణమాఫీ పై రైతుల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. ఈ పరిస్థితి మరింత పెరిగితే అది కాంగ్రెస్‌కే నష్టం అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాల ఆధారంగా రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రెండు శాఖల నూతన శాఖాదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శులుగా బండి, బోయినపల్లి



సీపీఐ(ఎం) ఒకటవ శాఖ కార్యదర్శిగా యువకుడు బండి శ్రీనివాసరావు, రెండవ శాఖ కార్యదర్శిగా బోయినపల్లి పున్నయ్య ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ మహాసభలో పార్టీ మండల కమిటీ సభ్యులు కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, కిలారు సురేష్, తోటకూర మాధవరావు, బూసి వెంకటేశ్వర్లు, బొప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక మండపాలను సందర్శించిన మంత్రి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

నగరంలోని శ్రీనగర్ కాలనీ పీఎస్ఆర్‌రోడ్, శ్రీనివాసనగర్, ముస్తఫానగర్, టీడీపీ ఆఫీస్ రోడ్, వీడియోస్ కాలనీ, బురహాన్‌పురం, ఎఫ్ సీఐ గోదాం, ఖమ్మం రూరల్ మండలంలోని పెద్ద తండా, శ్రీరామ్ నగర్ - 2 లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయా మండపాలకు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్జేసీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితులకు అమెరికా కు చెందిన ఆప్టా సంస్థ ఆర్జేసి కృష్ణ ఆధ్వర్యంలో సమకూర్చిన 300 మందికి నిత్యావసర వస్తువులు, కూరగాయలను ఆదివారం కృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమెరికాలో ఉంటున్న తెలుగు వారు ఆప్టా సంస్థ గా ఏర్పడి సహాయం చేయడం అభినందనీయం అన్నారు. ఆప్టా సంస్థ ప్రెసిడెంట్ ముద్రగడ త్రినాథ్, గ్లోబల్ ఆపరేషన్స్ బాధ్యులు వుల్లి మధు, గుండాల కార్తీక్‌లకు ఖమ్మం ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు, కనకం భద్రయ్య, మాటేటి నాగేశ్వరరావు, కన్నం ప్రసన్న కృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, గుండాల అప్పారావు, గుండాల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇటికల భాస్కర్‌కు ఇంజినీర్స్ డే పురస్కారం



నవతెలంగాణ-వైరా


తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని బాల భవన్‌లో ఇంజినీర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైరా టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఇటికాల భాస్కర్ గృహనిర్మాణానికి సంబంధించి 10 కి పైగా ఇంటి ప్లాన్స్, వాస్తు పుస్తకాలు, ఐటీఐ విద్యార్థుల కోసం, గృహ నిర్మాణ దారులకు అవగాహన కల్పించటం కోసం ఎన్నో పుస్తకాలు రచించి, సివిల్ ఇంజనీరింగ్ రంగానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇటికల భాస్కర్ ప్రస్తుతం వైరా, మణుగూరు మునిసిపాలిటీలు, సూడా ఖమ్మం లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో జెపిఓగా పనిచేస్తున్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా విజయవాడలో సన్మానం పొందటం పట్ల లైసెన్స్ ఇంజనీర్స్, బిల్డర్లు, రోటరీక్లబ్ సభ్యులు ఇటికాల భాస్కర్‌ను సన్మానించారు.

ముంపు ప్రజలకు సత్యసాయి సేవా ట్రస్ట్ సాయం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

మున్నేరు లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదతో చాలా ఇబ్బందులకు గురి కావడంతో సేవా కార్యక్రమాలు కొనసాగింపుగా ఆదివారం ఉదయం మరిన్ని సేవలు అందించేందుకు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ట్రస్ట్ వారు సాయం అందించారు. ఖమ్మం పట్టణంలోని బొక్కలగడ్డ, వేంకటేశ్వరనగర్, పద్మావతి నగర్ ఏరియాలలోని 1500 బాధిత కుటుంబాలకు అమృత కలశాల పంపిణీ (18 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన కిట్స్, ఒక్కొక్క కిట్ విలువ రూ.1500లు) చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్, ఖమ్మం శేషసాయి, సత్యసాయి ట్రస్టు వెంకటరావు, రాష్ట్ర అధ్యక్షులు సత్య సాయి సేవా సంస్థలు వాసుదేవ రావు, రాష్ట్ర సర్వీస్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

అపర మేధావి ఏచూరి



నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

ఏచూరి అపర మేధావి అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాకర్లపల్లి, తాళ్ళ మడ, సిద్ధారం గ్రామాలలోని సీపీఐ(ఎం) గ్రామ శాఖలలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, ఎలగం రాములు, రేసు లక్ష్మి పాండురాజు, మంగమ్మ నారాయణమ్మ, బాల బుచ్చయ్య, సనందనరావు, కన్నయ్య, వెంకటేశ్వరరావు, పున్నయ్య లక్ష్మినారాయణ, చిట్టెమ్మ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-చింతకాని

మండల పరిధిలో వందనం గ్రామ శివారులో ఉన్న గంగమ్మ తల్లి దేవాలయంలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొనిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన తప్పెడ జక్కరి సుజాత కుమారుడిగా గుర్తించారు. తప్పెడ వంశి (25) ఆరు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భార్య తల్లిగారి ఇంటి దగ్గర ఉండి రాకపోవడం వలన మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, పోలీసులు తెలిపారు. చింతకాని ఎస్ఐ నాగుల మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆశా కార్యకర్తలకు నూతన వస్త్రాలు అందజేత



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మున్నేరు వరదల్లో సర్వం కోల్పోయిన ఆశా కార్యకర్తలకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి. మోహన్‌రావు మాట్లాడుతూ ఏన్కూరు మండలంలోని ఆశా కార్యకర్తలు సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో మున్నేరు వరదల్లో ఇండ్లు నీట మునిగి ఆర్థికంగా నష్టపోయిన 11 మంది ఆశా కార్యకర్తలకు దుప్పట్లు,చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఏన్కూరు సీఐటీయూ శాఖను మోహన్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. ఇలా ఒకరికి ఒకరు తోడుగా ఉండి సమ సమాజ స్థాపన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పొన్నెకంటి సంగయ్య, సీఐటీయూ నాయకుడు ఏర్పుల శ్రీనివాసరావు, ఆశా నాయకురాళు బీ. అమల, బోడా జ్యోతి, రజిత, మౌనిక, అనురాధ, స్వాతి, భవాని, ప్రశాంతి, సుభద్ర, నీలిమా, తిరపమ్మ, మమత, నాగమణి, సూరమ్మ, భారతీయ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్‌ని వెంటనే తొలగించాలి



నవతెలంగాణ-మధిర

పట్టణంలో లడక్ బజార్‌లోని మిలీనియం స్కూల్ దగ్గరలోని ఏటి ఒడ్డు వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని లడక్ బజార్ నివాసులు ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నివాసములకు అతి సమీపంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, మొన్నటి వరకు చాలా కుటుంబాలు వరదలో ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వలన నిత్యం అనేక రోగాల సమస్యలతో ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సెల్ టవర్ రేడియేషన్ వలన చిన్న పిల్లలు, వృద్ధులు, పెద్దలు అనేక రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. అందువలన సెల్ టవర్ నిర్మాణంలో నిలిపివేయాలని మధిర మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని పెనుకుంట్ల గ్రామానికి చెందిన సిరికొండ దేవస్వామి(50) మోటార్ సైకిల్ ఢీకొని శనివారం రాత్రి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన నూనె వీరస్వామి తన మోటార్ సైకిల్‌తో రోడ్డుపై నడిచి వెళుతున్న దేవస్వామిని ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో దేవ స్వామి తలకు బలమైన గాయమై చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవ స్వామి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ

నవతెలంగాణ-చింతకాని

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆ పోరాటం అందించిన ఫలాలను తెలియజెప్పే ఒక షార్ట్ ఫిల్మ్‌ను ఇక్కడ చింతకాని మండలంలోని రేపల్లెవాడ, పాతర్లపాడు గ్రామాలలో గత రెండు రోజులుగా చిత్రీకరించారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సాగిన ఈ షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణలో తెలంగాణా పోరాటం కొన్ని పోరాట ఘట్టాలు, తర్వాత తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో వచ్చిన మార్పులు ఇందులో చిత్రీకరించారు. ఈ చిత్రంలో స్థానికంగా వివిధ గ్రామాల ప్రజలు పాత్ర ధారులుగా ఉండటం విశేషం. ఈ చిత్రీకరణకు స్థానిక సీపీఐ(ఎం) నాయకులు చింతకాని మండల కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, రేపల్లెవాడ గ్రామశాఖ కార్యదర్శి షేక్ ఇమామ్, కట్టా ధర్మారావు, బంధం కృష్ణ, అంగిడి వెంకటి, పాతర్లపాడు గ్రామ సీపీఐ(ఎం) నాయకులు డాక్టర్ అక్కయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో నటీనటులుగా అద్దంకి విప్లవకుమార్, కర్లకుంట నరేష్, తారా నాయుడు, అశోక రాణి, సుజాత, కట్టా రామారావు తదితరుల ప్రధాన పాత్రధారులుగా నటించారు. షార్ట్ ఫిల్మం పర్యవేక్షణ కే. దేవేంద్ర, రచన: శ్రీనివాస్ సూఫీ, కెమరామెన్: చంద్రకళ రామారావు, బోడపట్ల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గొప్ప ప్రజాస్వామ్యవాదిని కోల్పోయింది

- ప్రముఖ ప్రజా వైద్యులు చీకటి భారవి, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-వైరాటౌన్

దేశం గొప్ప నాయకుడిని, ప్రజాస్వామ్యవాదిని కోల్పోయిందని ప్రముఖ ప్రజా వైద్యులు చీకటి భారవి, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. స్థానిక బోడేపూడి భవనంలో బోడేపూడి కళానిలయం వైద్య శిబిరం ఆధ్వర్యంలో సిపిఐ(ఎం) అఖిల భారత ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటి భారవి, బొంతు రాంబాబు మాట్లాడుతూ సీతారాం ఏచూరీ అర్ధ శతాబ్దకాలం పాటు దేశ రాజకీయాలలో క్రియాశీలకంగా పనిచేశారని, ప్రజా సమస్యలను వెలికితీసి, వాటికి పరిష్కార మార్గాలను ఏచూరీ చూపించేవారని, మతతత్వ రాజకీయాలు దేశానికి ఎంత ప్రమాదమో ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, వాటి ప్రభావాన్ని తగ్గించే కృషి చేశారన్నారు. మతతత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా లౌకిక రాజకీయాలను ముందుకు తీసుకురావడానికి సీతారాం ఏచూరీ చివరి వరకూ కృషి చేశారని అన్నారు. ఏచూరీ అకాల మరణం కేవలం వామపక్ష, కమ్యునిస్టు ఉద్యమాలకే కాక మొత్తం దేశానికి తీవ్రమైన లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల బృందం డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, డాక్టర్ జట్ల రంగారావు, వైద్య శిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, మందడపు నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, తాటి కృష్ణకుమారి, పూనాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం దేశానికి తీరని లోటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్



నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి మృతికి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐ సంఘంలో పనిచేసి దేశంలోనే అత్యున్నతమైన యూనివర్సిటీ అయినా జేఎన్‌యూకి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీని సైతం ఎదిరించి యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించే దానికోసం పనిచేసినటువంటి వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. అంతేకాదు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐకి జాతీయ అధ్యక్షులుగా ఆయన పని చేశారని ఆయన విద్యార్థి ఉద్యమాల్లో పనిచేసిన విషయాలను కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తు విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేదని కోసం ఆయన ఆశయాలతో పని చేస్తామని తెలిపారు. సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటని మరొకసారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నగర్ నాయకులు మనోజ్, వినోద్, మహేష్, శ్రీలత, మహేశ్వరి, అనిత, వినీత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించి పంటలను కాపాడాలి

- యుద్ధ ప్రాతిపదికన సాగర్ కాల్వ గండిని పూడ్చాలి : రైతుల డిమాండ్



నవతెలంగాణ-కల్లూరు

వరి పైరు చిరు పొట్ట దశ కొచ్చి సాగునీరు లేక ఎండిపోతున్నాయని ఆయా గ్రామాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టి సాగునీరు అందించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో రైతులు విలేకరులకు పంట పొలాలు చూపిస్తూ తమ గోడు వెళ్ళబుచ్చుకున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలవ పరిధిలోని కల్లూరు డివిజన్లో కల్లూరు మండలం ఎక్కువ శాతం సాగర్ జలాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో సాగర్ కాలువ, చెరువులు, కుంటలు, క్రింద సుమారు 33,740 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. మధిర బ్రాంచ్ పరిధిలో ఎక్కువ శాతం సాగర్ జలాలు వస్తేనే పంట చేతికి వస్తుంది. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ నెలలోనే వర్షాలు పడటంతో ఎక్కువ శాతం మంది రైతులు కరివేద పద్ధతిలో వరి సాగు చేయడం జరిగింది. దీంతో పైర్ చిరు పొట్టు దగ్గరికి చేరుకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల గట్లన్నీ గండ్లు పడటంతో పొలాల్లో నీరంతా బయటకు పోయి ఇప్పుడు వస్తున్న ఎండలకు పంట పొలాలు నీరు లేక ఎండిపోయి నెర్ర కొట్టాయి. పొట్ట దశకు చేరినప్పుడు వారి పేరుకు ఎక్కువ శాతం నీరు అవసరం ఉంటుందని ఆ సమయంలో సాగునీరు అందించకపోతే తెల్ల కంకి కావటం, గింజలు తాలుగా మారటంతో, దిగుబడిలో తీవ్రంగా నష్టపోవాల్సి పరిస్థితి పడుతుందని పలు రైతులు వాపోయారు. ఇప్పటికే పెట్టుబడి సుమారు ఎకరానికి 20వేలు వరకు పెట్టామని పలువు రైతులు తెలిపారు. గత సంవత్సరం సాగునీరు సాగర్లో లేక పొట్ట దశకు వచ్చిన పైరంతా ఎండిపోయి చాలా నష్టపోయామని ఇప్పుడు సాగర్ నిండా నీరున్న కాలువలకు గండ్లు పడటంతో సాగునీరు లేక మళ్లీ ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందేమోనని రైతులు ఆందోళన చెపుతున్నారు. చిరు పొట్ట దశలో ఉన్నదని ఈ దశలో సాగునీరు అందించకపోతే పంట పొలాలు ఎండిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని చంద్రుపట్ల గ్రామానికి చెందిన రైతులు జక్కంపూడి కిషోర్, వల్లపనేని రవి దొడ్డపనేని రవి, వల్లపునేని శ్రీనివాసరావు తదితర రైతులు తెలిపారు. మండలంలోని చంద్రుపట్ల, లింగాల, ఎర్ర బోయినపల్లి, వాచ్య నాయక్ తాండ, రఘునాథ బంజర, చెన్నూరు, తదితర గ్రామాల్లో సాగరాయకట్టు కింద పంటలు సాగునీరు లేక ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని ఆయా గ్రామాలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, మంత్రులు రైతాంగ అవస్థలను దృష్టిలో పెట్టుకొని సాగునీరు అందించే విషయంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వైకుంఠపు కృష్ణారావు, పోట్రు వీరభద్రం, దొడ్డపనేని వెంకటేశ్వరావు, నెల్లూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-వైరా

వైరా ఇందిరమ్మ కాలనీలోని వరద బాధితులకు వైరాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారికి తమ క్లబ్ సభ్యులు స్వయంగా ఇళ్లకు వెళ్లి పరిశీలించిన అనంతరం రూ.90వేల విలువ చేసే నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాప మురళీకృష్ణ తెలిపారు. స్థానిక దత్త సాయి కళ్యాణ మండపం నందు జీఎస్టి కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు, డిస్టిక్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లగడపాటి ప్రభాకర్, కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రామ్ గోపాల్, మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొల్ల రాంబాబు, సహాయ కార్యదర్శి జి.కిషన్, తాడికొండ రాము, వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత, సహాయ కోశాధికారి కట్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో రామాంజనేయ కోలాట బృందం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



సాంస్కృతిక నృత్యాలు, కళలు కనుమరుగవుతున్న సమయంలో పల్లెల్లో కోలాటం నేర్చుకుంటూ జిల్లా స్థాయిలో ప్రతిభకనబరిచినారు పెంట్లం శ్రీ రామాంజనేయ కోలాట బృందం. మండల మండల పరిధిలోని పెంట్లం గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ కోలాట బృందం ఆదివారం రేజర్ల గ్రామంలో ఖమ్మం జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించారు. మొత్తం 16 గ్రూపులు పాల్గొనగ తృతీయ స్థానం రావడం పట్ల కోలాట గురువు అంజిబాబు వారిని అభినందించారు. ప్రతిభ కనబరిచి బృందానికి రూ.101,116 నగదును బహుకరించారు. సాంస్కృతిక నాట్యాలు కనుమరుగు కాకుండా కోలాటం నేర్చుకొని అతి తక్కువ సమయంలో మండలం నుండి వెళ్లి తృతీయ స్థానం సాధించడంతో పెంట్లం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దమయంతి, శిరోమణి, కుమారీ, జయమ్మ, రమ్య, బన్నె వెంకటేశ్వరరావు, నాగమణి, రమాదేవి, బేబి తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల వచ్చే యాత్రికులకు తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పర్ణశాల దైవ దర్శనం కోసం వస్తున్న యాత్రికులకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఏపీలోని హుండీ భీమవరంకు చెందిన ఓ కుటుంబం భద్రాచలం, పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనం కోసం ఏపీ 39 ఎంసీ 3499 అనే నెంబర్ గల ఎక్స్ ఎల్ సిక్స్ వాహనంపై ఆదివారం తెల్లవారుజామున 12.30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. ఆదివారం ఉదయం 6 గంటలకు భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దైవ దర్శనం అనంతరం పర్ణశాల బయలుదేరారు. భద్రాచలం చర్ల ప్రధాన రహదారి చిన్న బండి గ్రామం వద్ద వాహనం నడుపుతున్న వ్యక్తి నిద్రలోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి ఓ ఇంటి ముందు ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం కుడి వైపు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఓ యువతి పన్ను విరిగిపోయింది. వాహన ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు వారిని సురక్షితంగా బయటకు వచ్చేందుకు సహాయ సహకారాలు అందించారు. ప్రమాదానికి గురైన కుటుంబం భద్రాచలం, పర్ణశాల దైవ దర్శనం అనంతరం మోతుగూడెం, అరకు వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చారు. పర్ణశాల వెళుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంతో రామా ఏంటి ఈ కర్మ అంటూ నినదించుకుంటూ నిరాశతో వెనుతిరిగి పోయారు.

అవస్థలు ఎదుర్కొంటున్న కార్మికులు

- పట్టింపు లేని యాజమాన్యం

నవతెలంగాణ-మణుగూరు

ఏరియాలోని గనులు, డిపార్ట్ మెంట్‌లలో మ్యాన్ వే దగ్గర మస్టర్ నమోదు ఎలక్ట్రికల్ డిస్ ప్లే బోర్డులు చాల చోట్ల పని చేయకపోవడం వల్ల కార్మికులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రక్షణ, కార్మిక ప్రయోజనాల దృష్ట్యా మస్టర్ సులభతరంగా తెలుసుకునేందుకు యాజమాన్యం ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ డిస్ ప్లే మస్టర్ బోర్డ్‌లు ఏరియాలో చాల మైన్‌లు, గనులపై లేవని అన్నారు. ఉన్న ప్రదేశాల్లో అవి సరిగా పని చేయకపోవడం వల్ల కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. రిపేర్‌కు గురైన డిస్ ప్లే బోర్డ్‌లు నెలల తరబడి అలానే ఉంటున్నాయే తప్ప వాటికి మోక్షం కలగడం లేదని తెలిపారు. కేసీహెచ్‌పీ నందు శనివారం నైట్ షిఫ్ట్‌కు విధులకు వచ్చిన కార్మికుడు మ్యాన్ వే దగ్గర మస్టర్ నమోదు చేసుకునేందుకు వెళ్లి మ్యాన్ వే క్లర్క్‌కు మస్టర్ చెప్పి డిస్ట్రిబ్యూషన్ దగ్గరకు వెళ్ళడం జరిగిందని, టర్నోవర్ స్లీప్‌లో తన పేరు లేకవడంతో ఖంగు తిన్న కార్మికుడు మ్యాన్ వే క్లర్క్ దగ్గరికి వెళ్ళి వాదనకు దిగినట్టు తెలిపారు. పొంతన లేని సమాధానాలతో చివరికి కార్మికుడు చేసేది లేక రాత్రి పూట ఇంటికి వెళ్లిపోవడం జరిగిందని, ఇలాంటి సంఘటనలు ఏరియాలో అడపా దడపా జరుగుతునే ఉన్నాయని తెలిపారు. యాజమాన్యం ఇకనైనా దృష్టి సారించాలని, సమస్యలకు చొరవ చూపాలని అయన డిమాండ్ చేశారు.

19న మహిళా సంఘం జిల్లా మహాసభలు

- ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి

నవతెలంగాణ-చండ్రుగొండ



ఈ నెల 19న జరిగే మహిళా సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదరి సందాకురి లక్ష్మి అన్నారు. మహిళా మండల కమిటీ సమావేశం జై తున్నిసా బేగం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడారు. మహాసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, వడ్డీ లేని రుణాలు, మహిళలపై జరుగుతున్న అరాచకాలు, 33% రిజర్వేషన్ కల్పించాలని, అనేక రకాల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. మహిళల అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకా సీత, భద్రమ్మ, విజయ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేత, వ్యాపారి రామకృష్ణ మృతి

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లి సీపీఐ(ఎం) నాయకులు, ప్రముఖ వ్యాపారి మేకల రామకృష్ణ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు వారి నివాసానికి వెళ్లి రామకృష్ణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకునిగా, వ్యాపారిగా మండలంలో అందరి మన్ననలు పొందారని, ఆయన మరణం అటు పార్టీకి, ఇటు వ్యాపారులకు తీరనిలోటని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) మండల నాయకులు నువ్వు ఊకంటి రవికుమార్, లక్ష్మీ నరసయ్య, వెంకటేశ్వర్లు, తిరుమలేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్రం దొరస్వామి, మండల అధ్యక్షులు తేళ్ల చెన్నయ్య, మండల నాయకులు బిక్కుమళ్ల సుధాకర్, చల్లా వెంకటేశ్వర్లు, మిరియాల శంకర్, ఉదయ్కుమార్, పాత్రికేయులు పువ్వాళ్ల శ్రీనివాసరావులు ఉన్నారు.

నిత్య అధ్యయనశీలి కామ్రేడ్ ఏచూరి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా

నవతెలంగాణ-కొత్తగూడెం



నిత్య అధ్యయనశీలి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంచికంటి భవన్‌లో ఆదివారం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి ముందుగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్టడీ సర్కిల్ జిల్లా కన్వీనర్ ఏజె.రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో మచ్చా మాట్లాడారు. అమరజీ కామ్రేడ్ ఏచూరి నిరంతరం అధ్యయనం చేస్తూ సమాజ పరిణామక్రమాన్ని భౌతిక పరిస్థితులకు అనుగుణంగా అంచనా వేసి పోరాటాలకు శ్రీకారం ఎలా చుట్టాలి అనేది రూపకల్పన చేసి నూతన సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహనీయుడన్నారు. విద్యార్థి దశ నుంచే అధ్యయనంపై మక్కువ పెరిగి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో భారతదేశానికి దిక్సూచిగా ఉండాలి అని అకుంఠిత దీక్షతో భారత దేశ నిర్మాణంలో విద్యార్థులకు కీలకపాత్ర పోషించాలని సమ సమాజ స్థాపనకై విద్యాభ్యసిస్తూనే, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తలచి తోటి విద్యార్థులతో చర్చ గోష్టులు చేసి ప్రపంచ మేధావులు రచించిన పుస్తకాలను అధ్యయనం చేసి తోటి విద్యార్థులకు వివరించేవారని గుర్తుచేశారు. తను నిత్యం ఆచరిస్తూ కమ్యూనిజం సిద్ధాంతాన్ని అవపోసన పట్టుకొని భావితరాలకు మార్గదర్శకం అయ్యారన్నారన్నారు. మన భారతదేశంలో ఉన్న ప్రముఖులే కాక ప్రపంచంలో ఉన్న మేధావులు సైతం గర్వించదగ్గ గొప్ప సైబంతిక వేత్త అని కొనియాడారు. రాజకీయాలలో ప్రవేశం చేసి అంచలంచలుగా పార్లమెంటు సభ్యుడుగా ఎదిగిన సమయంలో బూర్జువా పార్టీలతో వస్తున్న అనేక సైద్ధాంతిక సమస్యలపై అవగాహన కలిగి ఉండే వారన్నారు. దేశం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న సమయంలో ఒకవైపు మతోన్మాద భావాలు కలిగిన రాజకీయాలు మరోవైపు అన్ని వర్గాలపై భారాలు మోపే పాలకవర్గ విధానాలపై సమానంగా పోరాటాలు నిర్వహిస్తూ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీలు సరైన మార్గంలో నడిచే విధంగా ఆలోచనలు చేయడంలో దిట్టగా ఆయన నిలిచారని చెప్పారు. అధ్యయనం పోరాటం నినాదాన్ని ఉనికిపుచ్చుకొని కడవరకూ పోరాటాలు చేసే ఎర్రజెండాను వదలకుండా చివరి కంటూ జనం కోసం పాటుపడిన ఒక మేధావిని ప్రపంచం కోల్పోయిందన్నారు. భౌతికంగా మన మధ్య లేక పోయినప్పటికీ కలలుకున్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని ప్రతి సమస్యపై అధ్యయనం చేస్తూ భౌతిక పరిస్థితులు అంచనావేసి నిరంతరం జనం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు సత్య నారాయణ, రమేష్, స్టడీ సర్కిల్ సభ్యులు కె.సత్య, రమేష్, ఉపేష్, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకాన్ని పెంచడం పట్ల హర్షం

- కృతజ్ఞతలు తెలిపిన పైడి

నవతెలంగాణ-దమ్మపేట



కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామ్ ఆయిల్ పై సున్నా శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 20 శాతంకు పెంచడం పట్ల మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పామాయిల్ రైతు సంఘం నాయకులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి కేంద్ర ప్రభుత్వానికి ఎన్నో విజ్ఞప్తులు అనంతరం కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఇతర దేశాల నుండి వచ్చే సీపీఓ పై దిగుమతి సుంకాన్ని 20 శాతంకు పెంచడంతో, పామ్ ఆయిల్ రైతుకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పైడి కృతజ్ఞతలు తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి కృషి చేయాలి

- రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అనునిత్యం పాత్రికేయుల సమస్యలపై నిర్విరామంగా కృషి చేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ బోలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ సమావేశం జిల్లా కార్యదర్శి గుండెబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడారు. పాత్రికేయులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనని ఆయన అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల అక్టోబర్ 26, 27 తేదీలలో జర్నలిస్టులకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు అందరూ ఈ శిక్షణా తరగతులను సద్వినియోగపరచుకొని వృత్తిలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో ఉత్తరప్రదేశ్‌లోని మధుర (బృందావనం)లో ఐఎఫ్‌డబ్ల్యూజే నేతృత్వంలో జరిగే జాతీయ మహాసభలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్ గౌడ్, ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, కోశాధికారి దొడ్డి హరినాగవర్మ, ఉపాధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు వెలమ రాజేందర్, జిల్లా నాయకులు రాధాకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలి

- నిమజ్జన ఘాటు పరిశీలనలో పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఇతర రసాయనాలు కలిపిన వినాయక ప్రతిమలు కాకుండా పర్యావరణ పరిరక్షణకు భక్తులందరూ మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి వాతావరణం కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకొని వినాయక చవితి పండుగ జరుపుకున్నారని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఆదివారం తన గృహంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయక ప్రతిమను తొమ్మిది రోజులు పూజలు జరిపి తన భార్యతో కలిసి గోదావరిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించారని ఐటీడీఏ నివాస గృహాలు కూడా మట్టి విగ్రహంనే ప్రతిష్ఠించి పూజలు జరుపుతున్నారని అన్నారు. వచ్చే సంవత్సరం వినాయక చవితి పండక్కు భద్రాచలంలోని అందరూ మట్టి వినాయకుడు విగ్రహాలనే ప్రతిష్ఠించి వాతావరణం కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణకు అవగాహన కల్పించే రోటరీ క్లబ్ వాళ్ల సూచనలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గోదావరి వరదలు హెచ్చుతగ్గులుగా వస్తున్నందున గోదావరిలో నిమజ్జనం చేయడానికి వచ్చే భక్తులు రెవెన్యూ పోలీస్ శాఖ, ఫైర్ సిబ్బంది సూచనల మేరకు తొందర పడకుండా నిదానంగా వినాయకుని ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేయాలని నిమజ్జనం చేసేటప్పుడు సెల్ఫీలు దిగడం బాణాసంచా కాల్చడం, మద్యం సేవించడం డీజే సౌండ్ సిస్టం లాంటివి నిషేధించినందున అధికారుల సూచనలు పాటించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసి సురక్షితంగా ఇండ్లకు చేరాలని ఆయన అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు రెవెన్యూ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు అన్ని జాగ్రత్తలు తీసుకున్నందున వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు వారికి సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత కుమార్ సంక్వార్, ఇరిగేషన్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

- మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు



కొలువు దీరిన గణనాథులకు పూజలు నిర్వహించి కులమతాలకతీతంగా అందరికీ అన్నదానం చేయడం మహాదానమని మున్సిపల్ చైర్మెన్ డీవీ, కౌన్సిలర్ కొక్కు నాగేశ్వర్ రావు, మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు పింగళి నరేష్ అన్నారు. పట్టణం రైల్వే బ్రిడ్జ్ దగ్గర మూడో వార్డ్ పరిధిలో నెలకొని ఉన్న వినాయక మండపంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు వడ్డించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమాలు విజయవంతం చేయడం పట్ల నిర్వాహకులు శాసనాల రామయ్య, గుండంపల్లి సతీష్, మణికంఠ, ఆజాద్, రవి, షోను, హరి ఈశ్వర్, శ్రావణ్, శివ, షన్ను, బాల తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాధవ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డులలో కొలువు దీరిన గణనాథులను సందర్శించి మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణిలో జరుగుతున్న పరిణామాల గురించి, ఇటీవల పత్రికలలో వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరి పోతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఒక పార్లమెంట్ సభ్యుడు ఫోన్‌చేస్తే ఎత్తలేదని చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను ట్రాన్స్‌ఫర్ చేయడంతో భయపడిన అధికారులు పాలనా నిబంధనలను గాలికొదిలేసి ప్రజా ప్రతినిధులు అడుగులకు మడుగులు ఒత్తడంతోనే పాలన సాగించారని తెలిపారు. దీని ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకత మీద పడడంతో పనులన్నీ అవుట్సోర్సింగ్‌కు అప్పజెప్పడం మొదలుపెట్టారు. దీని ప్రభావం కార్మికుల సమస్యల పరిష్కారం మీద కూడా పడి యాజమాన్యం గుర్తింపు సంఘం మాట కూడా ఖాతరు చేయని పరిస్థితి ఏర్పడింది. సింగరేణి యాజమాన్యం కేవలం ముఖ్యమంత్రి చెబితేనే సమస్యలు పరిష్కారం అయ్యే స్థితికి నెట్టబడుతుందని అన్నారు. దీని ఫలితంగా కార్మికులలో కార్మిక సంఘాల పట్ల చివరికి టీఆర్ఎస్ పార్టీ మీద కూడా పడి అసెంబ్లీ ఎన్నికలలో కోల్ బెల్ట్ ఏరియాలోని అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ ఓడిపోయిందని తెలిపారు. ఈ పరిణామాలను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సరిగా అర్థం చేసుకున్నట్టు కనబడడం లేద న్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు గుర్తింపు సంఘంపై అసంతృప్తి చెందడం వల్లే డైరెక్టర్ (పా)ను బాధ్యతల నుండి తప్పిం చామని చైర్మన్ పత్రికల ద్వారా తెలిపారు. అంటే సింగరేణిలో పోతరాజులు మళ్లీ వస్తున్నాయనే ఆందోళన కార్మికుల్లో వ్యక్తం అవుతుందని చెప్పారు. పాలసీ విధానాల వరకే ప్రభుత్వం పరిమితమైతే అది సింగరేణి పరిశ్రమ అభివృద్ధికి ఆరోగ్యకరమైన కార్మికుల ఉద్యమానికి కూడా మంచిది. అలా కాకుండా రోజువారి పాలనలో కాంట్రాక్టర్లు ప్రజా ప్రతినిధులు, పైరవీకారుల జోక్యం పెరిగితే గతంలో ఉన్న పరిస్థితి ఉత్పన్నమ య్యే ప్రమాదం ఉన్నదని సిఐటియు అభిప్రాయ వ్యక్తం చేసింది. ఇది పారిశ్రామిక సంబంధాలకు, ఉత్పత్తికి ఆటంకం కలిగి పరిశ్ర మ మునగడకు కార్మిక శ్రేయస్సుకి మంచిది కాదని ఈ విషయమై కార్మిక వర్గం చైతన్యం కావాలని సిఐటియు కోరుతున్నామని స్పష్టం చేశారు.

పంట నష్ట పోయిన రైతాంగానికి పరిహారం చెల్లించండి

నవతెలంగాణ-టేకులపల్లి



పంట నష్ట పోయిన రైతాంగానికి నష్ట పరిహారం, గృహాలు కోల్పోయిన వారికి తక్షణమే గృహాలు నిర్మించి ఇవ్వాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.30 వేలు పంట నష్ట పరిహారం చెల్లించి, గృహాలు కోల్పోయిన వారికి నూతనంగా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదలలో మరణించిన వారికి రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుఫాను వలన దెబ్బతిన్న రోడ్లను కల్వర్టులను తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. తుఫాను బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో రైతాంగం ఆత్మహత్యలకు పూనుకుంటా ఉంటే, రుణమాఫీలను మాఫీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రూ.2 లక్షల రుణాలు మంజూరు కానీ రైతాంగానికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, బానోతు వెంకట్రాం, ధరావత్ వెంకన్న, సూరయ్య, వినోదు, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ మార్క్సిస్టు ఏచూరి

- సీఐటీయూ నాయకులు అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆధునిక కమ్యూనిస్టుల్లో ఆదర్శ మార్క్సిస్టుగా ఏచూరి దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక హమాలీ అడ్డా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ ఏచూరి దేశ రాజకీయాల్లో ప్రముఖమైన వ్యక్తి అని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా మంచి పాత్ర పోషించారని అన్నారు. దేశంలో ఏదైనా కొత్త సమస్య వస్తే సమస్య పరిష్కారానికి తగిన సలహాలు, సూచనలు చేయటంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. కొద్దిమంది గొప్ప నాయకులకు అంతిమ వీడ్కోలు జరిగినట్టు ఏచూరికి దేశ అంతర్జాతీయ స్థాయిలో అన్ని పార్టీ నేతలు అంతిమ వీడ్కోలు పలకటం, నీ ఆశయాలే మాకు ఎప్పుడు మార్గదర్శకాలంటూ అంతిమ యాత్రలో భాగస్వామలవటం ఆయన గొప్ప వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు ఏసు, నాగేంద్ర, రమేష్, రాంబాబు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్మరించుకుందాం

- మాస్‌లైన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్మరించుకుందామని మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి అన్నారు. ఈ నెల కొత్తగూడెంలో హృద్దు గర్ హాల్‌లో సెప్టెంబర్ 17న మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆదివారం కరపత్రం అశోక్ నగర్ భద్రాచలంలోని పార్టీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కెచ్చల రంగారెడ్డితో పాటు కేచ్చల కల్పన, డివిజన్ నాయకులు సాయన్న, శివ, మహేశ్వరి, కుమారి ఫిరోజ్, కోటక్క షకీరా, కృష్ణవేణి తదిలతరులు పాల్గొన్నారు.

మహా మేధావి మోక్షగుండం విశ్వేశరయ్య

- ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్

నవతెలంగాణ-మణుగూరు



భారతరత్న ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశరయ్య జన్మ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయలో మణుగూరు సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో భాగంగా జీఎం దుర్గం రామచందర్ మోక్షగుండం విశ్వేశరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి తన మేధస్సులో నిక్షిప్తమై ఉండే అద్భుత ప్రతిభ పాటవాలను పూర్తి స్థాయిలో వినియోగించి ఎంతటి గొప్ప అద్భుతాలు సృష్టించవచ్చు, తద్వారా ఎంతటి కీర్తి శిఖరాలకు చేరీ చరిత్ర పుటల్లో తనకంటూ ఓ విశిష్ట స్థానాన్ని పొందవచ్చని నిరూపించిన గొప్ప సాంకేతిక రంగ ఉద్ధండుడు మోక్షగుండం విశ్వేశరయ్య అన్నారు. నీటిపారుదల వ్యవస్థను మన దేశానికి అందించినందుకు అమూల్య సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వారికి భారత రత్న వంటి ప్రతిష్టాత్మక పురస్కారం అందజేయటం మనందరికీ ఎంతో గర్వ కారణం అన్నారు. అంతటి మహా మేధావి, సివిల్ ఇంజినీర్లకు స్పూర్తి ప్రధాత అయిన మోక్షగుండం విశ్వేశరయ్య జన్మ దినోత్సవాన్ని కేవలం ఆనవాయితీగా నిర్వహించడంతో సరిపెట్టుపోకుండా ఆ మహనీయుని స్పూర్తితో మనమంతా రెట్టింపు ఉత్సాహంతో దేశ సేవకు, దేశ పురోభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, పీఓ పీకేఓసీ టి.లక్ష్మీపతి గౌడ్, ఏజెంట్ కొండాపురం పి.వీరభద్ర రావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీర భద్రుడు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం (కేసీహెచ్‌పీ) మధన్ నాయక్, డీజీఎం(పర్చేస్) శ్రీనివాస మూర్తి, పర్యావరణ అధికారి జల శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి కట్ల శ్రీనివాస్, డీవైఎస్ఈ(సివిల్) పాత్రుడు, ఈఈ(సివిల్) ప్రవీణ్, పీఏటు జీఎం శ్రీరాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో...

అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో మౌనిక రెస్టారెంట్ మీటింగ్ హాలులో ఘనంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకల్లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య పాల్గొన్నారు. అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు మయ్య శ్రీనివాస్, ప్రముఖ సామాజిక కార్యకర్త కర్నే రవి, సీనియర్ ఉపాధ్యాయులు వేల్పుల రవి, వివిధ విభాగాలలో పనిచేసే ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. బర్ల రమేష్ బాబు డీఈ ఇరిగేషన్ గుణగంటి కళ్యాణ్ రామ్, డిప్యూటీ మేనేజర్ ఎస్సీ పీకే ఓసీ 2 కల్లోజి రామకృష్ణ, ఎస్ఈ సింగరేణి ఎజ్జు భాస్కరరావు, ఏఈ ఇరిగేషన్ డి.రమేష్ ఏఈ సీతారాం సాగర్ ప్రాజెక్ట్ జి.రాజ్ కుమార్, పీకే ఓసీ 2 ఎడ్ల మధు, అసిస్టెంట్ సైట్ మేనేజర్ గ్లోబల్ కంపెనీ తదితరులకు సన్మాన నిర్వహించారు. అనంతరం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



23న ఛలో హైదరాబాద్

- బీసీ డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుతల



నవతెలంగాణ-కొత్తగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణ కోసం సెప్టెంబర్ 23 ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుతల నర్సింహారావు అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగింది. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కమిటీ సమావేశంలో బీసీ డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుతల నర్సింహారావు, బ్రహ్మాచారి పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల అందరి దగ్గర సంతకాల సేకరణ నిర్వహించి ముఖ్యమంత్రి పంపించాలని కోరారు. 23న హైదరాబాద్ ధర్నాకు జిల్లాల నుండి పెద్ద ఎత్తున కార్మికులు తరిలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుర్రం రాములు, ఈసపోను రాంబాబు, బూష రమేష్ నక్క సత్యనారాయణ, రుంజా సుధాకర్, బిల్లా ముత్యాలరావు, బుద్ధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అలుపెరగని కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

- 1వ వార్డు ఆధ్వర్యంలో సంతాప సభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అవుపెరగని కమ్యూనిస్టు యోధుడు సీతారం ఏచూరి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అన్నారు. స్థానిక ఒకటో వార్డులో ఆదివారం జరిగిన ఏచూరికి సంతాప సభ ధనకొండ రాఘవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి నర్సారెడ్డి మాట్లాడారు. దేశంలోని అనేకమంది ప్రముఖులు, మేధావులు, రాజకీయవేత్తలు పార్టీలకతీతంగా సైదాంతికంగా వ్యతిరేకత భావాలు కలిగిన గాని ఒక మిత్రుడుగా, ఒక మేధావిగా భావించి ఆయనకు నివాళులర్పించారు. నిరంతరం సమ సమాజం కోసం పరితపించిన వ్యక్తిగా భవిష్యత్తులో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు ఆయన సూచించిన మార్గంలో పయనించాలని ఆయన ఆశయ సిద్ధి కోసం పాటుపడాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, శాఖ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు, ఆది, పోసి, గంగ, కుమారి, సుధా, మురళి, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-దమ్మపేట

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన ఊకే ఏసురాజు (31) ద్విచక్రవాహనంపై సత్తుపల్లి నుండి స్వగ్రామం వస్తుండగా మొద్దులగూడెం సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్ళగా పరిస్థితి విషమించి మరణించాడు. ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణనాధులను దర్శించుకున్న మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం మండలంలోని మందలపల్లిలో ఏర్పాటు చేసిన మండపాల వద్దకు కమిటీ వారి ఆహ్వానం మేరకు హాజరై గణనాధుడిని దర్శించుకున్నారు. ముందుగా తూర్పు బజారులో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెచ్చాను కమిటీ వారు, పెద్దలు శాలువాతో సత్కరించారు. అనంతరం రామాలయం వద్ద స్వామి వారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బీసీ కాలనీ, ఎస్సీ కాలని వద్ద స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ప్రకాష్ నగర్ కాలనీలో స్వామి వారిని మెచ్చా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ కమిటీ సభ్యులు మెచ్చాను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అజయ్, బుడే, మద్దెల పుల్లారావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు బహుమతులు

ఇల్లందు : విధులలో ఉత్తమ రక్షణ సూత్రాలను పాటిస్తూ మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ బహుమతులు అందజేశారు. ఏరియా వర్క్ షాప్ నందు నిర్వహించిన ప్రత్యేక భద్రత పై అవగాహనా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏరియా వర్క్ షాప్ ఉద్యోగులకు భద్రత, రక్షణ సూత్రాలపై అవగాహనా కల్పించారు. వర్క్ షాప్ ఉద్యోగులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలపై స్పందిస్తూ త్వరితగతిన నివారించుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరైనా తము నిర్వహిస్తున్న విధులకు ఆటంకం కలిగించినట్లైతే వారిపై చట్ట పరమైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉద్యోగులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్ షాప్ ఇన్‌ఛార్జ్ నాగరాజు నాయక్. ఇంజనీర్ వీరునాయక్, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు అరికట్టాలి

అశ్వారావుపేట : దేశంలో మహిళలపై ప్రతి రోజూ దాడులు పెరుగుతూనే ఉన్నాయని, లైంగిక దాడులు, హత్యల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అవుతున్నాయని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెచ్చెల కల్పన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. సమావేశంలో సంఘం బాధ్యులు కల్లూరి పద్మ, గోకినపల్లి గంగ, కోంద్రు లక్ష్మీ, కంగాల భూ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయని కుమారుని హతమార్చిన మావోయిస్టులు

- సుకుమా జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ సుకుమా జాగరగుండ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజాకోర్టును నిర్వహించి గోండ్‌పల్లిలో నివాసముంటున్న దూది అర్జున్‌ని అనే ఉపాధ్యాయిని కొడుకు దూది మంగుడును కర్రతో కొట్టి, తాడుతో గొంతు కోసి మావోయిస్టులు హత్య చేశారు. మావోయిస్టుల బెదిరింపుల భయం కారణంగా గ్రామస్తులు శనివారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆలస్యంగా మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సంవత్సరంలో మావోయిస్టుల వల్ల నిరంతర నష్టం జరగడం, పోలీస్ శిబిరాలు నిరంతరం తెరవడం వల్ల మావోయిస్టులు సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సంఘటనలో పాల్గొన్న మావోయిస్టుల నిందితుల చిరునామాలు ఆరా తీస్తున్నారు. సంఘటనకు సంబంధించి సమాచారాన్ని తీసుకుంటూ జాగరగుండ పోలీస్ స్టేషన్‌లో ముందస్తు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

వనవాసీ విద్యార్థి నిలయంకు వితరణలు వెల్లువ

నవతెలంగాణ- చర్ల

చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు దాతలు వితరణలు, భోజన ఏర్పాట్లు చేసారు. గాధంశెట్టి చెంచులక్ష్మి జ్ఞాపకార్థం కుమారుడు-కోడలు గాదంశెట్టి నరసింహారావు-పద్మ దంపతులు 50 కేజీల బియ్యంతో పాటు విద్యార్థులకు భోజన ఏర్పాట్లు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసారు. చర్లకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి రంగు రమేష్ తన తండ్రి రంగు సోమయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేసి పండ్లు, స్వీట్స్‌ను అందచేసారు. గతంలో సైతం వీరు నిలయ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందచేసారు. దాతలకు నిలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నిలయ ప్రముఖ్ గొంది శోభన్ బాబు, వనవాసీ సహాయ కార్యదర్శి గోగికార్ రాం లక్ష్మణ్, చర్ల మండల ప్రముఖ్ ఇర్ప రాజు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్న కుమారి, రంగు రమేష్, ఏకోపాధ్యాయ ఆచార్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను, పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలి

- టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఏలను, పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలని టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూక్య శంకర్ నాయక్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షతన ఆ సంఘం 12వ ఆవిర్భవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్లాత్ లక్ష్మణ్ నాయక్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటులో ఉద్యోగ ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనదని, తెలంగాణలో కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపకులు. డి.ప్రేమ్ చంద్ నాయక్, టిఎస్ టిటిఎఫ్ రాష్ట్ర నాయకులు శోభన్, హాతిరాం, రత్నాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.శంకర్, వి.రమేష్ బాబు, జిల్లా ప్రధాన కార్యకార్శి, వర్కింగ్ ప్రెసిడెంట్, బన్సీలాల్, కోశాధికారి యం.బాలు, తదితరులు పాల్గొన్నారు.

కనకాద్రి గుట్టలను టూరిజం హబ్‌గా చేద్దాం

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-చంద్రుగొండ

అద్భుతమైన చూడదగిన ప్రదేశాలు ఉన్న కనకాద్రి గుట్టలను టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేద్దామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం బెండాలపాడు గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతాన్ని, ఆదివాసుల బ్యాంబో క్లష్టర్ (చంద్రుగొండ బ్యాంబో క్లష్టర్)ను కలెక్టర్ ఉదయం 7 గంటల సమయంలో మండలంలోని మారుమూల గ్రామమైన గిరిజన ఆదివాసులు నివాసం గల బెండాలపాడు గ్రామానికి వచ్చారు. అటవీ ప్రాంతం దగ్గర ఉన్న బ్యాంబో క్లష్టర్ నుంచి కాలిబాటన ఇక్కడ ఉన్న బ్యాంబో క్లష్టర్ సభ్యులతో కలిసి నడుచుకుంటూ కొండ పైకి ఎక్కారు. కొండ పై ఉన్న వీరభద్ర స్వామి (శివాలయం) గుడిని అక్కడ ఉన్న ఏనుగుల మోట బావి, పసుపు బావి, బొద్రాయి, పల్లేరు బావి, ఫారెస్ట్ వాచ్ టవర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూర్, జూలూరుపాడు, ఆనుకొని ఉన్న కొండలు, అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. అలాగే కొండ కింద ఉన్న హస్తాలు వీరన్న, జలపాతాలు, ఫారెస్ట్ చెక్ డ్యామ్‌లను కూడా సందర్శించారు. ఇవి చూసిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఇది అద్భుతమైన టూరిజం ప్రాంతంగా, ఒక టూరిజం హబ్‌గా తయారు చేయవచ్చు అన్నారు. చాలా అద్భుతమైన చూడదగిన ప్రదేశాలు ఇక్కడ గలవు అన్నారు. ఇక్కడ ఉన్న ప్రకృతి వనరులు, వాతావరణం, పచ్చని చెట్లు, పచ్చని పంట పొలాలు, చాలా బాగున్నాయి అని చెప్పారు. బ్యాంబో క్లష్టర్‌ను సందర్శించి అక్కడ ఉన్న కొన్ని ప్రొడక్ట్స్‌ను పరిశీలించారు. ఇంకా బాగా చేయాలని ఇందుకు మీకు ఏ సహకారం కావాలన్నా తప్పకుండా అందిస్తామని చెప్పారు. వెదురుతో ఇంకా అద్భుతమైన ప్రొడక్ట్స్ తయారు చేసి ఇంటర్నేషనల్ స్థాయికి ఎదగాలని సభ్యులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, ఎస్సై స్వప్న, భోజ్యానాయక్, ఫజల్ బక్ష్, బ్యాంబో క్లష్టర్ చైర్మెన్ వీసం నాగభూషణం, వైస్ చైర్మెన్ మల్లం కృష్ణయ్య, సభ్యులు బొర్రా సురేష్, కారం అన్వేష్, వర్స శ్రీను, కుంజా క్రిష్ణయ్య, చీదర ప్రసాద్, పోడియం నర్సింహారావు, మల్లం వెంకటేష్, రేసు సురేందర్, బోడ శ్రీను, అలాగే ప్రింట్ మీడియా, ఎలక్ట్రికల్ మీడియా పత్రిక విలేఖరులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

- చిన్నారులను అభినందించిన పీఓ దంపతులు



నవతెలంగాణ-భద్రాచల రూరల్

వినాయక చవితి నవరాత్రులలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన, వివిధ కళారూపాల ప్రదర్శన చాలాబాగ ఆకట్టుకున్నాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ జీవిత భాగస్వామి మనీషా అన్నారు. శనివారం రాత్రి ఐటీడీఏ నివాస గృహాలలో ప్రతిష్ఠించిన మహాగణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కల్చరల్ వేడుకలలో ఆమె పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన వేడుకలను చూసి ఆమె ఆనందం వ్యక్తం చేసిన అనంతరం మాట్లాడుతూ ఐటీడీఏ నివాస గృహాలలో ఉండే కుటుంబాలు ఐకమత్యంగా ఉండి ఇటువంటి పండగలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారుల ఏకపాత్రాబినయం, చిన్నారుల నృత్య ప్రదర్శన, మహిళల కోలాటం చాలా ఆకట్టుకున్నదని, ఐటీడీఏ మహిళా మండలి గ్రూప్ సభ్యులు ఐకమత్యంగా ఉండి ఒకే కుటుంబంలో కలిసిమెలిసి అన్ని పండుగలు చాలా సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. అనంతరం వివిధ కళారూపాలు ప్రదర్శించిన చిన్నారులకు శాలువాలతో సత్కరించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు మాధవి, భవాని, స్వాతి, అరుణ, మణి కుమారి, సుధారాణి, విజయ, లలిత తదితరులు పాల్గొన్నారు.

18 నుండి మండల స్థాయి క్రీడలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రభుత్వ పాఠశాల మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 18 నుండి ప్రారంభిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కమిటీ చైర్మెన్, ఎంఈవో కీసర లక్ష్మీ తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పడకేసిన పూసుగుప్ప

- పట్టింపులేని ప్రభుత్వ వైద్యం
- ప్రయివేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్న ప్రజలు



నవతెలంగాణ-చర్ల

ఒకపక్క జోరు వర్షాలు, రహదారి వసతులు లేని పూసుగుప్పలో ప్రభుత్వ వైద్యం పడకేసిందని పలువురు మండి పడుతున్నారు. సీజన్‌లో వచ్చే రుగ్మతలను ఎప్పటికప్పుడు వైద్య బృందాలు పర్యవేక్షించి వైద్యం అందించాల్సి ఉండగా ఏ ఒక్క ప్రభుత్వ వైద్యాధికారి పూసగుప్ప వైపు కన్నెత్తి చూడడం లేదు. నేడు గ్రామంలో పదుల సంఖ్యలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ప్రయివేటు వైద్యశాలకు వెళ్తే వేల రూపాయల ఖర్చు అవుతుందని రెక్కాడితే కానీ డొక్కాడని ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న నిరుపేద ఆదివాసీలకు వైద్య ఖర్చులు పెనుభారంగా మారాయని పలువురు గ్రామ పెద్దలు వాపోతున్నారు.

పాత పూసుగుప్ప, కొత్త పూసుగుప్ప అనే రెండు గుంపులుగా ఉన్న పూసుగుప్ప గ్రామంలో పదుల సంఖ్యలో డెంగ్యూ, విష జ్వరాలు వ్యాపిస్తుంటే ఇప్పటివరకు ఆ గ్రామంలో వైద్యాధికారి ఒక్కసారి కూడా సందర్శించకపోవడం, హెల్త్ క్యాంపులు నిర్వహించకపోవడంతో వైద్య శాఖలో ఉన్న నిర్లక్ష్యాన్ని ప్రజలు వేలెత్తి చూపుతున్నారు. సంబంధిత వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడం కేవలం ఆశా కార్యకర్తలు మాత్రమే నామమాత్రపు జ్వరం బిల్లలు ఇవ్వడం మినహా, పరీక్షలు చేసి వైద్యం చేసే పరిస్థితి లేకపోవడంతో విషపూరిత జ్వరాలు, డెంగ్యూ జ్వరాలు అధికంగా ప్రబలి ఇంచుమించుగా గ్రామం మొత్తం పడకేసిందని పలువురు పెద్దలు ఆందోళన చెందుతున్నారు. చర్లకు వచ్చి వైద్యం చేయించుకుందామంటే ప్రభుత్వ దవాఖానాలో కనీసం గ్యాస్ ట్రబుల్ ట్యాబ్లెట్లు కూడా లేకపోవడం, జ్వర పీడితులకు పారాసిటమాల్ ఇంజక్షన్లు లేకపోవడం, రక్త పరీక్షలు నిర్వహించడానికి ప్లేట్లెట్స్ మిషన్లు పని చేయకపోవడం వెలసి ఆదివాసీలు ప్రయివేట్ దవాఖానాలకు వెళ్తున్నారు. అక్కడ వైద్యులు అయోమయం వైద్యం అందిస్తూ నిరుపేదలను జలగలవలె పీల్చి చేస్తున్నారని ఆదివాసీలు లబోదిబోమంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు పూసుగుప్ప గ్రామంపై దృష్టి సారించి అక్కడ ఉన్న వైద్య సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

మా గ్రామంలో వైద్య సేవలు మెరుగుపరచండి :



సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా వైద్య సిబ్బంది పట్టించు కోవడం లేదు. మా గ్రామంలో సుమారు 20 మంది దాకా డెంగ్యూ, విషజ్వరాల బారీన పడ్డారు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు. వైద్య సిబ్బంది ఎవరూ గ్రామాల్లోకి రావడం లేదు. ఐటీడీఏ పీవో, కలెక్టర్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి మా గ్రామంపై దృష్టి సారించాలని కోరుతున్నాం.

- వుయిక శ్రీను, పూసుగుప్ప గ్రామ యువకుడు

గంజాయిని పట్టుకున్న పోలీసులు

- విలువ రెండు కోట్లు..?



నవతెలంగాణ-కొత్తగూడెం

గంజాయి అక్రమదారులు రోజుకో విధంగా గంజాయిని రవాణా చేస్తున్నారు. రూట్ మార్చిన గంజాయి స్మగ్లర్లు పోలీసులకు చిక్కకుండా సరికొత్త మార్గాల్లో రాష్ట్రాలు దాట వేస్తున్నారు. అక్రమార్కుల టైమ్ బాగులేక పోతే పోలీసులకు చిక్కుతున్నారు. ఇదే విధంగా కొత్తగూడెం పట్టణంలోని రామవరం అంబులెన్స్‌లో అక్ర మంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకు న్నారు. స్థానికులు తెలిపిన వివరాలు...శనివారం అర్ధరాత్రి అంబులెన్స్ రామరంలో టైర్ పంచర్ కావడంతో నిలిచిపోయింది. స్థానికుల సహకారంతో టైర్ మార్చుకున్నారు. అప్పటి వరకు సహకరించిన యువకులు అంబులెన్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అంబులెన్స్ తమిళనాడు రిజిస్ట్రేషన్ నెంబర్ ఉంది. అనుమానం రావడంతో అంబులెన్స్‌లో ఎవరున్నారని...? డ్రైవర్‌ను ప్రశ్నించారు. డ్రైవర్ కంగారు పడటం, ఎలాంటి సమాధానం చెప్పక పోవడంతో రామవరం 2 టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్నా పోలీసులు అంబులెన్స్ డోర్స్ తెరిచి చూశారు. పుష్పా సినిమా సీన్లను తలదన్నేలా ఖతర్నాక్ ప్లాన్లో గంజాయిని ఉంచారు. ఖంగుతిన్న పోలీసులు డ్రైవర్‌ను, అంబులెన్స్‌ను అదుపులోకి తీసుకు న్నారు. డ్రైవర్‌ను విచారిస్తున్నట్లు సమాచారం. సంఘటనకు సంభంధించిన వివరాలు పోలీసులు వెల్లడించ లేదు. స్థానికులు తెలిపిన వివరాలు ఆంధ్రప్రదేష్ ఏటీబీ నుంచి తమిళనాడుకు అక్రమంగా అంబులెన్స్‌లో గంజాయి తరలిస్తున్నారని, అంబులెన్స్ టైర్ పంక్చర్ కావడం, పోలీసులకు సమాచారం అందించామని, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుందని అంటున్నారు. పూర్తి వివరాలు సోమవారం పోలీసులు వెల్లడించనున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషంగా నవరాత్రులు జరుపుకోవాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

పండుగలు, ఉత్సవాలు ప్రజా సంబంధాలు మెరుగుపడేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉత్సవ కమిటి ఆహ్వానం మేరకు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మంటపాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, వాసిరెడ్డి మురళి, నేరెళ్ల సమాఖ్య, పిడుగు శ్రీనివాస్, లగడపాటి రమేష్, గడ్డం ప్రభాకర్, బోయిన విజయకుమార్, యూసుఫ్, నేరెళ్ల రమేష్, సతీష్, అస్మద్ ఖాన్, సురేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని నూతన స్టేజీ పనులు

- దుబ్బ ఇసుక, చెత్త కంకర
- వృధా కానున్న రూ.లక్షలు
- స్పందించని డీజీఎం సివిల్





నవతెలంగాణ-ఇల్లందు

జేకే కాలనీలోని సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో నూతనంగా నిర్మిస్తున్న స్టేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. స్టేజీ నిర్మాణానికి దుబ్బ ఇసుక ఉపయోగిస్తూ తక్కువ పాలలో సిమెంటు కలపడంతో నిర్మాణం దృఢంగా లేకుండా పేలవంగా ఉందని, దీనికి తోడు చెత్త కంకర, నాసిరకం సిమెంటు, రాళ్ల వాడుతున్నారని ప్రజలంటున్నారు. గట్టిగా భారీ వర్షాలు రెండు కొడితే స్టేజికి పగుళ్ళు వచ్చి ఇచ్చుకపోయే పరిస్థితి ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రూ.లక్షలు వృథాకానున్నది. ప్రహరీ గోడకు చేపడుతున్న ప్యాచ్ వర్కు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. సింగరేణి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడుతూ నాణ్యతకు తిలోదకాలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ ఇటీవలే స్వయంగా శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా నాణ్యత విషయంలో రాజీ పడకూడని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఈ విషయమై డీజీఎం పర్సనల్ జివి మోహన్ రావును నవతెలంగాణ వివరణ కోరగా సివిల్ ఇంజనీర్లకు సంబంధించిన విషయం అన్నారు. డీజీఎం సివిల్ రవి కుమార్‌ను వివరణ కోరెందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా స్పందించలేదు. పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక ఆట స్థలం. అధికారులు స్పందించి స్టేజి నిర్మాణం, ప్రహరీ గోడ ప్యాచ్ వర్క్‌ల విషయంలో మిగతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



అరుణ తార సీతారాం ఏచూరి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతాప సభలు

నవతెలంగాణ-ఇల్లందు

ప్రపంచ మేధావిగా పేరు గాంచిన గొప్ప వ్యక్తి, సీపీఐ(ఎం) పార్టీలో వెలిగిన అరుణ తార సీతారాం ఏచూరి అని పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి అన్నారు. సీతారాం ఏచూరి సంతాప సభలు స్థానిక 13వ నంబర్ బస్తీ, వినోబా భావే కాలని దేవులపల్లి యాకయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడారు. అనంతరం నాటి వీర తెలంగాణ రైతాంగ పోరాట యోధులు చరిత్రను గుర్తు చేశారు. ఈ సభలలో కే.మరియా, ఆలేటి కిరణ్ కుమార్లు అధ్యక్షత వహించారు. తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఆలేటి సంధ్య, మునిగంటి లక్ష్మీ కడారి వెంకటమ్మ, వారంగంటి రాజమొగిలి, దేవులపల్లి సోమలక్ష్మీ యాకమ్మ, సుక్క రాంచందర్, సునిత, లక్ష్మీ సుజాత (మీనాక్షీ) నాగమణి, ఎల్కపల్లి లక్ష్మీ శ్రీనివాస్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లేఖను వ్యతిరేకించిన సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్రం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదలతో ముంపు గురైన ప్రాంతాలలో నివసించే కుటుంబాలు అగమ్యగోచరంగా మారిన దుస్థితి తెలిపే విషయమే. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం కార్మికుల నుండి ఒకరోజు బేసిక్ రికవరీ చేయటానికి సమతించమని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలకు లెటర్ రాసిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో కార్మికులు అందరూ గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పక్షానే లేరని, కావునా అన్ని యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు స్పష్టం చేశారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టరును ఆదివారం పోలీసులు సీజ్ చేశారు. స్థానిక అదనపు ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని మామిళ్లవారిగూడెం సమీపంలో గల వాగు నుంచి అశ్వారావుపేటకు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, ఇసుక తరలిస్తున్న వనమా నాగరాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

పలు కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-టేకులపల్లి

ఇటీవల కురిసిన వర్షాలకు కిన్నెరసాని వాగులో కొట్టుకపోయిన మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువకులు, క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయంగా ఆ గ్రామానికి చెందిన ఉద్యోగులు ఆదివారం అందజేసినట్టు తెలిపారు. కిన్నెరసాని వాగులో మృతి చెందిన కోరం వెంకటేశ్వర్లు, దొడ్డ సాయికుమార్, క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన బట్టు సురేందర్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించినట్లు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు. మండలంలోని స్వగ్రామమైన లచ్చగూడెం ఎంప్లాయిస్ స్వగ్రామంకు చెందిన వ్యక్తులు కావడంతో ఆర్థికంగా సహాయ, సహకారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థలో ఎలక్ట్రీషియన్ (ట్రైనీ) కేటగిరి-1 పోస్ట్‌ల భర్తీకి రాత పరీక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఎలెక్ట్రీషియన్ (ట్రైనీ) కేటగిరి-1 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. 133 పోస్టుల ఖాళీలను బర్తీ చేసేందుకు గాను అర్హులయిన 178 అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. 150 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షను జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి పి.సామ్యూల్ సుధాకర్, జీఎం (ఈ అండ్‌ఎం) విజిలెన్స్ కె.ప్రసాద రావు పర్యవేక్షించారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ మేయిన్ గేట్ వద్ద నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజీఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, విజిలెన్స్ ఆఫీసర్ డి.వీరయ్య, పర్సనల్ మేనేజర్ కె.ప్రకాశ రావు, బి.సమ్మయ్య, డివై.పిఎంలు డి.నాగేశ్వర రావు, కె.సంతోష్ కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఉద్యోగులు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో ఐదుగురు హత్య

- సుకుమా జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు రాష్ట్ర చతీస్‌గఢ్ సుకుమా జిల్లాలోని కుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని మురళీగూడ ఇట్కల్ గ్రామంలో చేతబడి చేశారనే అనుమానంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గ్రామంలో హత్య చేశారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. హత్య చేసిన నిందితులను కొంట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బస్తర్ ఐజీ పీ.సుందరరాజ్ ఘటనను ధృవీకరించారు.

అక్రమంగా టేకు కలప రవాణా

- వాహనాన్ని పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

అక్రమంగా పట్టణ ప్రాంతాలకు టేకు కలపను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఓ బులేరో వాహనాన్ని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆళ్ళపల్లి మండల పరిధిలోని రేగళ్ల రేంజిలోని మర్కోడు గ్రామంలో శనివారం సాయంత్రం బొలెరో వాహనంలో టేకు కలప ఉన్నట్టు అటవీ శాఖ అధికారులకు తెలియడంతో అధికారులు బొలెరో వాహనంతో పాటు అందులో ఉన్న కలపను పట్టుకున్నారు. పట్టుకున్న బులేరో వాహనాన్ని మర్కోడు గ్రామంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. టేకు కలపతో పట్టుకున్న బొలేరో, కలపను అటవీ శాఖ అధికారులు పరిశీలించి, కలప విలువను అంచనా వేసి రూ.15 వేలు రుసుముతో కలప, వాహనాన్ని విడిచిపెట్టారు.

గణేష్ మండపాలను దర్శించుకున్న మాటేటి

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని పలు వివిధ గణేష్ మండపాలను యువ నాయకులు మాటేటి కిరణ్ కుమార్ ఆదివారం దర్శించుకుని అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపాల నిర్వాహకులు ధౌలే సాయి కిరణ్, చిక్కుల నాని, రాజు, ఆర్సి బాయ్స్ విజేత, సాయి కళ్యాణ్, చర్చి కాంపౌండ్ పవన్, శీలం ఉపేందర్, వియుకే ఫ్రాంక్స్ ఉపేందర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



పట్టణంలోని మున్నేరు వాగు అనుకొని ఉన్న గణేష్ నగర్ కాలని, బొక్కలగడ్డ కాలనిలు వరదలలో నీట మునిగిన ప్రాంతంలో ఫ్రీ హ్యాండ్స్ ఫౌండేషన్ వారు నిత్యావసరాలను, ఎన్‌వీఎం ఫౌండేషన్ వారు మెడికల్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వంశీ, కె.ప్రశాంత్, వినోద్, రామ్ ప్రతాప్, బి.ప్రశాంత్, ప్రసన్న, సాత్విక, మధు, తనూష్, వెంకటేష్, పర్ష వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భారత దేశం గర్వించే ఇంజనీర్ విశ్వేశ్వరయ్య

- డైరెక్టర్ (ఈ అండ్‌ఎం) ఆపరేషన్స్

నవతెలంగాణ-కొత్తగూడెం

భారత దేశం గర్వించే ఇంజనీర్ భారతరత్న సర్.మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సింగరేణ కాలరీస్ డైరెక్టర్ (ఈ అండ్‌ఎం) ఆపరేషన్స్ డి.సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా గల భారత రత్న, సర్. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చౌక్‌లో విశ్వేశ్వరయ్య 164 వ జయంతి, 57వ ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ (ఈ అండ్‌ఎం) అండ్ ఆపరేషన్స్ డి.సత్యనారాయణ రావు, వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని విశ్వేశ్వరయ్య కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీఎం (పిఅండ్‌పి) కె.సాయి బాబు, జీఎం (ఈఅండ్‌ఎం) ఓసిపి డివిఎస్ సూర్యనారాయణ రాజు, జీఎం (హెచ్‌ఆర్‌డి) వీసం కృష్ణయ్య, జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి పి.సామ్యూల్ సుధాకర్, జీఎం (సెక్యూరిటీ) కె.శ్రీనివాస రావు, జీఎం (టెక్నికల్ సర్వీస్) సోమయాజుల వి.రామ మూర్తి, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'దాసరి' కుటుంబ సౌజన్యంతో మహాన్నదానం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారం సెంటరులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మాజీ వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి (చిట్టినాయన), ఆయన కుమారుడు, కాంగ్రెస్ యువ నాయకుడు మధుమోహనరెడ్డి (మధుబాబు) నేతృత్వంలో గత వారం రోజులుగా గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంగారం, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 2500మందికి పైగా ప్రజలు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, మధుమోహనరెడ్డిలతో పాటు నాయకులు కమల్‌పాషా, గంగారం కాంగ్రెస్ నాయకులు కోలగట్ల చెన్నకేశవరావు, కావేటి అప్పారావు, జల్లిపల్లి వాసు, కోటమర్తి జవహర్‌లాల్, చిన్ని వెంకటేశ్వరరావు, కాలసాని నాగేశ్వరరావు, బత్తుల నారాయణ, బండారు మారేశ్వరరావు, బెజవాడ మనోజ్, సుగ్గల బాబూరావు, ఆర్‌ఎంపీ జనార్దన్, గొర్ల అప్పిరెడ్డి, వాడే మల్లేశ్ పాల్గొన్నారు.

బోనకల్‌తో సీతారాం ఏచూరికి అనుబంధం

నవతెలంగాణ-బోనకల్



బోనకల్లు మండలం తోనూ సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి మంచి అనుబంధం ఉంది. మూడు డిసెంబర్ 2018న ఆనాటి మధిర బిఎల్ఎఫ్ అభ్యర్థి కోటా రాంబాబు విజయాన్ని కోరుతూ బోనకల్ మండల పరిధిలోని రావినూతలలో జరిగిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. మండలంలో దాదాపు నాలుగు గంటల పాటు ఆయన సీపీఐ(ఎం) నాయకుల కార్యకర్తలతో సరదాగా గడిపారు. సీతారాం ఉత్తే పూరిత ప్రసంగంతో బహిరంగ సభకు హాజరైన ప్రజలలో నూతన ఉత్తేజం కనిపించింది. సీతారాం ఏచూరి బహిరంగ సభ కంటే ముందు సభా వేదికపై నాయకులతో ప్రజలకు అభివాదం చేయటంతో సభకు హాజరైన కార్యకర్తలు కేరింతల కొట్టారు. సీతారాం ఏచూరి మృతితో నాటి బహిరంగ సభ విషయాలను సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. సీతారాం ఏచూరి మృతితో బోనకల్ మండల సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు విషాదఛాయలో మునిగిపోయారు.

మున్నేరు వరద బాధితులకు అండగా నిలిచిన... సత్తుపల్లి మండల లేడీస్ టైలర్స్ అసోసియేషన్

- రూ. 80వేలు విలువగల నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



మున్నేరు ఉగ్రరూపానికి గురై సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఖమ్మం అగ్రహారం ముంపు బాధితులకు సత్తుపల్లి లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలిచింది. ఈ నేపధ్యంలో గత నాలుగు రోజులుగా ఆ సంఘ బాధ్యులు జాజిరి జ్యోతి, సతీశ్, ఇమాం, చావ కవిత, భరత్, షేక్ మున్నీ, చాందిని, మల్లేశ్వరి, అరుణ, కవిత, లింగేశ్వరి, మిథున్, మౌనిక, నాగలక్ష్మి, సత్యం, యాసిర్ సత్తుపల్లి పట్టణంలోని ప్రధాన వీధుల్లోని బట్టల దుకాణాలు, వ్యాపారస్తులతో పాటుగా సొంతంగా, వారివారి బంధువుల ద్వారా రూ. 46వేలు నగదుతో పాటు దుస్తులను ఆయా దుకాణాల నుంచి సేకరించారు. సేకరించిన నగదుతో 11రకాల నిత్యావసరాలతో పాటుగా దుస్తులను శనివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో ఐద్వా బాధ్యులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి పద్మ చేతుల మీదుగా పైన తెలిపిన సత్తుపల్లి లేడీస్ టైలర్ల సంఘ బాధ్యులు అందించారు.

బాధితులను లేడీస్ టైలర్లు అండగా నిలవడం అభినందనీయం: మాచర్ల, బుగ్గవీటి, బండి



రెక్కల కష్టంపై కుటుంబ జీవనం సాగించే మహిళా దర్జీలు ఖమ్మం వరద బాధితులకు అండగా నిలవడం అభినందనీయమని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల భారతి, బండి పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. ఊహకు అందని విధంగా ప్రకృతి విపత్తులు జరిగిన సమయాల్లో బాధితుల పట్ల ప్రతి ఒక్కరూ మానవీయ కోణంలో ఆలోచన చేసి తమకు తోచిన విధంగా ఆదుకొనేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ విషయంలో సత్తుపల్లి మహిళా టైలర్ల సంఘం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

ఖమ్మం మార్కెట్‌లోకి టాటా కర్వ్ ఈవి

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని టాటా మోటార్స్ వారు తమ ప్యాసింజర్ ఎస్యువి విభాగంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్ లోనే తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు టాటా కర్వ్ ఈవీని, కర్వ్ (పెట్రోల్, డీజిల్) రెండు మోడల్స్‌ను తమ అధీకృత డీలర్ ఐన వెంకటరమణ మోటార్స్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా మార్కెట్‌లోకి ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఇండియా మార్కెట్ లోకి ఈవి లు రావడం చాలా ఆహ్లాదకరమైన వాతావరణం అని, మన రోడ్స్ కు అనుగుణంగా మ్యానుఫ్యాక్చర్ చేయడం అభినందనీయం అని అన్నారు. టాటా మోటార్స్ టిఎస్ఎం శామ్యూల్ రిచర్డ్ మాట్లాడుతూ టాటా మోటార్స్ వారు ప్యాసింజర్ విభాగంలో అన్ని ఎస్యువి లను 5 స్టార్ రేటింగ్స్‌తో ముందు మరింత సవాల్ విసురుతామని, తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ మైలేజ్, సేఫ్టీ పరంగా ఇప్పుడు మరింత దూకుడుగా ఉంటామని చెప్పారు. ఒకేసారి టాటా కర్వ్ ఈవీని , కర్వ్ (పెట్రోల్ , డీజిల్) రెండు మోడల్స్‌ను విడుదల చేస్తున్నాదని అన్నారు . వెంకటరమణ మోటార్స్ ఎండీ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టాటా మోటార్స్ వారు ప్యాసింజర్ విభాగంలో 5 స్టార్ రేటింగ్స్ తో ఎస్యువి మోడల్స్ లో ప్యాసింజర్ విభాగంలో ఆధిపత్యాన్ని చెలాయిస్తూ ఇప్పుడు మరింత దూకుడుగా ఒకేసారి టాటా కర్వ్ ఈవీని (పెట్రోల్, డీజిల్) రెండు మోడల్స్‌ను విడుదల చేస్తున్నదని అన్నారు. కార్యక్రమములో వెంకటరమణ మోటార్స్ ఉద్యోగులు, చైర్మన్ వంకాయలపాటి ద్రౌపతి, డైరెక్టర్స్ ఆదిత్య చౌదరి, వీరేన్ చౌదరి పాల్గొన్నారు.



అమలుకు నోచుకోని ఆరు గ్యారంటీలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలు ఇప్పటివరకు కాలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని 53వ డివిజన్ ఉత్తర ద్వారకా నగర్ శాఖ మహాసభ కందాల రజిని అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేటప్పుడు ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని వాగ్దానం చేసిందని, ఇప్పటి వరకు అవి కొంతవరకు మాత్రమే అమల్లోకి వచ్చాయని అన్నారు. నూతన కమిటీని 9 మందితో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కందాల వికాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, ఎం. సుబ్బారావు, వై.విక్రమ్, హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు, సీనియర్ నాయకులు వాసిరెడ్డి మల్లికార్జునరావు, శాఖ కార్యదర్శి కందాల వికాస్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు సత్తెనపల్లి శ్రీను, అమరావతి, చావా వీరభద్రం, ఏం.కృష్ణయ్య, జనార్ధన, స్వామి, సురేష్, వడ్డే పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఖగోళ యాత్రతో దేవస్థానానికి సంబంధం లేదు

- విలేకర్ల సమావేశంలో ఆలయ ఈవో ఎల్.రమాదేవి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



యూఎస్ఏకి చెందిన ఆలయ నిర్వాహకులు తలపెట్టిన ఖగోళ యాత్రకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదని, భద్రాచలం ఆలయం పేరుతో ఏ కమిటీలు గాని, ఏ వ్యక్తులు గాని ఎటువంటి విరాళాలు చేపట్టిన దేవదాయ కమిషనర్‌కి ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో ఎల్.రమాదేవి హెచ్చరించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని చిత్రకోట మండపంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈవో రమాదేవి మాట్లాడారు. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్‌ఏ పేరుతో ఖగోళ యాత్ర నిర్వహిస్తున్నామని కోట్ల రూపాయల విరాళాలను సేకరిస్తున్నారు. అన్న విషయం తమ దృష్టికి వచ్చిందని భద్రాచలం ఆలయం పేరుతో చేస్తున్న విరాళాల సేకరణ పై దేవదాయ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తున్నామని స్పష్టం చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో సీతారాముల కళ్యాణం చేసేందుకు యూఎస్‌ఏ అర్చకులు సిద్ధం చేసుకుంటున్నారని, కార్యక్రమానికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. పత్రికలు వివిధ ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా ఖగోళ యాత్రకు సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో డిఈ రవీంద్రనాథ్, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో సీతారాం ఏచూరి సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, మల్లెంపాటి రామారావు, పట్టణ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శి గుమ్మా నరసింహారావు, పార్టీ సభ్యులు పి.కృష్ణ, దేవబత్తిని నరసింహారావు, చిత్తారు మురళి, పల్లెబోయిన వెంకటేశ్వర్లు, పాపకంటి రాంబాబు, కిన్నెర మోతియా, నల్లగొర్ల వెంకటేశ్వర్లు, కామినేని రవి, పుచ్చకాయల రామయ్య, నరసింహారావు, పి.తిరుపతిరావు, ఇమ్మడి వీరభద్రం, మల్లెంపాటి శకుంతల, పొన్నెకంటి నాగమణి, సంక్రాంతి కృష్ణమూర్తి, పోతుమర్తి వీరయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సీపీఐ(ఎం), ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘన నివాళి

సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి నివాళిగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖలు, ఐద్వా ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు మాట్లాడుతూ ఏచూరి మృతి భారతదేశానికి, సీపీఐ(ఎం)కి, వామపక్ష ఉద్యమానికి, కార్మిక కర్షక వర్గానికి, మేధావి వర్గానికి తీరని లోటు అన్నారు. ఏచూరి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు అనుమోలు రామారావు, సంక్రాంతి పురుషోత్తమరావు, శాఖ సభ్యులు సంక్రాంతి చంద్రశేఖర్, వేము చిన్నబాబు, బందెల కృష్ణ, సంక్రాంతి సతీష్, నామ శ్రీనివాసరావు, ఇమ్మడి గోపాలరావు, సయ్యద్ పాషా, సంక్రాంతి వినయ్, మండవ బ్రహ్మేశ్వరరావు, ఐద్వా నాయకులు చింతనిప్పు సులోచన, సంక్రాంతి సత్య శ్రీ, నామ అనురాధ తదితరులు పాల్గొన్నారు,.

కూసుమంచి : దేశం మహా కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరిని కోల్పోయిందని నాయకన్ గూడెం జోన్ కన్వీనర్ కర్ణబాబు తెలిపారు. ఆదివారం మండలంలోని నాయకన్ గూడెం, ఈశ్వరమాధరం సీపీఐ(ఎం) గ్రామ శాఖల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ కర్ణ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రేలా ఇంద్రారెడ్డి, కంచర్ల జగన్మోహన్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు మూడు గన్యా నాయక్, ఈశ్వరమాధరం గ్రామశాఖ కార్యదర్శి జంగిల్ సత్యనారాయణ, తోట కనకమ్మ, గడ్డం మురళి, సింగం సోమయ్య కొత్త ఉపేందర్, సింగం కృష్ణంరాజు, కనకం వీరయ్య, రెడ్డెబోయిన చిన్న విరస్వామి, సూరోజు సైదులు, నాగరాజు, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు పాల్గొన్నారు.

కొణిజర్ల : మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామంలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు బోయినపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఐద్వా నాయకులు బర్రి గోపయ్య, బలమాల యోహాను, రూబెన్, కొచ్చర్ల లెనిన్, కురెల్లి సరోజని, డేవిడ్ నిర్మల, రుతమ్మ, కూమారి తదితరులు పాల్గొన్నారు.

భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఎర్రజెండాది

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు

నవతెలంగాణ-మధిర



భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఎర్రజెండాదని సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు అన్నారు. లగడపాటి గోపయ్య 78వ వర్ధంతి దెందుకూరు గ్రామంలో ఆదివారం ఊట్ల శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ సిర్రబోయిన సత్యం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఎర్రజెండా ఆధ్వర్యంలో కమ్యూనిస్టులు పోరాటం చేశారని తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ స్థాయి పోరాటాల్లో ఒకటిగా గుర్తింపు వచ్చింది అని చెప్పారు. ఈ పోరాటాన్ని హిందూ ముస్లింల పోరాటంగా వక్రీకరించేందుకు బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం శాఖ మహాసభలో మండల నాయకులు మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ గ్రామ మహాసభలు ప్రారంభం అయ్యాయని గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు వివిధ కార్యక్రమాల గురించి చర్చించుకొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకున్నామని తెలిపారు. దెందుకూరు గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా అల్లూరి నాగేశ్వరరావు ఎన్నికయ్యారని తెలుపుతూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మాజీ పట్టణ కార్యదర్శి పాపినేని రామ నర్సయ్య, వుట్లా శంకర్‌రావు, అజయ్, నరసింహారావు, విజయ సారధి, మంగళగిరి మధు, షేక్ ఖాదర్, వాడపల్లి మురళి, వెంకటకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సెంటర్‌లో మహాన్నదానం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద స్థానిక ప్రముఖ వ్యాపారస్తులు అనుమోల వెంకటేశ్వర్ రావు-సువర్ణ దంపతుల సౌజన్యంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం రాత్రి మహాన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి ముందు ఉదయం వెంకటేశ్వర్ రావు కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలైన కొమ్ముగూడెం, మైలారం, చింతోళ్లగుంపు, సీతారాంపురం, లక్ష్మీపురం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రముఖ వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, నరెడ్ల వెంకన్న, నరెడ్ల శ్రీనివాసరావు, తులం ముత్తిలింగం, సిరినోముల శ్రీనివాసరావు, బుర్ర వెంకన్న, గౌరిశెట్టి చంద్రశేఖర్, సంక ప్రభాకర్, కిరణ్, నువ్వుల నర్సింహారావు, సిరినోముల సతీష్, నరేష్, నరెడ్ల నర్సింహారావు, యోగేందర్, సతీష్, ప్రవీణ్, కందిమల్ల సతీష్, అఖిల్, పోకల శ్రీనివాసరావు, మంత్రి కష్టార్జున, కందిమల్ల యుగంధర్, రాజు, శ్రీరాం సంపత్, సతీష్, జోలం శ్రీను, గుంతోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాణాలో కుంకుమ పూజ నిర్వహణ

రాణాలో ఎస్సై రితీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలు ఆదివారం కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపుతో గౌరమ్మను చేసి పసుపు కుంకుమ గంధంతో నిష్టగా పూజ చేసి అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు. ఏఎస్ఐలు వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్స్ కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, కె.ఉపేందర్ దంపతులు పాల్గొన్నారు.

ఏచూరి సంతాప సభ

నవతెలంగాణ-కామేపల్లి

దేశం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, సిపిఎం కామేపల్లి మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీతారామ ఏచూరి సంతాప సభ కామేపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో సిపిఎం కామేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో నాయకులు బాదావతు శ్రీను, గుండా వెంకటరెడ్డి, అడపా ఉపేందర్, సకినాల శ్రీను, వెంకట్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింజరమడుగులో అన్నదానం

నవతెలంగాణ-కామేపల్లి

పింజరమడుగు గ్రామంలో వినాయకుడు వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని సిపిఎం సీనియర్ నాయకులు, పింజరమడుగు గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ వింజం నాగభూషణం, కామేపల్లి సహకార సొసైటీ ఉపాధ్యక్షులు, మాజీ సొసైటీ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాంబాబు, వింజం సత్యం, దమ్మాలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పోలీస్ స్టేషన్లో తల్లి ఫిర్యాదు

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రమైన బోనకల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ సాంబయ్యను (36) ఈనెల 13వ తేదీన అదే గ్రామానికి చెందిన గుగులోతు బాలు తన పొలంలో మందు పిచికారి చేయటానికి తీసుకెళ్లాడు. ఆ రోజు నుంచి సాంబయ్య ఇంటికి రాలేదు. ఈ క్రమంలో తన కుమారుడు మూడు రోజుల నుంచి ఇంటికి రావడం లేదని తల్లి యార్లగడ్డ చంద్రమ్మ ఆదివారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై కడగండ్ల మధుబాబు విచారణ చేపట్టారు. బోనకల్-ఆళ్లపాడు రోడ్డులో వాగు ఒడ్డు మీద చెప్పులు ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వాగులో సాంబయ్య మృతదేహం కనిపించింది. మద్యం మత్తులో వాగులో పడి మతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. అయితే ఇది ఇలా ఉండగా తన కుమారుడిని గుగులోతు బాలు పొలంలో మందు కొట్టడానికి తీసుకెళ్లాడని, మద్యం మత్తులో ఉన్నానని తాను పొలానికి మందు కొట్టలేనని సాంబయ్య చెప్పినా వినకుండా బలవంతంగా మందు కొట్టించుకొని అతని గురించి పట్టించుకోకుండా వదిలేసి వెళ్లాడని తల్లి చంద్రమ్మ ఫిర్యాదులో పేర్కొంది. వారి నిర్లక్ష్యం ఫలితంగానే తన కుమారుడు మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నది. మద్యం మత్తులో ఉన్న సాంబయ్య ఇంటికి రాలేక రెండు రోజులుగా అక్కడే పడి ఉండి చివరకు వాగులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు.

మహిళకు సీపీఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్

నవతెలంగాణ-కారేపల్లి

భార్య భర్తల మధ్య తగాదాలతో క్షణికావేశంలో ఉరి వేసుకుని అపస్మారక స్థితిలో ఉన్న మహిళను కారేపల్లి బ్లూకోర్టు కానిస్టేబులు సీతారాములు సీపీఆర్ చేసి కాపాడిన ఘటన కారేపల్లి మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని ఓ తండాకు చెందిన భార్యభర్తలు గొడవ పడ్డారు. ఆ సమయంలో మహిళ 100 కి ఫోన్ చేసింది. దీంతో కానిస్టేబుల్ సీతారాములు, 100 డ్రైవర్ సైదులు ఆ ప్రాంతానికి వెళ్ళగా ఇంట్లో మహిళ ఉరివేసుకోని ఉంది. ఇంటి తలుపు తీసి లోనికి వెళ్ళిన పోలీసులు మహిళను దించి సీపీఆర్ చేశారు. వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. దీంతో మహిళ ప్రాణాలతో బయట పడింది. మహిళను కాపాడిన కానిస్టేబుల్ సీతారాములు, డ్రైవర్ సైదులు ను తండా వాసులు అభినందిస్తున్నారు.

సెల్ టవర్‌ని వెంటనే తొలగించాలి

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణం లడక్ బజార్‌లోని మిలీనియం స్కూల్ దగ్గరలోని ఏటి ఒడ్డు వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని లడక్ బజార్ నివాసులు ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నివాసములకు అతి సమీపంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, మొన్నటి వరకు చాలా కుటుంబాలు వరదలో ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వలన నిత్యం అనేక రోగాల సమస్యలతో ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ సెల్ టవర్ రేడియేషన్ వలన చిన్న పిల్లలు, వృద్ధులు, పెద్దలు అనేక రోగాలు బారిన పడే అవకాశం ఉందని, అందువలన నిర్మాణంలో ఉన్న సెల్‌టవర్ పనులు నిలిపివేయాలని మధిర మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని లడక్ బజార్ వాసులు తెలిపారు.

స్మార్ట్ కిడ్జ్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం బ్యాంక్ కాలనీలోని శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో చిన్నారులకు సరస్వతీ పూజ సాంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. గణేష్ మండపంలో అర్చకులు చిన్నారుల చేత అక్షరాలు దిద్దించి సరస్వతీమాతకు, గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 150 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి వేదమంత్రాలతో సాంప్రదాయకరంగా పూజలతో చిన్నారులకు దీవెనలు అందించారు. ఈ అక్షరాభ్యాస క్రతువుకు కావలసిన పూజా సామాగ్రిని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మోతరపు సుధాకర్, భాస్కర రావు, సతీష్, మధు, నవీన్, ప్రసాద్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర ఎమ్మెల్యే తండ్రికి సీఎం నివాళి

- దమగ్నాపూర్‌లో దశదినకర్మకు హాజరు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారుల పరామర్శ



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్‌ప్రాంతీయ ప్రతినిధి

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తండ్రి గావినోళ్ళ కృష్ణారెడ్డి మరణించిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం, దమగ్నాపూర్ గ్రామంలో దశదినకర్మ నిర్వహించగా, దీనికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కష్టకాలంలోనే మనోధైర్యంతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో.. ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్స్ సురభి, జిల్లా ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్ రావు, అడిషనల్ ఎస్పీ రాములు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేఘా రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, కూచకుళ్ల రాజేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు.. ప్రజాపాలన దినోత్సవంలో భాగస్వామ్యం కాలేను

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రజాపాలన దినోత్సవానికి ఆహ్వానించినందుకు ధన్యవాదాలు.. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో నేను భాగస్వామిని కాలేను' అని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. 'హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్యం పొందేందుకు ఏండ్ల తరబడి పోరాడిన విధానం, నిజాం సైన్యం రజాకార్ల చేతిలో వేలమంది ప్రాణాలు కోల్పోయిన సంగతి ఈ గడ్డపై పుట్టిన బిడ్డగా మీకు తెలుసు. ఆ వీరుల త్యాగాలను, ధైర్యసాహసాలను ప్రస్తుత తరానికి తెలపాల్సిన అవసరముంది. చరిత్రలో ఏమీ జరగలేదన్నట్టుగా, పరిపాలన నియంత రాజు నుంచి ప్రజాస్వామ్యానికి మారడం మాత్రమే జరిగిందన్నట్టుగా చెప్పడం ప్రజల దృష్టిని మరల్చడమే. దీనికి భిన్నంగా ప్రధాని మోడీ కొన్నేండ్లుగా తెలంగాణ వీరుల త్యాగాలను స్మరించుకునేలా, నివాళులు అర్పించేలా తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారు. సమీప భవిష్యత్తులో వాస్తవాలను అర్థం చేసుకుని విమోచనా దినోత్సవాన్ని సీఎం గుర్తిస్తారని బలంగా విశ్వసిస్తున్నాను. ఈ నేపథ్యంలోనే ప్రజాపాలన దినోత్సవంలో నేను భాగస్వామ్యం కావడం లేదు' అని లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల మనిషి జిట్టా బాలకృష్ణారెడ్డి

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- కుటుంబానికి అండగా ఉంటా : మాజీ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమకారునిగా జిట్టా బాలకృష్ణారెడ్డి పోరాటం చేశారని, తెలంగాణ ప్రజల మనిషిగా ఎదిగారని, జిట్టా లేని లోటు ఎవరూ తీర్చలేనిదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి సంతాప సభ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాల్‌లో జిట్టా కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సంతాప సభకు హాజరైన ఆయన.. జిట్టా చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మాజీ డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీత, గాదరి కిషోర్, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, గవ్వల బాలరాజు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, గాయకులు ఏపూరి సోమన్న, వివిధ పార్టీల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, జిట్టా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని యువకుడు మృతి

- అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం వేగంగా ఢీ కొట్టడంతో అందులో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసనగర్‌కు చెందిన మోసిన్ (18) తన స్నేహితునితో కలిసి ఆదివారం ఉదయం శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. పిల్లర్ నెంబర్ 266 వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ని వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. బైక్ నడుపుతున్న మోసిన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతని స్నేహితునికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ 'ఖాళీ'జీ

మూడేండ్లయినా అతీగతీ లేదు

- రానంటున్న ప్రొఫెసర్లు, డాక్టర్లతో సిబ్బంది కొరత
- అరువు భవనాలు.. అద్దె బస్సులు..
- నర్సింగ్ భవనంలో మెడికల్ కళాశాల
- మూడేండ్లుగా కొనసా..గుతున్న 'మెడికల్' భవనం
- హాస్టల్ భవనాలు లేక బాలికల అవస్థలు



నవతెలంగాణ-మహబూబాబాద్

మానుకోటలో ప్రభుత్వ జీజీహెచ్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కళాశాలకు బోధన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్స్.. తాము రాము.. రాలేమంటూ ముఖం చాటేస్తున్నారు. ఎన్ని లక్షల జీతం ఇచ్చినా తాము వచ్చేది లేదంటూ భీష్మిస్తున్నారు. మూడేండ్ల కిందట ప్రారంభించిన మెడికల్ కళాశాలకు హాస్టల్ భవనాలు లేకపోవడం, బోధన సిబ్బంది రాకపోవడం రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల మానుకోట మెడికల్ కళాశాల భవితవ్యం అగమ్య గోచరంగా మారింది.

మహబూబాబాద్ పట్టణానికి 4-5కి.మీ దూరంలో ఉన్న మెడికల్ కళాశాలకు విద్యార్థులు ఎంతో ఆశతో వస్తుండగా వారి ఆశలు అయోమయ పరిస్థితిలో పడ్డాయి. పూర్తిస్థాయిలో బోధన సిబ్బంది లేకపోవడం, హాస్టల్ భవనాలు లేకపోవడం రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. నర్సింగ్ విద్యార్థుల కోసం నిర్మించిన భవనాన్ని అరువుగా తీసుకొని మెడికల్ కళాశాల నిర్వహిస్తున్నారు. మెడికల్ కళాశాల భవనం కోసం నిధులు కేటాయించినప్పటికీ విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి మెడికల్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ భవనానికి నిధులు ఇచ్చినప్పటికీ విడుదల చేయకపోవడంతో హాస్టల్ భవన నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. బాల బాలికలకు ప్రత్యేకంగా మహబూబాబాద్ పట్టణంలో వేరువేరుగా నాలుగు ప్రయివేటు భవనాలు అద్దెకు తీసుకుని హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఆ భవనాల్లో కూడా పూర్తిస్థాయి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్ నుంచి కళాశాలకు విద్యార్థులు రావడానికి సొంత బస్సు సౌకర్యం లేకపోవడంతో అద్దె బస్సులు తీసుకొని నడిపిస్తున్నారు.

బోధన సిబ్బంది ఖాళీలు

మహబూబాబాద్ మెడికల్ కళాశాలను 2022-23 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. ప్రతి ఏటా 150 సీట్లు కేటాయించారు. ఇప్పటికి రెండు సంవత్సరాలకు పూర్తికాక 300 మంది విద్యార్థులున్నారు. మరో వారం రోజుల్లో నూతన విద్యార్థులు 150 మంది విచ్చేయనున్నారు. కానీ, కళాశాలలో బోధన సిబ్బంది లేకపోవడంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. మెడికల్ కళాశాలకు 41 మంది ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 14 మంది మాత్రమే ఉన్నారు. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్లు 51మందికి గాను 17మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 139 మందికి గాను 51 మంది ఉన్నారు. ట్యూటర్లు 31 మందికి గాను 6 మంది మాత్రమే ఉండగా, సీనియర్ రెసిడెంట్స్ 50 మంది ఉండాల్సి ఉండగా.. ఇప్పటికీ ఒక్కరినీ కేటాయించలేదు. కాగా, బోధనా సిబ్బందికి కేటాయించేందుకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చినా వచ్చేందుకు ఏ ఒక్క డాక్టర్, ప్రొఫెసర్ ముందుకు రాకపోవడం గమనార్హం. దాంతో కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నోటిఫికేషన్

ఈ విద్యా సంవత్సరంలో బోధనా సిబ్బందిని, డాక్టర్లను నియమించడం కోసం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో ఐదుగురు ప్రొఫెసర్లు, ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 19 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 26 మంది ట్యూటర్లు, 49 మంది సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు.

వీరికి ఈ నెల 17న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు అలాగే మరో 73 మంది మెడికల్ టెక్నీషియన్ల నియామకం కూడా అవసరం ఉన్నట్టుగా తెలుస్తోంది. త్వరలో టెక్నీషియన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు సమాచారం.

మారుమూల ప్రాంతం అయినందునే..

మహబూబాబాద్ పట్టణం మారుమూల ప్రాంతంతో అయినందున ఈ ప్రాంతానికి బోధన సిబ్బందిగా ప్రొఫెసర్లు, వైద్యులు రావడానికి ఇష్టపడటం లేదు. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులు తమ సొంత క్లినిక్ లేదా కార్పొరేట్ ఆస్పత్రిలో పార్ట్ టైం జాబ్ చేయడం ఆనవాయితీగా వస్తుంది. మహబూబాబాద్ ప్రాంతంలో సొంత క్లినిక్ పెట్టలేని పరిస్థితి. అంతేకాదు, సమీపంలో కార్పొరేట్ ఆస్పత్రులూ లేకపోవడమూ కారణం. పైగా వరంగల్ సమీపంలో ఉన్న ప్రాంతాల్లోని మెడికల్ కళాశాల్లో పని చేయడానికి మాత్రం ఇష్టపడుతున్నారు. ఆ మెడికల్ కళాశాలలో పనిచేస్తే తక్షణమే వరంగల్ ప్రాంతానికి వచ్చి కార్పొరేట్ వైద్యం చేసుకునే వీలుంటుంది. కాబట్టి అక్కడ పని చేయడానికి వైద్యులు ఇష్టపడుతున్నారు. మరో వారం రోజుల్లో మొదటి ఈ సంవత్సరం విద్యార్థులు 150 మంది కౌన్సెలింగ్ ద్వారా చేరనున్నారు. వీరికి హాస్టల్‌కు సంబంధించిన భవనాలు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. మెడికల్ కళాశాల నిర్వహణ భవనాలు, సౌకర్యాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

- కేంద్ర ప్రభుత్వ విధానాలను సాయుధ పోరాట స్ఫూర్తితో తిప్పికొడదాం
- సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని వక్రీకరించి, ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బీజేపీ విధానాలను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో సీపీఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం.. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడారని తెలిపారు. పాలకుర్తి గ్రామంలో చుట్టుపక్కల ప్రజలను చైతన్యపరిచి నైజాం అరాచకాలను, తిప్పుకొట్టడానికి ధైర్యంతో ముందుకెళ్లిన వీరనారి చిట్యాల ఐలమ్మ ధీరత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులన్నారు. మతోన్మాద బీజేపీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోరాటాన్ని హిందూ ముస్లిం పంచాయితీలాగా మారుస్తుందని అన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారాలు వేయడానికి ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయాలని మోడీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణ మాఫీ చేయాలని తెలిపారు. రైతుబంధు వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ డిక్లరేషన్స్ అమలు గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్స్ పెంచుతామని హామీ ఇచ్చి 10నెలలు అయినా పెంచడం లేదన్నారు. రాష్ట్రంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. దళిత, గిరిజన మహిళలపై లైంగికదాడులు, వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 28, 29 తేదీల్లో నిర్మల్ పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభ నిర్వహణ కోసం ప్రజలు, వ్యాపారస్తులు, పట్టణ ప్రముఖులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, జిల్లా నాయకులు ఫసివుద్దీన్, ప్రసాద, లలిత, రాజమణి, శైలజ, నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఎగవేత విలువ రూ.2 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

డైరెక్టరేట్ వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 4,872 కేసులు నమోదు కాగా, ఎగవేతల విలువ రూ.1.01 లక్షల కోట్లుగా ఉంది. డీజీజీఐ వార్షిక నివేదిక ప్రకారం... పన్ను చెల్లించకపోవడానికి సంబంధించిన ఎగవేత కేసుల్లో 46 శాతం రహస్యంగా సరఫరా, తక్కువ మూల్యాంకనం, 20 శాతం నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు (ఐటీసీ) సంబంధించినవి కాగా 19 శాతం ఐటీసీని తప్పుగా పొందడం, రివర్సల్ చేయకపోవడం వంటివి ఉన్నాయి. 2023-24లో ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో 78 కేసుల్లో గరిష్టంగా రూ.81,875 కోట్ల ఎగవేత జరిగింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగం 171 కేసుల్లో రూ.18,961 కోట్ల ఎగవేతలను నమోదు చేసింది.

చిల్లర రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

తన ఎత్తు గురించి కూడా ఆలోచించాలని గుర్తు చేశారు. నేను తెలంగాణ ఉద్యమంలో తాటి చెట్టంత ఎదిగా, నువ్వు మాత్రం వెంపలి చెట్టంత కూడా ఎదుగలేదంటూ విమర్శించారు. లిల్లీపుట్ అని నేను అనలేనా? సన్నాసి అని నేను అనలేనా అంటూ? ఎదురు దాడి చేశారు. నా ఎత్తు గురించి ఆలోచించడం మానేసి రైతుల గురించి ఆలోచించాలని సూచించారు. రూ.4,000 పింఛన్, మహిళలకు రూ. 2,500 , ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, రైతు భరోసా, సన్నాలకు బోనస్ ఎక్కడ అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎక్కడ హామీలను నిలదీస్తారోననే భయంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. "అసలు ఫోర్త్ సిటీ ఎక్కడిది? గత సర్కార్ రూ.1500 కోట్లు ఖర్చుపెట్టి 12 వేల ఎకరాలను ఫార్మాసిటీ కోసం సేకరించింది. అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నావు..కాంగ్రెస్ అధికారంలోకి వస్తె ఫార్మా సిటీ భూములు వాపస్ అన్నావు. అయితే ఫార్మాసిటీ పెట్టు, లేదంటే భూములు ఇవ్వు. ఈ డ్రామా ఏమిటి" అని నిలదీశారు. అదృష్టం బాగుండి గెలిచిన రేవంత్ రెడ్డి, మరోసారీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రెండో సారీ అధికారంలోకి వచ్చిన చరిత్ర ఇటీవల కాలంలో లేదని గుర్తు చేశారు. రేవంత్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలల్లో తొమ్మిది మత కలహాలు జరుగాయని గుర్తు చేశారు. ప్రతిపక్షాలపై బూతు పురాణాలు మానేసి ప్రజల గురించి ఆలోచించాలని హితవు పలికారు. .

సామరస్యంగా సమాధానం చెప్పాలి

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిపక్ష సభ్యుల సవాల్‌కు అధికార పార్టీ సభ్యులు సామరస్యంగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమాధానం చెప్పాలంటే ఎమ్మెల్యేలు గుండాల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అడ్డిమారి గుడ్డి దెబ్బలా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్ రెడ్డి గెలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నాడనీ, ఆయన రాజకీయ బ్రోకర్‌ని విమర్శించారు. పైరవీలతో పబ్బం గడుపుకున్న చరిత్ర ఆయనదేనని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి రాజేందర్ రెడ్డికి లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

దసరాలోపు జేఎల్ పోస్టులకు తుది జాబితా విడుదల చేయాలి

- ఇంటర్ విద్యా బలోపేతానికి కృషి చేస్తాం : జేఎల్ అభ్యర్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ విద్యాశాఖ కమిషనరేటట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు తుది జాబితాను దసరా పండుగలోపు విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో అభ్యర్థులు సమావేశమయ్యారు. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 15 ఏండ్ల తర్వాత జేఎల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మెరిట్ జాబితాను ప్రకటించి ధ్రువపత్రాల పరిశీలనను సజావుగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మెన్ ఎం మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. దసరాలోపు 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి తుది జాబితాను ప్రకటించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను త్వరగా ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో జేఆర్ఎఫ్, నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించి పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నియామకాల కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల బలోపేతం, నాణ్యమైన విద్యను అందించే అవకాశం లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జేఎల్ పోస్టులకు తుది జాబితాను వెంటనే ప్రకటించాలని కోరారు.

5 రాష్ట్రాల ఎన్నికల్లో 'ఓట్ ఫర్ ఓపీఎస్'

- 26న యూపీఎస్, ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు : ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఓట్ ఫర్ ఓపీఎస్ కొనసాగుతుందని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ అన్నారు. ఆ హామీ ఇచ్చే పార్టీలకే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఆదివారం న్యూఢిల్లీలో సుర్జీత్ భవన్‌లో ఎన్ఎంఓపీఎస్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో యూపీఎస్, ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించామని నిర్ణయించామని చెప్పారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ఎంఓపీఎస్ జాతీయ కన్వెన్షన్‌ను డిసెంబర్ 15న ఢిల్లీలో నిర్వహించాలని తీర్మానం చేశామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సంస్కరణల్లో కూడా 99,77,165 మంది ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.10.53 లక్షల కోట్ల పెన్షన్ నిధులు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద కొద్ది మంది దగ్గర కేంద్రీకృతం అవుతుందని అన్నారు. సంపద సృష్టించే వారు వృద్ధాప్యంలో కనీస పెన్షన్ కూడా నోచుకోలేకపోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఓపీఎస్ అధ్యక్షులు విజె బంధు, నాయకులు రామాంజనేయులు, కల్వాల్ శ్రీకాంత్, నరేష్ గౌడ్, శాంతారం, దారివాల్, ప్రదీప్ కుమార్, మంజీత్ రానా తదితరులు పాల్గొన్నారు.

సైంటిఫిక్ పేటెంట్ల ద్వారా దోపిడీ

సైన్స్ ధనవంతుల చేతిలో బానిస కావొద్దు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం

- మూఢ నమ్మకాలు జన జీవనానికి ప్రమాదం
- సైన్స్ నిరంతరం రియాల్టీని నేర్పుతుంది : ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు
- ముగిసిన జేవీవీ రాష్ట్ర ఐదో మహాసభలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైంటిఫిక్ పేటెంట్ల ద్వారా దోపిడీ జరుగుతోందనీ, ఫార్మాస్యూటికల్ కంపెనీలు చాలా ఆకృత్యాలు చేస్తున్నాయని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రాలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక మహసభ రెండో రోజున జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎదుగుతున్న భారతదేశంలో సైన్స్ టెంపర్ లేకపోతే మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు అధికమవుతాయని తెలిపారు. మనిషి తన విజ్ఞానాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. అనవసరపు ఖర్చులతో చేసే పండుగలపై ప్రశ్నించేతత్వం నేర్చుకోవాలనీ, విద్యార్థుల మైండ్‌లో ఇలాంటి వాటి గురించి ఆలోచనలను తీసుకురావాలన్నారు. అందరూ సైంటిఫిక్ టెంపర్‌ను అలవాటు చేసుకోవాలని తెలిపారు. పాజిటివ్‌ను పాజిటివ్‌గా.. నెగటివ్‌ను నెగటివ్‌గా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సైంటిఫిక్ బేసిస్‌తో పెరుగుతున్న ఆకృత్యాలను ప్రశ్నించాలన్నారు. ప్రపంచంలో ఉన్న అన్ని కంపెనీలకు వచ్చే లాభాల్లో 90 శాతం.. 1 శాతం వర్గాల జేబుల్లోకి వెళ్తుందన్నారు. సైన్స్ ధనికుల చేతిలో బందీ కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ పేరుతో ప్రజలకు లాభం చేసే పనులకు ఆటంకం కలిగించొద్దనీ, ప్రజల నమ్మకాన్ని హర్ట్ చేయొద్దని సూచించారు.

సైన్స్, మతం మధ్య యుద్ధం సృష్టించొద్దు : ప్రొఫెసర్ నాగేశ్వర్

సైన్స్, మతం మధ్య యుద్ధం సృష్టించొద్దని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. 'ప్రజా సైన్స్ ఉద్యమ దశ-దిశ' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్రీయ విశ్వాసాలను కలిగించడం జేవీవీ పని అన్నారు. ప్రజా సైన్స్ కార్యకర్తలకు సహనం, ఓపిక ఉండాలని సూచించారు. సైన్స్ చెబితే అది ఆటోమేటిక్‌గా మూఢత్వం అవుతుందన్నారు. సైన్స్ నిరంతరం రియల్టీని నేర్పుతుందని అభిప్రాయపడ్డారు. కాలక్రమేణా కొన్ని నమ్మకాలు సన్నగిల్లుతున్నాయనీ, ఇతరుల నమ్మకాన్ని గౌరవించే సంస్కారం పెంచుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలు జన జీవనానికి ప్రమాదమని, దీనిపై పోరాడాలని సూచించారు. సైన్స్ పెరుగుతున్న కొద్దీ ప్రజలే మారతారని తెలిపారు. సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజలకు దూరం అయ్యాయని తెలిపారు. సైన్స్‌ను ప్రజలకు అందకుండా చేస్తున్న ధోరణులపై పోరాటం చేయాలన్నారు. ఆధారం లేని ఆలోచనలు సమాజంలో తిరుగుతున్నాయని చెప్పారు.

కాసేపు ఎండలో....

మానసిక ఆరోగ్యాన్ని ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తాయి. అందులో విటమిన్ కూడా ఒకటని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా విటమిన్ డి అనగానే మనం ఎముకల ఆరోగ్యం గురించే ఆలోచిస్తాం. సరిపడ విటమిన్ డీ లభించకపోతే. ఎముకలు గుల్లబారకుండా ఉంటాయని, శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిసిందే. అయితే విటమిన్ డీ మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. నిస్సత్తువ, అలసట, నిద్రలేమి వంటి వాటినే కాకుండా.. విటమిన్ డీ కుంగుబాటును కూడా నివారిస్తుందని తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడంలో డోపమైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిసిందే.



అయితే డోపమైన్ ఉత్పత్తయ్యే సబ్‌స్టాన్షియా నైగ్రాతో పాటు మెదడులోని కీలక భాగాల్లోనూ విట మిన్ డీ గ్రాహకాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. మానసిక సమస్యలను దూరం చేయడంలో విటమిన్ డీకి ప్రత్యక్ష సంబంధం ఉంటుందని అనడానికి ఇదే నిదర్శనమని నిపుణులు చెబుతు న్నారు. సాధారణంగా చర్మానికి ఎండ తగిలిన సమ యంలో 7-డీహైడ్రోకొలెస్ట్రాల్ పుట్టుకొచ్చి, విట మిన్ డి3గా మారుతుంది. ఇది కాలేయం నుంచి కిడ్నీలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 1.25 డైహైడ్రాక్సీ విటమిన్ డిగా రూపాంతరం చెందు తుంది. మన శరీరం వాడుకునే విటమిన్ డీ ఇదే.

అందుకే కచ్చితంగా ఉదయం కాసేపు ఎండలో ఉండాలని నిపుణులు చెబుతుంటారు. ఎండలో ఉంటే మానసిక స్థితిని ప్రభావితం చేసే సెరటోనిన్ అనే హార్మోన్ కూడా ఉత్పత్తి అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కుంగుబాటు వంటి లక్షణాలు దూరమవుతాయి.

వెట్టిపై పోరాటమై కదిలింది

కట్కూరు సుశీలాదేవి... చిన్నతనం నుండి కమ్యూనిస్టు భావాలు అలవర్చుకున్నారు. అభ్యుదయ కుటుంబంలో పుట్టి వెట్టికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. గర్భిణిగా ఉండి జైలు జీవితం అనుభవించారు. ధనిక కుటుంబంలో పుట్టినా పేదల పక్షం నిలిచినందుకు అష్టకష్టాలు అనుభవించారు. అయినా ఉద్యమాన్ని మాత్రం వీడలేదు.





సుశీలమ్మది భువనగిరి తాలుకాలోని శరభనాపురం గ్రామం. తల్లి సుందరమ్మ, తండ్రి కొమిరెడ్డి రాంరెడ్డి. వీరిది మధ్యతరగతి భూస్వామ్య కుటుంబం. ఈమే ఇంట్లో తొలి సంతానం. అప్పట్లో స్త్రీలు(ఉన్నత వర్గాలకు చెందిన వారు) బయటికి వెళ్లాలంటే ఘోషా పాటించేవారు. నిజాం ఏలుబడిలో వున్నందున ఉన్నత వర్గం వారంతా ముస్లింల సంప్రదాయాన్నే పాటించేవారు. ఆ రోజుల్లో స్త్రీలలో చైతన్యం తక్కువ. అందుకు భిన్నమైన వాతావరణంలో పెరిగారు సుశీల. తండ్రి ప్రోత్సాహంతో చిన్ననాటినుండి ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లేవారు. ఆమె తండ్రి నిజాం ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారు. అభ్యుదయవాది అయిన ఆయన పిల్లల్ని బాగా చదివించారు.

రెడ్డి హాస్టల్లో చదువు

ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనర్సింహారెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారితో వీరి కుటుంబానికి పరిచయాలుండేవి. సుశీల ఎనిమిదవ తరగతి చదివేందుకు హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్లో ఉన్నారు. అక్కడ ఈమెతో పాటు జతగా రావి నారాయణరెడ్డి కూతురు భారతి కూడా చదివేవారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టుపార్టీ గ్రామాల్లో ఆంధ్రమహాసభ పేరుతో వెట్టికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించింది. పార్టీని అప్పట్లో సంఘంగా చెప్పుకునేవారు. ఖమ్మంలోని చిలకుర్తిలో ఆంధ్రమహాసభకు, భువనగిరి మహాసభలకు సుశీల వాలంటీర్‌గా వెళ్లారు. ప్రతినిధులకు నీళ్ల అందించడం, ఇతర సదుపాయాలు కల్పించడం వంటివి చేసేవారు. అలా ఆమె రాజకీయ జీవితం మొదలైంది. తరువాత హైదరాబాద్లో జరిగిన సభకు కూడా హాజరయ్యారు.

ప్రాథమిక చికిత్సలో శిక్షణ

1947 నాటికి ఉద్యమ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. గ్రామాల్లో ఉద్యమాలు పెరిగాయి. ఆమె తండ్రి కూడా వీటిలో పాల్గొనేవారు. హైదరాబాద్ నగరంలో స్కూళ్లల్లో నిరసన, బంద్ కార్యక్రమాలు జరిగేవి. అందులో వీరూ పాల్గొనేవారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనడంతో నిజాం సర్కారు ఈమె తండ్రిపై నిఘా పెంచింది. దాడులు కూడా చేసేవారు. అట్లాంటి పరిస్థితుల్లో వీరి మకాం గుంటూరులోని మందపాడుకు మారింది. అక్కడి నుండి విజయవాడలో డాక్టర్ అచ్చమాంబ వద్దకు వెళ్లారు. అక్కడే సుశీల ప్రాథమిక చికిత్సలో శిక్షణ తీసుకున్నారు. అప్పటికే కట్కూరు రామచంద్రారెడ్డి ఉద్యమంలో చురుకుగ్గా పాల్గొనేవారు. ఈయనతో సుశీల పెండ్లి గురించి రావి నారాయణరెడ్డి అప్పటికే ఆమె తండ్రితో చెప్పారట. ఆయనకు ఇష్టమే అయినా సుశీలతో మాట్లాడిన తర్వాత చెబుతానన్నారంట.

తల్లిదండ్రులు లేకుండానే పెండ్లి

సుశీల పెండ్లి పార్టీ ఆధ్వర్యంలో రాంచంద్రారెడ్డితో జరిగింది. అయితే నిర్బంధం వల్ల పెండ్లికి ఆమె తల్లిదండ్రులు రాలేకపోయారు. 'నాన్న వచ్చేవరకు ఆగుదాము' అని ఆమె అంటే 'ఆయన రాలేని పరిస్థితిలో ఉన్నారు. పెళ్లి కానిద్దాం' అని పార్టీ పెద్దలు చెప్పడంతో కాదనలేక ఒప్పుకున్నారు. అలా ఆమె కుటుంబసభ్యులు లేకుండానే 1948 సెప్టెంబర్ 16న సాలూరులో వీరి వివాహం అయిపోయింది. అప్పుడే కొణిపాకిలో కొండ మాధవులు అనే కామ్రేడ్‌ను చంపేశారనే కబురొచ్చింది. దీంతో వీరు సాలూరులో నిరసనసభ పెట్టారు. అప్పటికే తెలంగాణాలో యూనియన్ సైన్యాలు ప్రవేశించాయి. కమ్యూనిస్టులపై ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. అరెస్టులకు ప్రయత్నిస్తున్నారు. దీపావళి పండుగకు సుశీల పుట్టింటికి వెళ్లారు. అక్కడే సుశీలను ఆమె భర్తను, తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో అనేక కష్టాలు అనుభవించారు. ఆలేరు నుండి జనగాం స్టేషన్ వరకు నడిపించుకుంటూ తీసుకెళ్లారు. 15 రోజుల తర్వాత శరభనాపురం చేరుకున్నారు. అరెస్టు చేసినవారందరినీ గుల్బర్గా జైలుకు తరలించారు.

ఆదరించేవారు లేక

వాస్తవానికి ఉద్యమ ప్రచారంలో పాల్గొన్నందుకే ప్రభుత్వం వీరిని అరెస్టు చేసింది. కానీ తన రక్షణార్థం ఒక చిన్న తుపాకి సుశీల దగ్గర వుండేది. అది ఎప్పుడూ పేల్చిందే లేదు. ఆ తుపాకి వుందనే కారణం చూపి పోలీసులు ఆమెను అరెస్టుచేశారు. తొమ్మిది నెలలు జైల్లోనే ఉన్నారు. అప్పుడు సుశీల గర్భవతి. జైలు వాతావరణం, అక్కడి తిండివల్ల బాగా బలహీనమయ్యారు. ప్రసవం కోసం జైలు నుండి విడుదల చేశారు. అప్పుడు ఆమె పరిస్థితి చెప్పలేని విధంగా వుండేది. ఆదరించేవారు లేరు. మందులిచ్చి ఆదుకునేవారు. ఎందుకంటే వీరికి సహకరిస్తే ఏమౌతుందోనన్న భయం ప్రజల్లోవుండేది. తీవ్ర రక్తస్రావం జరిగి ఎంతో బలహీనమైనా, చావుబతుకుల మధ్యే సుశీల కొడుక్కు జన్మనిచ్చారు. అప్పటికీ భర్త జైల్లోనే వున్నారు. కొన్ని రోజుల విశ్రాంతి తర్వాత మళ్లీ ఉద్యమంలో పాలుపంచుకున్నాను.

ఉద్యమాన్ని వీడలేదు

సైన్యం నిర్బంధం, దాడులకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించడం, కరపత్రాలు వేయడం, రచ్చబండ మీటింగ్‌లు పెట్టడం వంటివి చేసేవారు. మూడేండ్ల తర్వాత మిగతా కామ్రేడ్స్‌తో పాటు ఆమె భర్త కూడా విడుదలయ్యారు. 'ఇన్ని కష్టాలు అనుభవించినా ఉద్యమం వైపునకు మరలడానికి కారణం నాడు వెట్టిచాకిరిపై పోరాడి రద్దుచేయగలగడమే. దీంతో ఎంతో మంది పేద, బలహీనవర్గాల వారు స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నారు' అంటారు ఆమె. రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రాజ్బాహుదూర్గౌర్, బద్దం ఎల్లారెడ్డి తదితరులతో ఆమెకు బాగా పరిచయం. నాగలక్ష్మి, కృష్ణమూర్తి, భారతి, ఆరుట్ల కమలాదేవి ఈమె సహచరులు.



వంతెన లేదు.. వాగు దాటలేరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు కోరుతున్నారు.

నిలిచిపోయిన పనులు..

మండలంలోని లోత్రాై గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన డీఎంఎఫ్టీ నిధుల కింద రూ.10 లక్షలు, నిధుల నుంచి రూ. 20 లక్షలు మంజూరు చూశారు. టెండరు ప్రక్రియ పూర్తయినప్పటికీ సదరు గుత్తేదారు నిధులు సరిపోవనే కారణంగా చేతులెత్తేశాడు. దాంతో పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మరోమారు టెండరు వేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిన సమయంలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. గోండుగూడ- జన్నారం మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపగా ఎస్డీఎసీఎఫ్(ట్రైబల్) నిధులు మంజూరు చేశారు. కాగా ఇంకా టెండరు వేయలేదు. అలాగే, రోటిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మహ్మదాబాద్-రోటిగూడ గ్రామాల మధ్యలో ఉన్న బండోరా వాగుపై ట్రైబల్ నిధులు రూ.2 కోట్లు మంజూరు అయినా ఇంకా టెండరు ప్రక్రియకు నోచుకోలేదు.

త్వరలోనే పనులు చేపడతాం : సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి జేఈ

లోత్రాై, గోండుగూడ, రోటిగూడ వాగులపై వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా టెండర్లకు ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ మూడు వాగులపై వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇప్పటికే పంపించాం. త్వరలోనే వంతెనల నిర్మాణం చేపడతాం.



వాగులు ఉప్పొంగితే.. దిగ్బంధనమే..

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తితే ప్రమాదకరంగా వాగు దాటి వెళ్లాల్సి వస్తోంది. జన్నారం పంచాయతీలోని గోండుగూడ వాగు వర్షాలకు ఏటా ఉప్పొంగి ప్రవహిస్తుంది. రోటిగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న బండోరా వాగు కూడా వర్షాలకు ఉప్పొంగి రాకపోకలు నిలిచి పోతుంటాయి.

వంతెనల నిర్మాణం చేపట్టాలి: ఎర్ర చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ, జన్నారం



మండలంలోని లోత్రాై, గోండుగూడ, రోడిగూడ గ్రామాల ప్రజలకు వాగులపై వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులు దాటలేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. వంతెనల నిర్మాణం టెండరు ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నిర్మాణాలు మొదలు పెట్టాలి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పనులు పూర్తి చేయాలి.

వర్షాకాలం వస్తే నరకయాతనే : శంకర్ నాయక్, లోత్రాై మాజీ ఉపసర్పంచ్



వర్షాకాలం వస్తే లోత్రాై గ్రామ ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతుంది. అత్యవసర పరిస్థితులు ఉంటే వాగు దాటి వెళ్లాల్సిందే. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాగు దాటడం నరకప్రాయంగా మారుతోంది. పలుమార్లు వాగులో పడి ఇబ్బందులు పడ్డ పరిస్థితిలూ ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వాగుపై వంతెన త్వరగా నిర్మించాలి.

కేజ్రీవాల్ రాజీనామా?

(మొదటిపేజీ తరువాయి)

అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. దేవుడిచ్చిన ధైర్యంతో శత్రువులతో పోరాడతానని తెలిపారు. ఆప్ నాయకులు సత్యేందర్ జైన్, అమానతుల్లా ఖాన్ ఇంకా జైల్లోనే ఉన్నారని, త్వరలోనే వారు కూడా బయటకు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించి, నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు, ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ అధికార పగ్గాలు చేపట్టబోనని ప్రతినబూనారు. కేజ్రీవాల్ అమాయకుడా..? దోషా..? అని తాను ఢిల్లీ ప్రజలను అడగ దలుచుకున్నానన్నారు. ఢిల్లీ నూతన ముఖ్య మంత్రిని ఎన్నుకునేందుకు ఆప్ ఎమ్మెల్యేలతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో పాటు ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ రాజీనామాపై పార్టీ సీనియర్ నేత రాఘవ్ చద్దా స్పందించారు. కేజ్రీవాల్ తన పదవిని త్యజించి అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. ఆప్‌కు ఓటు వేయడంతో కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలు నిర్ధారించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ దీవార్ మూవీలోని సన్నివేశాన్ని తలపిస్తూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ అమాయకుడని తమ చేతిపై రాసుకోవాలని చద్దా కోరారు.

కేజ్రీవాల్ ప్రకటన ఓ పబ్లిషింగ్ స్టంట్, ఎన్నికల ఎత్తుగడ : విమర్శించిన బీజేపీ, కాంగ్రెస్

కేజ్రీవాల్ ప్రకటన పబ్లిసిటీ స్టంట్, ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని కాంగ్రెస్, బీజేపీలు తప్పుపట్టాయి. తన ఇమేజ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో భాగమేనని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి విమర్శించారు. ఢిల్లీ వాసుల్లో కేజ్రీవాల్ అవినీతిపరుడనే ముద్ర పడుతోందని గ్రహించినందుకే దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని దుయ్యబట్టారు. కేజ్రీవాల్ పదవి నుంచి తప్పుకోవడం త్యాగమేమీ కాదని, సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం అధికారుల అనుమతి లేకుండా సీఎం కార్యాలయంలోకి ప్రవేశించడం, ఫైళ్లపై సంతకాలు చేయడం కుదరని కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని బీజేపీ నేత మణిందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. తదుపరి సీఎంగా భార్య సునీతా కేజ్రీవాల్‌ను ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలను ఒప్పించేందుకే రెండు రోజుల గడువుతు తీసుకున్నారని స్పష్టం చేశారు.

ఇక సీఎం నిర్ణయం కేవలం ప్రచార ఎత్తుగడేనని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ అభివర్ణించారు. ఆయన ఎప్పుడో రాజీనామా చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, బెయిల్‌పై విడుదలైన తర్వాత సీఎం కార్యాలయంలోకి వెళ్లకుండా ఆపడమే కాక, ఫైళ్లపై సంతకాలు కూడా చేయకూడదని సుప్రీంకోర్టు కోరడం ఇదే తొలిసారని గుర్తుచేశారు. ఆధారాలను మాయం చేసే అవకాశం ఉందనే ఉద్దేశంతో కోర్టు ఆందోళన ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోందన్నారు. కేజ్రీవాల్‌ను సుప్రీంకోర్టు నేరస్తుడిగా పరిగణిస్తున్నదని ఆరోపించారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

భూస్వామ్య గూండాలు మహమ్మద్ బందగిని హత్య చేశారన్నారు. 1946లో విసునూరు రామచంద్రారెడ్డి, దేశ్‌ముఖ్‌ల గుండాల అరాచకాలను ఐలమ్మ తిప్పి కొట్టిందని, 1946 జులై 4వ తేదీన దేశ్‌ముఖ్ గుండాల కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరుడయ్యారని గుర్తుచేశారు. దాంతో 1946 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ పోరాటం మూడు వేల గ్రామాల్లో విస్తరించిందని, 4000 మంది వీరమరణం పొంది 10 లక్షల ఎకరాల భూమిని రైతులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో సాయుధ రైతాంగ తిరుగుబాటు జరిగి ఉండకపోతే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. తెలంగాణ విలీనం ఎర్రజెండా విజయమని స్పష్టం చేశారు. నాటి పోరాట ఫలితంగానే తెలంగాణలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని అన్నారు. కమ్యూనిస్టు పోరాటాల ఫలితంగానే తెలంగాణలో ఎన్నో లక్షల మంది పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూములు దక్కాయని చెప్పారు. ఈ పోరాటస్ఫూర్తితో తెలంగాణలో ఉవ్వెత్తున జరుగుతున్న గుడిసెల పోరాటాల మూలంగా పాలకులు దిగి వస్తున్నారని అన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతుం దని, దాంతో పాలకులపై ప్రజల్లో అసంతృప్తి తీవ్రంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి.. భూ పంపిణీ చేయాలని, దళిత, గిరిజనులకు ఇందిరమ్మ గృహ పంపిణీ పథకం కింద రూ.6 లక్షలు, బీసీలకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని, భూములు పొందాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్ రెడ్డి, రావుల రాజు, తోట శ్రీను, నక్క సైదులు, కందునూరి శ్రీను, హేమనాయక్, కుమ్మరి కుంట్ల నాగన్న, భానోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఈపీపై కేంద్రం మాటల గారడీ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమానికి ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని దోమల్‌గూడలోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020)లో పేద, బడుగు బలహీన వర్గాలను విద్యకు దూరం చేసే నష్టదాయకమైన అంశాలున్నాయని విమర్శించారు. ప్రీప్రైమరీ, ప్రాథమిక విద్యారంగానికి అవసరమైన ప్రత్యేక నిధుల మాట ఏమీ చెప్పకుండా జాతీయ విద్యావిధానం ఉత్తమమైన విధానమంటూ చెప్పుకోవడం 'నేతి బీరకాయ' చందంగా ఉండడం తప్ప మరొకటికాదని అన్నారు. ఆరేండ్లు నిండితేనే ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలన్న నిబంధన పరోక్షంగా ప్రయివేటు పాఠశాలలకే ఉపకరిస్తుందని చెప్పారు. దశాబ్ద కాలంగా పాతపెన్షన్ విధానం కోసం ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా సీపీఎస్ స్థానంలో ఇంకో పేరుతో ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్) అంటూ కొత్త విధానాన్ని కేంద్రం తెచ్చిందన్నారు. దాని ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టే ప్రయత్నం తప్ప మరొకటి కాదని విమర్శించారు. యూపీఎస్ వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదనీ, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయనివ్వబోమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులైన ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు కీలకమైన ఎన్ఈపీ, సీపీఎస్ అంశాలపై పోరాటాన్ని సవాల్‌గా తీసుకోవాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, నాయకులు ఈ పోరాటాల్లో అగ్రభాగాన ఉండి కీలక భూమిక పోషించాలని సూచించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పూర్తి కావడంతో పదేండ్లుగా విధ్వంసానికి గురైన విద్యారంగానికి కొంత ఉపశమనం కలిగించే అంశమని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని చెప్పారు. అంగన్‌వాడీలకు ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించొద్దని డిమాండ్ చేశారు. ప్రీప్రైమరీకి అదనపు పోస్టులను కేటాయించి ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని సూచించారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య మాట్లాడుతూ బదిలీల సమస్యలను, అప్పీళ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని సూచించారు. ఈనెల 20న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉన్న అసహనాన్ని దూరం చేయాలని చెప్పారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో వచ్చిన వరదల సందర్భంగా ఆయా జిల్లాల్లో టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు స్వచ్ఛందం గా ముందుకొచ్చి నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజలను ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ బలోపేతం, బలమైన ఉద్యమాల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, కుటుంబ సంక్షేమనిధి ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె సోమశేఖర్, వి శాంతికుమారి, జి నాగమణి, జి సమ్మారావు, కె రవికుమార్, వై జ్ఞానమంజరి, బి రాజు, కె రంజిత్‌కుమార్, జి శ్రీధర్, ఎ సింహాచలం, ఎస్‌వై కొండల్‌రావు, జె యాకయ్యతోపాటు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం ఇంటి సమీపంలో బ్యాగ్ కలకలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో ఓ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పెట్టారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, సీఎం భద్రతా విభాగం అప్రమత్తమయ్యారు. ఆ బ్యాగును ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాన్ని పోలీసులు, జాగిలాలు తనిఖీ చేయగా అందులో ఏమీ లేవని తేలింది. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఆ బ్యాగ్‌ను ఎవరు పడేశారన్న దానిపై వారు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

సమస్య మన బ్యాటింగే?

- స్పిన్‌ను ఆడలేకపోతున్న మన బ్యాటర్లు
- గణనీయంగా తగ్గిన పరుగుల వేట

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌పై కన్నేసిన టీమ్ ఇండియా.. స్వదేశంలో ఐదు టెస్టుల్లో విజయం సాధించటంపై దృష్టి సారించింది. బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లను క్లీన్‌స్వీప్ చేయటంపై కన్నేసిన రోహిత్ సేనకు సొంతగడ్డపై పరుగుల వేట ప్రధాన సమస్యగా తయారైంది!. గత కొన్నేండ్లుగా స్వదేశంలో మన బ్యాటర్లు ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. కీలక టెస్టు సిరీస్‌ల ముంగిట భారత్ ఈ సవాల్‌ను అధిగమించేనా?!.

నవతెలంగాణ క్రీడా విభాగం

ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు భారత్. బలమైన టీమ్ ఇండియాను స్వదేశంలో ఎదుర్కొవటం ఏ జట్టుకు అయినా శక్తికి మించిన పనే. భారత్‌పై స్వదేశంలో టెస్టు సిరీస్ విజయం ఇతర అగ్రజట్లకు సైతం అందని ద్రాక్షగానే మిగిలింది. 2013 టెస్టు సీజన్ ఆరంభం నుంచి స్వదేశంలో భారత్ గెలుపోటముల రికార్డు 40-4. భారత్ తర్వాతి స్థానంలో ఆస్ట్రేలియా (41-7) ఉంది. కానీ గత ఐదేండ్లుగా భారత క్రికెట్‌లో బ్యాటింగ్ గణాంకాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత పదేండ్ల రికార్డు పరిశీలిస్తే.. చివరి ఐదేండ్లలో భారత బ్యాటర్ల పరుగుల వేట గణనీయంగా పడిపోయింది. 2013-2020 వరకు భారత్ బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుతాలు సాధిస్తే.. 2021 నుంచి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. జట్టులో మేటి బ్యాటర్లు ఉన్నప్పటికీ టీమ్ ఇండియా పరుగుల వేట బాగా తగ్గిపోయింది. 2013-2020 వరకు భారత్ స్వదేశంలో 28 టెస్టుల్లో విజయాలు సాధించి, ఓ టెస్టులో ఓటమి చెందింది. ఈ సమయంలో ప్రతి వికెట్‌కు బ్యాటర్లు సగటున 44.05 పరుగులు జోడించారు. ఇదే సమయంలో బౌలర్లు ప్రతి 23.30 పరుగులకు ఓ వికెట్ పడగొట్టారు. బ్యాటర్లు, బౌలర్లు ఉత్తమ ప్రదర్శనతో స్వదేశంలో తిరుగులేని శక్తిగా భారత్ అవతరించింది. ఈ సమయంలో 2015లో మాత్రమే భారత్ బ్యాటింగ్ సగటు 40కి దిగువగా వచ్చింది. ఆ ఏడాదిలో నాణ్యతలేని పిచ్‌లపై దక్షిణాఫ్రికాతో ఐదు టెస్టులు ఆడిన సంగతి తెలిసిందే. 2021 నుంచి భారత్ స్వదేశంలో 17 టెస్టులు ఆడగా.. 12 మ్యాచుల్లో విజయాలు సాధించింది. మూడు టెస్టుల్లో పరాజయం పాలైంది. ఈ సమయంలో బ్యాటింగ్ సగటు 33.40కి పడిపోయింది. 2013-2020 సమయంలో భారత్ బ్యాటింగ్ సగటులో ప్రపంచంలోనే అత్యుత్తమం. కానీ 2021 నుంచి భారత్ స్థానం ఐదుకు పడిపోయింది. 2021 నుంచి స్వదేశంలో టీమ్ ఇండియా బ్యాటింగ్ సమీకరణాలు మారిపోయాయి. 2020 వరకు బ్యాటింగ్ సగటు 48గా ఉండగా.. 2021 తర్వాత అది 33.40కు పడిపోయింది. కానీ బౌలర్లు మాత్రం సత్తా చాటుతూనే ఉన్నారు. బౌలర్లు సగటు 21.29గా కొనసాగించారు. ఈ సమయంలో దక్షిణాఫ్రికా బౌలర్లు మాత్రమే 18.84 సగటుతో భారత బౌలర్ల కంటే మెరుగైన ప్రదర్శన చేశారు. గెలుపోటముల పరంగా భారత్ 12-3 అత్యుత్తమ ప్రదర్శనే..గత ఐదేండ్లలో చూపించిన ఆధిపత్యం తరహా కాదు.

ఎందుకీ తడ'బ్యాటు'

స్వదేశీ టెస్టుల్లో బ్యాటింగ్ సగటు పడిపోవడానికి కారణంగా టాప్ ఆర్డర్ బ్యాటర్ల వైఫల్యం. గత కొంతకాలంగా విరాట్ కోహ్లి ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ యువ బ్యాటర్లు రెచ్చిపోయారు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ శతకాల మోత మోగించారు. విదేశీ బ్యాటర్లకు మన పరిస్థితుల్లో పరుగుల వేట కష్టతరంగానే కొనసాగుతున్నా.. మనోళ్ల సైతం తడబాటుకు లోనవటం ఆందోళనకు దారితీస్తోంది. మన పిచ్‌లపై విదేశీ బ్యాటర్ల బ్యాటింగ్ సగటు 28.51 నుంచి 26.12కు మాత్రమే పడిపోయింది. కానీ మన టాప్ ఆర్డర్ బ్యాటర్ల సగటు 54.43 నుంచి 38.30కు పడిపోయింది. 2021 నుంచి అన్ని జట్లు భారత పర్యటనకు రాలేదు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్ మాత్రమే టెస్టు సిరీస్‌లు ఆడింది. కానీ 2016-2020 సమయంలో న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, అఫ్గనిస్థాన్, దక్షిణాఫ్రికా జట్లు ఇక్కడ టెస్టు సిరీస్‌లో పోటీపడ్డాయి. విదేశీ బ్యాటర్ల బ్యాటింగ్ సగటు 2016-2020తో పోల్చితే 2021 తర్వాత 8 శాతమే తగ్గింది. కానీ భారత బ్యాటర్ల బ్యాటింగ్ సగటు ఏకంగా 29.6 శాతం పడిపోయింది. గత నాలుగేండ్లలో భారత్ స్వదేశంలో మెరుగ్గానే విజయాలు సాధించింది. స్వదేశంలో మన బ్యాటర్ల సగటు 38.3 కాగా.. విదేశీ టెస్టుల్లో 34.78గా నమోదైంది. గతంలో స్వదేశీ, విదేశీ బ్యాటింగ్ సగటుకు పెద్దగా అగాధమే ఉండేది. ఇప్పుడు అది తగ్గినా..ఈ కొలమానంలో తగ్గటం ఆరోగ్యకరం కాదు. గతంలో విదేశీ టెస్టుల్లో బ్యాటింగ్ సగటు 34.90.. సైతం అప్పట్లో ఉత్తమ ప్రదర్శనే.

అజింక్య రహానె, చతేశ్వర్ పుజార 2016-2020 వరకు వరుసగా 39.32, 56.85 సగటు సాధించారు. కానీ 2021 తర్వాత 18.87, 24.53 బ్యాటింగ్ సగటుతో నిరాశపరిచారు. విరాట్ కోహ్లి గతంలో 22 టెస్టుల్లో 86.17 సగటుతో ఏకంగా 10 సెంచరీలు బాదగా.. 2021 నుంచి 11 టెస్టుల్లో 34.47 సగటు మాత్రమే సాధించాడు. ఇందులో ఒక్క సెంచరీ మాత్రమే ఉంది. రోహిత్ శర్మ సగటు గతంలో 101.10 ఉండగా.. ఇటీవల అది 44.87కు పడిపోయింది. కెఎల్ రాహుల్ సగటు 44.25 నుంచి 29.20కు పడిపోయింది. రవీంద్ర జడేజా సగటు 47.61 నుంచి 41.20కు తగ్గింది. రిషబ్ పంత్ సగటు 92 నుంచి 56.87కు పడిపోయింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరచటంతో బ్యాటింగ్ సగటు తగ్గుతూ వస్తోంది. ఇదే సమయంలో బౌలర్లు అత్యుత్తమ ప్రదర్శన చేయటంతో స్వదేశంలో భారత్ గొప్ప విజయాలు సాధించింది. ఇటీవల కాలంలో భారత్ స్వదేశంలో సైతం పేస్ పిచ్‌ల వైపు మొగ్గు చూపటం, ఎస్‌జి బంతిపై పరుగుల వేట గగనంగా మారటం సైతం బ్యాటింగ్ సగటు తగ్గుదలకు కారణాలుగా చెప్పవచ్చు.

భారత్ స్వదేశంలో వరుసగా బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లు ఆడనుంది. బంగ్లాదేశ్‌తో రెండు, న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల్లో పోటీపడాల్సి ఉంది. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో గిల్ 56 సగటుతో 450 పరుగులు చేయగా.. యశస్వి జైస్వాల్ రెండు ద్వి శతకాలతో 89 సగటుతో పరుగులు పిండుకున్నాడు. ప్రధాన బ్యాటర్ విరాట్ కోహ్లి పరుగుల వేటలో జోరందుకుంటే.. గిల్, యశస్వి, రోహిత్ శర్మ సైతం బాదేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రానున్న ఐదు టెస్టుల్లో బ్యాట్‌తో ఏ మేరకు మెప్పిస్తారనే అంశంపై స్వదేశంలో మన బ్యాటింగ్ సమస్య పరిష్కారం ఆధారపడి ఉంది.





ఇండియా-ఏ గెలుపు

- ఇండియా-డితో దులీప్ పోరు



అనంతపురం : దులీప్ ట్రోఫీలో ఇండియా-ఏ వరుసగా రెండో విజయం సాధించింది. అనంతపురంలోని ఆర్‌డీటీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-డిపై 186 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 488 పరుగుల కొండంత ఛేదనలో ఇండియా-డి తేలిపోయింది. తనుశ్ కోటియన్ (4/73), శామ్స్ ములాని (3/117) వికెట్ల జాతర చేయగా.. ఇండియా-డి 82.2 ఓవర్లలో 301 పరుగులకు కుప్పకూలింది. రికీ భుయ్ (113, 195 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో మెరిసినా.. సహచర బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. ఇండియా-ఏ వరుస ఇన్నింగ్స్‌ల్లో 290, 380 పరుగులు చేయగా.. ఇండియా-డి తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులే చేసింది. ఇండియా-ఏ బౌలర్ శామ్స్ ములాని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఇండియా-బి, ఇండియా-సి మధ్య జరిగిన మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇండియా-సి తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోరు చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-బి 332 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-సి 128/4 వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. కానీ మ్యాచ్ ఆఖరు రోజు కావటంతో ఇండియా-బి బ్యాటింగ్‌కు రాకుండానే కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఇండియా-సి మూడు పాయింట్లు సాధించగా, ఇండియా-బి ఓ పాయింట్ ఖాతాలో వేసుకుంది.

ఉత్సాహంగా స్లాన్ కార్పోరేట్ చెస్

విజేతలకు బహుమతులు ప్రదానం

హైదరాబాద్ : స్లాన్ స్పోర్ట్స్, కె రహేజా మైండ్‌స్పేస్ సంయుక్తంగా నిర్వహించిన కార్పోరేట్ చెస్ టోర్నమెంట్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. స్విస్ ఫార్మాట్‌లో జరిగిన చదరంగం పోటీల్లో 50 కంపెనీల నుంచి 150 మంది వరకు పోటీపడ్డారు. ఫణి కానూరి (కేర్లోన్) ఆరు పాయింట్లతో చాంపియన్‌గా నిలువగా.. ఐదు పాయింట్లతో అమర్‌నాథ్ కె (వెల్స్ ఫార్గో) రన్నరప్‌గా నిలిచాడు. వి సాయి కుమార్ (రియల్ పేజి), కార్తీక్ (ఏడీపీ) వరుసగా మూడు, నాల్గో స్థానాల్లో నిలిచారు. కార్పోరేట్ చెస్ టోర్నమెంట్ విజేతలకు రెడ్ ఎఫ్ఎం ప్రతినిధి బద్రీనాథ్ బహుమతులు ప్రదానం చేశారు. స్లాన్ స్పోర్ట్స్ సీఓఓ నవీన్ నాయక్ సహా రహేజా మైండ్‌స్పేస్, మేరాహెూర్డింగ్స్ ప్రతినిధులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మెరిసిన బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్

మహ్మద్ రియాన్‌కు ఐఆర్ఎల్ టైటిల్



చెన్నై : ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో చెన్నై టర్బో రైడర్స్ డ్రైవర్ మహ్మద్ రియాన్ తొలి విజయం సాధించాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్)లో భాగంగా చెన్నైలోని రేసింగ్ ట్రాక్‌లో జరుగుతున్న పోటీల్లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ అలీభాయ్ మెప్పించాడు. నాల్గో రేసులో అగ్రస్థానంలో నిలిచిన అఖిల్ 24.37.329 సెకండ్లలో రేసును ముగించాడు. ఫార్ములా 4 రేసుల్లో భాగంగా జరిగిన మూడు రౌండ్ల రేసుల్లో ముగ్గురు విజేతలుగా నిలిచారు. తొలి రేసులో మహ్మద్ రియాన్, రెండో రేసులో రుహాన్ అల్వా, మూడో రేసులో వీర్ సేత్, నాల్గో రేసులో అఖిల్ అగ్రస్థానం సాధించారు. రెండో రేసులో సైతం మెప్పించి రెండో స్థానంలో నిలిచిన అఖిల్ భాయ్..ఓవరాల్‌గా మెడల్ పోడియంపై రన్నరప్‌గా నిలిచాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ నాల్గో రౌండ్ పోటీలు అక్టోబర్ 19-20న కోయంబతూర్‌లో జరుగున్నాయి.

నవచిత్రం

భావోద్వేగాల సితార



శోభిత ధూళిపాళ

భారతదేశంలోని అతిపెద్ద స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జీ5. దీని నుంచి రాబోతున్న ఒరిజినల్ ఫిల్మ్ 'లవ్, సితార'. ఈనెల27 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనేక భావోద్వేగాల కలయికగా ఈ ఫ్యామిలీ డ్రామా తెరకెక్కింది. ఓ కుటుంబంలోని సభ్యుల మధ్య ఉండే వివిధ రకాలైన సమస్యలను, ఎమోషన్స్‌ను చక్కగా ఎలివేట్ చేసే సినిమా ఇదని ట్రైలర్‌ను చూస్తుంటే అర్థమవుతుంది. రోనీ స్క్రూవాలా ఆర్ఎస్‌విపి మూవీస్ నిర్మాణంలో వందనా కటారియా దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కింది. శోభితా ధూళిపాళ మాట్లాడుతూ,'ఇందులో నటిచడం చక్కటి అనుభూతినిచ్చింది. నేను పోషించిన పాత్రలో అనేక షేడ్స్ ఉన్నాయి. వైవిధ్యమైన పాత్ర. స్వతంత్ర్య భావాలున్న ఇంటీరియర్ డిజైనర్ పాత్రలో నటించాను. నిజాయితీగా ఉండే ఓ అమ్మాయి తన జీవితంలో ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎలా ఎదుర్కొందనేదే కథ. చక్కటి ఫ్యామిలీ ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి' అని అన్నారు. డైరెక్టర్ వందన కటారియా మాట్లాడుతూ, 'ఇది ప్రేక్షకులకు ఓ ఆహ్లాదకరమైన ప్రయాణం. చక్కటి ఫ్యామిలీ డ్రామా. వినోదంతో పాటు ప్రేమ, కుటుంబంలో వ్యక్తుల మధ్య ఉండే భావోద్వేగాలను ఇందులో చక్కగా చూపించాం' అని అన్నారు.



అరవింద్ స్వామి, కార్తీ

నవ్వించే సత్యం.. సుందరం

హీరో కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో రాబోతున్న చిత్రం 'సత్యం సుందరం'. '96' ఫేమ్ సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. టీజర్‌ని విడుదల చేసి మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు.

ఈ టీజర్ కార్తీ, అరవింద్ స్వామిల ప్రపంచాలను పరిచయం చేసింది. వారి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ హైలెట్‌గా ఉంది. వీరిద్దరు డిఫరెంట్ లైఫ్ స్టయిల్‌లో ఆకట్టుకున్నారు. కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు.

'96'లో డ్రామాని డీల్ చేయడంలో తన సత్తా చాటిన దర్శకుడు ప్రేమ్ కుమార్ లీడ్ రోల్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశాడు. కార్తీ, అరవింద్ స్వామి డిఫరెంట్ రోల్స్‌లో మ్యాజిక్ క్రియేట్ చేసారు. ఈ టీజర్ గ్రేట్ ఇంపాక్ట్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో శ్రీ దివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

మహేంద్రన్ జయరాజు కెమెరా పనితనం అద్భుతంగా ఉంది. గోవింద్ వసంత బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఎమోషన్‌ని మరింత ఎలివేట్ చేసింది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈనెల 28న ఈ సినిమా విడుదల కానుంది.

'వైవిధ్యమైన సినిమాలకు, పాత్రలకు అరవింద్‌స్వామి, కార్తీ పెట్టింది పేరు. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమా కచ్చితంగా తెలుగు ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సి.ప్రేమ్ కుమార్, నిర్మాతలు: సూర్య, కార్తీ, సంగీతం: గోవింద్ వసంత, డీవోపీ: మహేందిరన్ జయరాజు, ఎడిటర్: ఆర్ గోవింద్‌రాజ్.


చెప్పలేని అల్లరేదో..

శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్యా అనిల్ కుమార్, వైవా రాఘవ ప్రముఖ పాత్రల్లో నటించిన 'నరుడి బ్రతుకు నటన' మూవీని రిషికేశ్వర్ యోగి తెరకెక్కిస్తున్నారు.

నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, సుకుమార్ బొరెడ్డి, డా. సింధు రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూఛిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్లు మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.

ఈ చిత్రం విడుదలకు ముందే దాదాపు అరవైకి పైగా అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న సంగతి తెలిసిందే. కేరళలోని అందమైన ప్రాంతాల్లో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి మంచి మెలోడీ పాటను రిలీజ్ చేశారు. 'చెప్పలేని అల్లరేదో..' అంటూ సాగే ఈ పాటను చిత్రన్ రచించగా, అనంతు ఆలపించారు. లోపెస్ ఇచ్చిన మెలోడీయస్ ట్యూన్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఎంతో వినసొంపుగా ఉన్న ఈ పాట లిరికల్ వీడియో, అందులో చూపించిన విజువల్స్ మరింత హైలెట్ అవుతున్నాయి. దీంతో సినిమాపై అందరిలోనూ ఆసక్తి పెరిగింది.

ఈ చిత్రానికి రచయిత - ఎడిటర్ - దర్శకుడు: రిషికేశ్వర్ యోగి, కెమెరామెన్ : ఫహద్ అబ్దుల్ మజీద్, సంగీత దర్శకుడు : ఎన్‌వైఎక్స్ లోపెజ్.



శివకుమార్ రామచంద్రవరపు, శృతిజయన్

ప్రజా హక్కుల ఛాంపియన్

(మొదటిపేజీ తరువాయి)

కోసం, సామాజిక పురోభివృద్ధి కోసం కృషి చేశారని ప్రశంసించింది. చైనా-భారత్ స్నేహంలో కూడా ఆయన పాత్ర ఉన్నదని గుర్తు చేసింది. సీపీఐ (ఎం)కు, ఏచూరి కుటుంబానికి సంతాపం తెలిపింది.పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా రాయబారి క్సు ఫైహాంగ్ కూడా చైనా రాయబార కార్యాలయం తరఫున సంతాప సందేశం పంపారు. ఏచూరితో తాను జరిపిన సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీ (పీసీసీ) పక్షాన ఎమిలియో లోజాడా గార్సియా సంతాప సందేశం పంపుతూ భారత్‌లో క్యూబా సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించడంలో ఏచూరి పాత్రను గుర్తు చేశారు. మన దేశంలోని క్యూబా ఎంబసీ ఇన్‌ఛార్జ్ సీపీఐ (ఎం) కేంద్ర కార్యాలయానికి వెళ్లి ఏచూరికి నివాళి అర్పించారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి అందించిన సేవలను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) శ్లాఘించింది. కమ్యూనిస్టు-వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశాలలో (ఐఎంసీడబ్ల్యూపీ) ఆయన భాగస్వామి అయ్యే వారని తెలిపింది. గ్రీస్‌లో ఏచూరి పర్యటనను, రెండు పార్టీల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన పోషించిన పాత్రను ప్రస్తావించింది. పార్టీకి, ప్రజలకు సేవలు అందించడంలో ఏచూరి గౌరవప్రదమైన విప్లవ జీవితాన్ని గడిపారని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ) గుర్తు చేసింది. ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలు సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఏచూరి కన్నుమూయడం విచారకరమని తెలిపింది.

ఏచూరి రాజకీయ చిత్తశుద్ధి, సమగ్రత, ముందుచూపు ఎల్లప్పుడూ గుర్తుంటాయని సైప్రస్‌కు చెందిన ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ (ఏకేఈఎల్) తన సంతాప సందేశంలో తెలియజేసింది. పలు అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, సమావేశాల సందర్భంగా తమ పార్టీ శ్రేణులకు ఏచూరిని కలిసే అవకాశం లభించిందని బెల్జియం వర్కర్స్ పార్టీ (పీటీబీ) తెలిపింది. తుది శ్వాస విడిచే వరకూ విలువలకు కట్టుబడిన సైనికుడని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ (టీకేపీ) కొనియాడింది. ఏచూరి తమ పార్టీకి, దేశ ప్రజలకు మంచి స్నేహితుడని నేపాల్ మాజీ ప్రధాని, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూఎంఎల్) అధ్యక్షుడు కేపీ ఒలి చెప్పారు. రాచరికానికి వ్యతిరేకంగా నేపాల్‌లో జరిగిన పోరాటానికి ఆయన మద్దతు ఇచ్చారని తెలిపారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) కూడా ఏచూరి మృతికి సంతాపం తెలిపింది. ప్రజలకు ఏచూరి అందించిన సేవలను శ్రీలంకకు చెందిన జనతా విముక్తి పెరుమన (జేవీపీ) గుర్తు చేసింది. అంతర్జాతీయ ఉద్యమాలలో ఏచూరి గుర్తించదగిన నాయకుడని శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ (సీపీఎస్ఎల్) తెలిపింది.

పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ), ఆవామీ వర్కర్స్ పార్టీ ఆఫ్ పాకిస్తాన్ కూడా ఏచూరి మృతికి సంతాపం తెలిపాయి. భారత్‌లో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య ఉద్యమానికి ఏచూరి మృతి తీరని లోటని బంగ్లాదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ (డబ్ల్యూబీపీ) చెప్పింది. వెనెజులియా, మెక్సికో, బ్రెజిల్, స్పెయిన్, వర్కర్స్ స్పెయిన్, ఐర్లాండ్, జర్మనీ దేశాల కమ్యూనిస్టు పార్టీలతో పాటు బ్రెజిలియన్ కమ్యూనిస్టు పార్టీ, ఇటలీ కమ్యూనిస్టు రీఫౌండేషన్ పార్టీ, గలిజాన్ పీపుల్స్ ఫోరం, ఇరాన్ టుడెహ్ పార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్ట్ లీగ్ ఆఫ్ బంగ్లాదేశ్, సీపీఎస్, యూనిటీ, నేషనల్ కాంపెయిన్ తదితర పార్టీలు, సంస్థలు ఏచూరి మృతికి సంతాపం తెలిపాయి.



జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు ఏచూరి

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఘన నివాళి

చెన్నయ్ : కమ్యూనిస్టు యోధ సీతారాం ఏచూరికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఘన నివాళులర్పించారు. చెన్నయ్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి చిత్ర పటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. స్టాలిన్‌తో పాటు సీపీఐ, డీఎంకే, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, వివధ ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు ఏచూరి అని జోహార్లు అర్పించారు. వైద్య విద్యా బోధన కోసం తన దేహాన్ని దానం చేసి మరణానంతరం కూడా ప్రజా సేవలో పరితపించిన చిరస్మరణీయ స్ఫూర్తిదాయక నేత అని కొనియాడారు. డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ దేశంలోనే గొప్ప నాయకులు ఏచూరి అని, ఆయనకు తమ పార్టీ తరుపునే కాకుండా వ్యక్తిగతంగానూ తాను ఘన నివాళులర్పిస్తున్నానని తెలిపారు. ఏచూరి మరణం ఒక రాజకీయ రంగానికే కాకుండా దేశ మేధో రంగానికే తీరని లోటు అని చెప్పారు. భావి తరాలకు గొప్ప స్ఫూర్తి ప్రదాత ఏచూరి అని స్మరించుకున్నారు. రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కూడా ఏచూరి ఘన నివాళులర్పించారు. దేశంలో చాలా మంది రాజకీయ నాయకులు కేవలం వారి ప్రయోజనాల కోసమే పరితపిస్తుంటారని, ఎప్పుడెప్పుడు పదవులు అనుభవిద్దామా? అని వెంపర్లాడుతుంటరాని కానీ సీతారాం ఏచూరి లాంటి అతి కొద్దిమంది మాత్రమే తమ జీవితాలను సర్వం ప్రజల కోసమే త్యాగం చేస్తారని కొనియాడారు. ఏచూరి తనకు ఆప్త మిత్రుడుని, రాజ్యసభలో అనేక గంటల పాటు వివిధ అంశాలపై చర్చలు జరిపేవారమని సిబల్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886